అనుదినం... జనస్వరం

Dwaraka

నవతెలంగాణ

సోమవారం 15-1-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 18 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00



పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
నవతెలంగాణ
సంక్రాంతి పండుగ
శుభాకాంక్షలు.
మా కార్యాలయానికి
సోమవారం సెలవు.
మంగళవారం పత్రిక
వెలువడదు.
-చీఫ్ జనరల్ మేనేజర్

సీట్‌బెల్టా నామోషీనా!

- ధరించడానికి 75 శాతం మంది విముఖత
- డ్రెస్సు పాడవుతుందన్నదీ ఓ కారణమేనట..
- దేశంలో రోజుకు 15 ఘోర ప్రమాదాలు వీటివల్లే..

9



త్వరగా ఆఫీసుకు వెళ్లాలనే తొందరలో ఒకరు.. చాలా రోజుల నుంచి కారు నడుపుతున్నాం, ఏం జాగ్రత్తలు తీసుకోవాలో మాకు తెలియదా..? అని మరొకరు.. సీట్‌బెల్ట్ కన్నా అత్యుత్తమైన మార్గాలుండగా అవెందుకని మరి కొందరు.. వాటిని ధరించడం వల్ల మా దుస్తులు పాడవుతున్నాయని ఇంకొందరు.. ఇలా కారణమేదైనా నిర్లక్ష్యానికి మూల్యం ప్రాణాలే. దేశంలో రోజుకు 15మంది సీట్‌బెల్ట్‌లు ధరించక రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని గణాంకాలు భయపెడుతున్నా... కార్ల చోదకులు మాత్రం మారటం లేదు. దీనివల్ల ఎంతోమంది తమ కుటుంబాలకు నిలువ నీడ లేకుండా చేసిన వాళ్లవుతున్నారు. దేశంలో సీట్‌బెల్ట్‌లు ధరించడంపై మారుతీ సుజకీ సంస్థ వెల్లడించిన సర్వేలో విస్తుగొలిపే నిజాలు వెలువడ్డాయి.

మార్చి ముగిసేదాకా వణుకు

- మే దాకా లా నినా ప్రభావం
- ఈ సారి ముందుగానే వర్షాలు : అమెరికా క్లైమెట్ ప్రెడిక్షన్ సెంటర్



న్యూఢిల్లీ: చలి తీవ్రత ఇప్పట్లో తగ్గేలా లేదు. ఎప్పుడైనా సంక్రాంతి తర్వాత చలి క్రమంగా తగ్గుముఖం పడుతుంది. కానీ ఈసారి పరిస్థితి అలా లేదని అమెరికా క్లైమెట్ ప్రెడిక్షన్ సెంటర్ రిపోర్టు వెల్లడించింది. రిపోర్టులోని వివరాల ప్రకారం..ఈనెల నుంచి మార్చి చివరి దాకా చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. లా నినా ప్రభావం(సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత 15 డిగ్రీ సెంటీగ్రేడ్‌ల కన్నా తగ్గిపోవడం) మే నెల దాకా ఉండే అవకాశమున్నది. దీంతో పసిఫిక్ మహా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత భారీగా పడిపోతున్నది. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపించనున్నది. లా నినా ప్రభావం కారణంగా దేశంలో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. మేలో అకాల వర్షాలు పడే అవకాశమున్నది. చలి తీవ్రత మార్చిలో ఉంటే ...9లో

సంక్షేమం అంటే భిక్ష కాదు..
అది ప్రజల హక్కు...

- ఎకరానికి 4 వేలు ఇస్తానంటున్న సీఎం.. గిట్టుబాటు ధర గురించి ఎందుకు మాట్లాడరు...?
- కార్పొరేట్ దోపిడీ, అగ్రకుల ఆధిపత్యం... వీటిపైనే మా పోరు
- 25న బీఎల్ఎఫ్ ఆవిర్భావ సభకు తరలిరండి
- ఆ తర్వాత ఆర్నెల్లపాటు జిల్లాలు, నియోజకవర్గాల్లో పర్యటనలు : పోస్టర్ ఆవిష్కరణలో ఫ్రంట్ నేతలు

3



భారత్‌లో నెతన్యాహూ

ఆరు రోజుల పాటు ఇజ్రాయిల్ ప్రధాని పర్యటన 9

రాజీ మార్గం

- సీనియర్ న్యాయమూర్తులను కలిసిన బార్ కౌన్సిల్ బృందం
- సీజేఐ దీపక్ మిశ్రాతోనూ చర్చలు

2

చీఫ్ జస్టిస్‌కు మాజీ న్యాయమూర్తుల లేఖ 2



మీడియాతో మాట్లాడుతున్న బీసీఐ చైర్మెన్

 జాతీయం

నవతెలంగాణ


మరో రెండు మృతదేహాలు లభ్యం

- ఓఎన్‌జీసీ హెలికాప్టర్ ప్రమాద ఘటన

ముంబయి: అయిల్ అండ్ నేచరల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) సిబ్బందితో వెళ్తున్న హెలికాప్టర్ కూలిపోయిన ఘటనలో ఆదివారం మరో రెండు మృతదేహాలను రెస్క్యూ బృందాలు వెలికితీశాయి. గాలింపు చర్యలను ఓన్ఎన్‌జీసీ సీఎండీ శశిశంకర్ పర్యవేక్షిస్తున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పటివరకూ ఆరు మృతదేహాలు లభ్యమైనాయి. మరొకరి కోసం రెస్క్యూ సిబ్బంది గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

సమ్మిళిత, సామాజిక ఆర్థిక విధానాలే భారత్‌కు మేలు

- సమతుల్యతలేని వృద్ధి వల్ల జీవన నాణ్యత మెరుగుపడదు
- సంక్షేమం ఖర్చు పెరగాలి : ఆర్థికవేత్త జీన్‌డ్రెజే



న్యూఢిల్లీ: భారత్‌లో సమ్మిళిత, సామాజిక అభివృద్ధి ఆర్థిక విధానాలను అనుసరించాలని ప్రముఖ ఆర్థికవేత్త జీన్‌డ్రెజే సూచించారు. వృద్ధి రేట్ అధికంగా ఉన్న సందర్భాల్లోనూ దేశంలోని మెజారిటీ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడలేదని ఆయన స్పష్టం చేశారు. నిరుద్యోగులు అధికంగా ఉండటం, కార్మికుల వేతనాలు తక్కువగా ఉండటం ఆర్థిక వృద్ధిలో సమతుల్యత లోపించిందనేందుకు ఉదాహరణలని జీన్‌డ్రెజే గుర్తు చేశారు. దేశ ఆర్థికవృద్ధి వేగంగా కొనసాగుతున్న దశలోనూ ప్రజల జీవన నాణ్యతలో మెరుగుదల నెమ్మదిగా జరగడం ఆందోళన కలిగించే అంశమని ఆయన వివరించారు. ప్రపంచ ప్రమాణాలతో పోలిస్తే భారత్‌లో జీడీపీకి అనుగుణంగా సామాజిక అవసరాలకు(సంక్షేమానికి) ఖర్చు చేస్తున్నది చాలా తక్కువని ఆయన విశ్లేషించారు. మహిళల భాగస్వామ్యాన్ని, శ్రామిక శక్తిని పెంచడం, వేతనాలను వృద్ధి చేయడం ద్వారానే భారత్ సమతుల్య అభివృద్ధిని సాధిస్తుందని జీన్‌డ్రెజే స్పష్టం చేశారు. అభివృద్ధి ఆర్థికవేత్తగా పేరున్న జీన్‌డ్రెజే భారత్‌లో ఆకలి, కరువు సమస్యల నివారణ కోసం కృషి చేసినవారిలో ఒకరు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపకల్పనలోనూ జీన్‌డ్రెజేది ప్రముఖ పాత్ర.

దళిత బాలికపై లైంగికదాడి, హత్య

- మృతదేహాన్ని ముక్కలుగా చేసిన దుండగులు

చండీగఢ్: దళిత బాలికపై కొందరు దుండగులు లైంగికదాడికి పాల్పడి దారుణంగా హత్య చేశారు. ఆ దుర్మార్గులు అంతటితో ఆగకుండా మృతదేహాన్ని ముక్కలుగా చేశారు. ఈ ఘటన హర్యానాలోని కురుక్షేత్ర జిల్లాలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. జిల్లాలోని బందాఖేడా గ్రామానికి చెందిన దళిత బాలిక(15) పదో తరగతి చదువుతున్నది. కాగా.. ఆమె ఈనెల 9న కనిపించకుండా పోయింది. దీంతో ఆమె తండ్రి.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా.. బందాఖేడా గ్రామ సమీపంలో ఉన్న కాలువలో బాలిక శవం పడి ఉండటాన్ని శనివారం కొందరు గుర్తించి.. పోలీసులకు సమాచారమందించారు. బాలికపై కొందరు వ్యక్తులు సామూహిక లైంగికదాడికి పాల్పడి హత్య చేసినట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిందని సీనియర్ ఎస్పీ అరుణ్‌కుమార్ వెల్లడించారు. మృతదేహం ముక్కలై ఉన్నదని, ప్రయివేటు పార్టుల్లో పదునైన ఆయుధాలు జొప్పించినట్టు గాయాలున్నాయని ఆయన తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఢిల్లీ పార్కులో దుండగుల దాడి



- యువకుని మృతి.. మరొకరికి గాయాలు
- కేసు నమోదు చేసిన పోలీసులు

న్యూఢిల్లీ : దక్షిణ ఢిల్లీ గోవిందపురిలోని ఒక పార్క్‌లో జరిగిన దాడి ఘటనలో 22 ఏండ్ల యువకుడు మృతి చెందగా, అతని స్నేహితురాలికి తీవ్ర గాయాలయ్యాయి. జామియా హదార్డ్ ఆసుపత్రి సమీపంలోని మంకీపార్క్‌లో శనివారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ఈ సంఘటనలో దాడికి గురైన యువకుడు నరేష్ అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు నరేష్ స్థానిక త్రిలోక్‌పురి ప్రాంతానికి చెందినవాడు. నరేష్ పైనా, అతని స్నేహితురాలిపైనా పార్కులో దాడి జరిగినట్లు శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో తమకు ఫోను వచ్చిందని పోలీసులు తెలిపారు. వారి వద్ద ఉన్న విలువైన వస్తువులు తమకు ఇచ్చేయాలని దుండగులు బెదిరించడంతో వారు ప్రతిఘటించారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో దుండగులు నరేష్‌ను కత్తితో పొడిచి, అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకుని దుండగులు పారిపోయారు.

ఈ సమాచారం అందుకున్న పోలీసులు.. తాము అక్కడికి వెళ్ళే సరికి నరేష్ నెత్తురు మడుగులో ఉన్నాడని, అతని శరీరానికి పలు చోట్ల గాయాలయ్యాయని తెలిపారు. ఆ యువతికి కూడా గాయాలయ్యాయని, ఇద్దరిని సమీప ఆసుపత్రికి తరలించామని, కానీ ఆసుపత్రికి తీసుకు వెళ్ళే సమయానికే నరేష్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

వలసొచ్చి.. కనువిందు చేసి..



ఆంధ్రప్రదేశ్‌లోని పులికాట్ సరస్సులో ఫ్లెమింగో పక్షుల కోలాహలం

సీనియర్ జడ్జీలకు మద్దతుగా

- సీజేఐకి మాజీ న్యాయమూర్తుల లేఖ



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో పాలన వ్యవస్థ సరిగా లేదంటూ గొంతు విప్పిన సీనియర్ జడ్జీలకు మాజీ న్యాయమూర్తులు మద్దతు తెలిపారు. ఈ క్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాకు వారు బహిరంగ లేఖ రాశారు. అత్యున్నత న్యాయస్థానంలో జరుగుతున్న పాలనా వ్యవహారాలపై నలుగురు జడ్జీలు చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తున్నట్టు వారు తమ లేఖలో పేర్కొన్నారు. లేఖ రాసిన వారిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పిబి సావంత్, ఢిల్లీ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎపి షా, మద్రాస్, బాంబే హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు కె చంద్రు, హెచ్ సురేశ్‌లు ఉన్నారు. లేఖను మీడియాకు అందజేయడంతో సోషల్‌మీడియాలో అది వైరల్ అయ్యింది. కేసులను బెంచ్‌లకు కేటాయించే విషయమై నిరసన తెలుపుతూ సీనియర్ న్యాయమూర్తులు శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. కేసుల కేటాయింపులో సీనియర్ జడ్జీల అభ్యంతరాలు సరైనవేనని, న్యాయవ్యవస్థలో నెలకొన్న సంక్షోభాన్ని జ్యుడీషియరీ పరిధిలోనే పరిష్కరించుకోవాలని లేఖలో సూచించారు. ఈ సంక్షోభం సమసిపోయేంత వరకూ కీలక కేసులను సీనియర్ న్యాయమూర్తులతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలని కోరినట్టు షా వెల్లడించారు. కేసుల కేటాయింపు ముఖ్యంగా సున్నితమైన కేసులను వివిధ బెంచ్‌లకు కేటాయించడంలో సరైన ప్రమాణాలు పాటించలేదనే అంశం తీవ్రమైందని తెలిపారు. పద్ధతి ప్రకారం ఆయా బెంచ్‌లకు కేసుల కేటాయింపు జరగడం లేదని, జూనియర్ జడ్జీలకు బెంచ్‌లకూ కీలక కేసుల కేటాయింపు పట్ల నలుగురు న్యాయమూర్తుల ఆందోళన సరైందేనని అన్నారు. కేసుల కేటాయింపు సరిగ్గా లేక పోవడం న్యాయ నిర్వహణ, చట్ట నిబంధనలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని లేఖలో పేర్కొన్నట్టు వివరించారు. కేసులను బెంచ్‌లకు కేటాయించే విషయమై ఓ స్పష్టమైన విధానాన్ని రూపొందించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ, సుప్రీంకోర్టు పనితీరుపై ప్రజల్లో విశ్వాసం కోల్పోకముందే జాగ్రత్తపడాలని మాజీ న్యాయమూర్తులు.. లేఖలో సూచించారు.

రాజీ మార్గం

- సీనియర్ న్యాయమూర్తులను కలిసిన బార్ కౌన్సిల్ బృందం
- సీజేఐ దీపక్ మిశ్రాతోనూ చర్చలు



సుప్రీంకోర్టులో నెలకొన్న సంక్షోభాన్ని రాజీ కుదర్చటానికి ఏడుగురు సభ్యులు గల బార్‌కౌన్సిల్ బృందం ఆదివారం సీనియర్ న్యాయవాదులు చలమేశ్వర్, ఎంబి లోకూర్, జోసెఫ్ కురియన్‌లను కలిసింది. ఈ బృందానికి మనన్ కుమార్ మిశ్రా నేతృత్వం వహించారు. మరో న్యాయమూర్తి రంజన్ గొగోయ్‌తో సమావేశమయ్యారా? లేదా? అన్నదానిపై ప్యానెల్ ఎలాంటి వివరణా ఇవ్వలేదు. సీనియర్ న్యాయమూర్తులు శుక్రవారం చేసిన ఆరోపణలతో నెలకొన్న సంక్షోభం ఇంకా సద్దుమణగలేదు. ఈ వివాదానికి తెరదించటానికి సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్ రంగంలోకి దిగింది. ఇప్పటికే జస్టిస్ చలమేశ్వర్‌తో భేటీ అయిన కౌన్సిల్ బృందం.. సీజేఐ దీపక్ మిశ్రాను కూడా కలిసింది. కాగా.. న్యాయవ్యవస్థలో నెలకొన్న సంక్షోభం త్వరలోనే సమసిపోతుందని బార్ కౌన్సిల్ బృందానికి దీపక్ మిశ్రా హామీ ఇచ్చారు. మరోవైపు... తాము లేవనెత్తిన ఏడు పేజీల ప్రశ్నలకు సీజేఐ సమాధానం చెప్పేదాకా వెనక్కి తగ్గబోమనే ఆలోచనలో.. ఆ నలుగురు న్యాయమూర్తులు ఉన్నట్టు తెలిసింది.

రైతులకు ప్రయోజనాలు చేకూరినప్పుడే జీడీపీ వృద్ధి

- కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ: దేశంలో కీలకమైన వ్యవసాయ రంగం ప్రయోజనాలు పొందినప్పుడే జీడీపీ వృద్ధి సాధ్యమని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ఆదివారం నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్ ఎక్స్ఛేంజ్(ఎన్‌సీడీఈఎక్స్)లో గోధుమ విత్తనాల ఆప్షన్స్ ట్రేడింగ్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ...ఈ ట్రేడింగ్ రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని, పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే రానున్న రోజుల్లో చాలా ప్రయోజనకరమని తెలిపారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న వాటిలో భారత ఆర్థిక వ్యవస్థ ఒకటి. దీని వల్ల వివిధ రంగాల్లో ప్రజలకు ప్రయోజనం చేకూరుతున్నది. అయితే ఎక్కువ శాతం జనాభా వ్యవసాయరంగంపై ఆధారపడటం వల్ల లాభాలు ఉండటం లేదని జైట్లీ అన్నారు. ప్రాధాన్యత ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయరంగం ఉన్నత స్థాయిలో ఉందని, అక్కడ వృద్ధి రేటు కూడా పెరుగుతోందని చెప్పారు. "కొన్ని ప్రాంతాల్లో అధిక ఉత్పత్తి వల్ల ధరలు పడిపోతున్నాయి. దాంతో పంటలకు సరైన ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులను ఈ సంక్షోభం నుంచి బయటపడేయడానికి కొన్నేండ్ల నుంచి ఎన్నో చర్యలు చేపట్టినప్పటికీ దాని ప్రభావం ఇంకా మిగిలేవుందని" ఆయన అన్నారు. సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్(సీఎస్ఓ) తాజా గణాంకాల ప్రకారం 2017-18 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, ఉత్పాదక రంగాల్లో వృద్ధి రేటు 4 సంవత్సరాల కనిష్టానికి అంటే 6.5 శాతానికి తగ్గుతుందని అంచనా.

సీపీఐ(ఎం) ఎమ్మెల్యే రామచంద్రన్ కన్నుమూత



తిరువనంతపురం: కేరళలో సీపీఐ(ఎం) ఎమ్మెల్యే కెకె రామచంద్రన్ నాయర్(65) చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో ఆదివారం ఉదయం కన్నుమూసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. గత కొన్నిరోజులుగా ఆయన కాలేయ సంబంధ వ్యాధితో బాధపడుతున్నారు. అలప్పుజ జిల్లా చెంగనూరు నియోజకవర్గం నుంచి 2016లో ఆయన శాసన సభ్యుడిగా మొదటిసారి ఎన్నికయ్యారు. రామచంద్రన్ ఒక న్యాయవాది.. మృదు మాటకారి అయిన ఆయన.. కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే క్రియాశీలక రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఎస్ఎఫ్ఐ అలప్పుజ, తిరువనంతపురం జిల్లాల కమిటీల్లో పని చేశారు. ఎస్ఎఫ్ఐ తరపున న్యాయ కళాశాల సంఘం చైర్మెన్‌గా కూడా ఉన్నారు. తన వామపక్ష భావజాలాన్ని కొనసాగించడానికి సీపీఐ(ఎం) పార్టీలో చేరారు. దేశంలో ఎమర్జెన్సీ కాలంలో ఆయన జైలుకు కూడా వెళ్లారు. రామచంద్రన్ మృతికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, అసెంబ్లీ స్పీకర్ శ్రీరామ కృష్ణన్.. సంతాపం ప్రకటించారు.

అంతర్జాతీయం

భయంతో వణికిపోయిన హవాయి ప్రజలు

- క్షిపణి దాడి జరుగుతోంది.. అంటూ మొబైల్ ఫోన్లకు సందేశాలు
- తప్పుడు వార్త అని తేలడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు



హవాయి : "మనకు బాలిస్టిక్ మిస్సైల్ ముప్పు పొంచి ఉంది. ఇది డ్రిల్ కాదు. మీరు బయట ఉంటే వెంటనే దగ్గర్లో ఉన్న ఇళ్లలోకి వెళ్లండి. కిటికీల పక్కన కూడా ఉండొద్దు" అంటూ.. మొబైల్ ఫోన్లకు సందేశాలు వస్తే ఏం చేస్తారు? తీవ్ర భయాందోళనకు గురై, వణుకువస్తుంది కదూ! సరిగ్గా ఇలాంటి పరిస్థితినే ఆదివారం నాడు అమెరికాలోని హవాయి ప్రజ లు ఎదుర్కొన్నారు. అసలే అమెరికా, ఉ.కొరియా మధ్య మాటల యుద్ధం సాగుతోంది. మా దగ్గర బాంబు ఉందంటే, మాదగ్గర అంతకన్నా పెద్దబాంబు ఉందని ఇరు దేశాల అధినేతలు మాటలతో హెచ్చరికలు జారీ చేశారు. వీటికి తోడు తమ రాష్ట్రం ఉత్తర కొరియా క్షిపణి పరిధిలోకి వస్తుంది. దీంతో తమకు ఇదే చివరి రోజని హవాయి ప్రజలు డిసైడయ్యా రు. మరి కొద్దిసేపట్లో తమ ప్రాణాలు గాల్లో కలిసిపోవడం ఖాయమనే భావనకు వచ్చారు. బాలిస్టిక్ క్షిపణి మన వైపు దూసుకు రాబోతోందని ప్రజల ఫోన్లకు సందేశాలు వెళ్లడంతో పాటు.. టీవీలు, రేడియోలు పదే పదే ఈ వార్తను ప్రసారం చేయడంతో జనం హడలిపోయారు. అది తప్పుడు వార్త అని 18 నిమిషాల తర్వాత ఈమెయిల్ వచ్చింది. కానీ ప్రజల ఫోన్లకు 38 నిమిషాల తర్వాతే ఆ విషయమై సందేశం అందింది. దీంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

ఐరాసలో భారత ప్రతినిధి ట్విట్టర్ హ్యాక్



న్యూయార్క్ : ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి సయీద్ అక్బరుద్దీన్ ట్విట్టర్ ఖాతా ఆదివారం ఉదయం హ్యాకింగ్‌కు గురైంది. ఆయన ట్విట్టర్ ఖాతాలో పాకిస్థాన్ జెండాను, ఆ దేశ అధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్ ఫొటోను పోస్టు చేశారు. దీంతోపాటు అక్బరుద్దీన్ ట్విట్టర్ ఖాతాకు ఉండే వెరిఫైడ్‌బ్లూ కలర్ టిక్‌మార్క్ కూడా హ్యాకింగ్ సమయంలో అదృశ్యమైంది. ఆయన చేసిన పలు ట్వీట్లను కూడా హ్యాకర్లు తొలగించారు. ఆయన ట్విట్టర్ ఖాతా హ్యాకింగ్ గురైన విషయాన్ని పలువురు నెటిజన్లు ట్వీట్లు చేయడంతో విషయం బయటకు వచ్చింది. దీనిపై స్పందించిన ట్విట్టర్ ఇండియా వెంటనే ఆయన ఖాతాను పునరుద్ధరించింది. ఈ విషయాన్ని అక్బరుద్దీన్ ధ్రువీకరించారు. మళ్లీ తన ఖాతా తిరిగి వచ్చిందని ఆయన ట్వీట్ చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు ఇటీవల కాలంలో భారత ప్రభుత్వ అధికారులను లక్ష్యంగా చేసుకొని సైబర్ అటాక్‌కు పాల్పడుతున్నారు.



కొద్దిలో తప్పింది..



- రన్‌వే నుంచి జారి.. సముద్రం వైపునకు..
- టర్కీలో బోయింగ్ విమాన ప్రమాదం

అంకారా: ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 162 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానం రన్‌వే నుంచి జారి పక్కనే ఉన్న సముద్రం వైపు దూసుకెళ్లింది. ఈఘటన టర్కీ రాజధాని అంకారాలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. టర్కీలోని ట్రాబ్జాన్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన బోయింగ్ 737-800 విమానం రన్‌వేపై మంచు ఎక్కువగా ఉండడంతో అదుపు తప్పి పక్కకు జారిపోయింది. దాంతో రన్‌వేకు సమీపంలోని నల్ల సముద్రం వైపు దూసుకెళ్లింది. అదృష్టం బాగుండి విమానం పూర్తిగా సముద్రంలోకి జారిపోకుండా కొండ అంచున మట్టిలో ఇరుక్కుపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే గమనించిన ఎయిర్‌పోర్ట్ అధికారులు ముందుగా విమానంలోని మహిళల్ని, పిల్లల్ని జాగ్రత్తగా బయటికి తరలించారు.

ఆ తరువాత విమానాన్ని బయటికి తీసి మరమ్మతులు చేశారు. విమానం సముద్రంలోకి పడిపోతున్నప్పుడు తీసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సంచలనం రేపింది. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

పెరూలో భూకంపం.. సునామీ హెచ్చరిక

లిమా: దక్షిణ అమెరికా దేశం పెరూలో ఆదివారం భూకంపం సంభవించింది. భూకంప లేఖినిపై 7.3 తీవ్రతతో ప్రకంపనలు నమోదైనట్టు అమెరికా జియోలాజికల్ సర్వే అధికారులు ధ్రువీకరించారు. పుక్వికో పట్టణానికి ఈశాన్యంలో 124 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్టు తెలిపింది. భూకంప కేంద్రానికి 300 కిలోమీటర్ల పరిధిలో సునామీ సంభవించే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. ఈ మేరకు సునామీ హెచ్చరికను జారీ చేశారు. ఒక్కసారిగా భూమి కంపించడంతో ఇండ్ల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో బయటకు పరుగులుతీశారు. అంతటా తీవ్ర భయాందోళన నెలకొన్నది. భూకంప ప్రమాదంలో ఇప్పటి వరకు ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. భూ ప్రకంపనలు వచ్చిన ప్రదేశానికి సమీపంలో దాదాపు కోటి మంది ప్రజలు నివసిస్తున్నారు.

హిజాబ్, రంజాన్‌పై నిషేధం ప్రకటించండి !

బ్రిటన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ప్రముఖ పాఠశాల



లండన్ : స్కూలు చిన్నారులు రంజాన్ ఉపవాసం, హిజాబ్ ధరించటంపై నిషేధం ప్రకటించాలని బ్రిటన్‌లోని ప్రముఖ పాఠశాల 'సెయింట్ స్టీఫెన్' అక్కడి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 8 ఏండ్ల లోపు బాలికలు హిజాబ్ ధరించటాన్ని ఈ పాఠశాల యాజమాన్యం 2016లో నిషేధం విధించి వార్తల్లో నిలిచింది. ఇప్పుడు 11 ఏండ్లలోపు బాలికల విషయంలోనూ నిషేధాన్ని అమలుజేయాలని పాఠశాల కోరుతోంది. ఇందుకు సంబంధించి తగిన ఆదేశాలు జారీ చేయాల్సిందిగా బ్రిటన్ ప్రభుత్వాన్ని సెయింట్ స్టీఫెన్ స్కూల్ డిమాండ్ చేసింది. అయితే పాఠశాల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్కూల్‌లో ఎక్కువగా ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందినవారి పిల్లలు చదువుకుంటున్నారు. బ్రిటన్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రైమరీ స్కూల్స్ జాబితాలో 'సెయింట్ స్టీఫెన్' మొదటిస్థానంలో ఉంది. 'స్కూల్స్ గైడ్ 2018' జాబితాలోనూ ముందు స్థానంలో నిలిచింది. ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఈ పాఠశాలకు భారత సంతతికి చెందిన నీనాలాల్ నేతృత్వం వహిస్తున్నారు. పాఠశాల పరిసరాల్లో ముస్లిం బాలబాలికల మత సాంప్రదాయలపై మార్గదర్శకాలు విడుదల చేయాల్సిందిగా బ్రిటన్ ప్రభుత్వాన్ని నీనాలాల్ కోరుతున్నారు. హిజాబ్ ధరించటం, రంజాన్ ఉపవాస దీక్ష అంశాలపై పాఠశాలలు ఎలాంటి నిబంధనల్ని పాటించాలో తెలియజేయాల్సిన అవసరముందని నీనాలాల్ అంటున్నారు. పాఠశాల గవర్నర్స్ ఛైర్మన్ ఆరిఫ్ క్వావీ మాట్లాడుతూ..."ముస్లిం విద్యార్థుల తల్లిదండ్రుల్లో కొంతమంది తమ డిమాండ్‌ను సమర్థిస్తుండగా, మరికొంత మంది వ్యతిరేకిస్తున్నారు. సెలవురోజుల్లో రంజాన్ ఉపవాసం పాటించమని విద్యార్థులకు సూచిస్తున్నాం. అంతేగానీ రంజాన్ పాటించవద్దని చెప్పటం లేదు. పాఠశాల క్యాంపస్‌లో ఉన్నన్ని రోజులూ వారి ఆరోగ్యానికి సంబంధించి మేము బాధ్యత వహించాలి కాబట్టి, ఈ డిమాండ్‌ను ముందుకు తెచ్చా"మని చెప్పారు.



ట్యునీషియాలో ఆగ్రహ జ్వాలలు

టునిస్ : దేశంలో నెలకొన్న నిరుద్యోగం, అధిక ధరలు, దిగజారిన ఆర్థిక పరిస్థితులపై ట్యునీషియా ప్రజల్లో పెద్ద ఎత్తున ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా రాజధాని టునిస్‌తో సహా అనేక చోట్ల లక్షలాదిమంది ప్రజలు రోడ్లమీదకు వచ్చి ఆందోళనలు జరుపుతున్నారు. జనవరి 7 నుంచి ప్రారంభమైన నిరసన ప్రదర్శనల్లో ప్రతిపక్ష పార్టీలన్నీ పాల్గొన్నాయి. 2011లో అప్పటి అధ్యక్షుడు అబెదిన్ బెన్ అలీని గద్దె నుంచి దించివేయటంతో ట్యునీషియా అంతర్యుద్ధంలోకి వెళ్లిపోయింది. రాజకీయ అస్థిరత, హింస దేశ ఆర్థికపరిస్థితిని మరింత దిగజార్చింది. బెన్ అలీని గద్దెదించి ఏడేండ్లయిన సందర్భంగా ఆదివారంనాడు ప్రజలంతా వీధుల్లోకి వచ్చారు. ఈ నేపథ్యంలో 800 మంది నిరసనకారుల్ని పోలీసులు అరెస్టు చేశారు. నిరసనల నేపథ్యంలో ప్రస్తుత అధ్యక్షుడు బెజీ కైద్ ఎస్సెబ్సీ ప్రభుత్వ ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశాన్ని జరిపారు.

అట్టుడుకుతున్న పాకిస్థాన్

'జైనాబ్' లైంగిక హత్య ఘటనపై ప్రజాగ్రహం

కసూర్ (పాకిస్తాన్) : ఏడేండ్ల బాలిక జైనాబ్‌పై పైశాచికత్వంగా దాడిచేసి, హత్య చేసి...చెత్త బుట్టలో పడేసిన సంఘటనతో పాకిస్తాన్‌లో ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. కసూర్ నగరంలో ప్రజలు పెద్ద సంఖ్యలో రోడ్లమీదకు వచ్చి పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. దోషుల్ని పట్టుకొని శిక్షించాలని, బాధిత కుటుంబానికి సరైన న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మొత్తం పాకిస్తాన్ అంతా ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేసింది. బాలికలపై రోజు రోజుకీ పెరుగుతున్న లైంగికదాడులు, హత్యా ఘటనలు తీవ్రంగా కలిచివేస్తున్నాయి. పాక్ ప్రభుత్వం, పోలీసుల తీరుపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతున్నది. వివిధ నగరాల్లో ప్రజలు రోడ్లమీదకు వచ్చి ప్రదర్శనలు జరిపారు. 2017లో ఇలాంటి ఘటనలు ఒక్క కసూర్ జిల్లాలోనే 12 జరిగాయి. స్వచ్ఛంద సేవా సంస్థ 'సాహిల్ చైల్డ్ ప్రొటక్షన్ గ్రూప్' లెక్క ప్రకారం, పాకిస్తాన్‌లో గతేడాది తొలి ఆరు నెలల్లో చిన్నారులపై 1750 లైంగికదాడులు జరిగినట్టు తెలియజేసింది. చిన్నారులను కూడా కాపాడలేని ఈ పోలీసు వ్యవస్థ ఎందుకంటూ ప్రశ్నిస్తూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పంజాబ్ ప్రావిన్సులోని కసూర్ పట్టణంలో ఈ దారుణం చోటు చేసుకుంది. జైనాబ్(7) తల్లిదండ్రులు ఉమ్రా యాత్రకు సౌదీ అరేబియా వెళ్లారు. దీంతో జైనాబ్‌ను వాళ్ల ఆంటీ వద్ద వదిలేశారు. గత మంగళవారం ఖురాన్ చదువుకునేందుకు బయటకు వెళ్లిన జైనాబ్ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన జైనాబ్ ఆంటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఐదు రోజుల తర్వాత బాలిక ఇంటికి ఒక మైలు దూరంలో ఉన్న చెత్తకుప్పలో జైనాబ్ మృతదేహాన్ని గుర్తించారు.



జైనాబ్ (ఫైల్)

జైనాబ్‌పై లైంగికదాడి జరిగిందని, ఆ తర్వాత హత్య చేశారని శవపరీక్షలో తేలిందని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన పాకిస్తాన్ ప్రజలను షాక్‌కు గురి చేసింది. చిన్నారులపై ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్న రాక్షసుడ్ని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

బ్రిటన్ పెద్దగా ఆసక్తి చూపలేదు..

- అందుకే ట్రంప్ పర్యటన రద్దు : ది సండే టైమ్స్ కథనం

లండన్: బ్రిటన్ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ప్రేమ చూపించలేదని ఆ దేశ పర్యటన రద్దు చేసుకున్నారట. ఈ విషయా న్ని ట్రంప్ సన్నిహితుడొకరు అక్కడి మీడియా వర్గాలతో చెప్పినట్టు సమాచారం. 'ది సండే టైమ్స్' కథనం ప్రకారం.. బ్రిటన్‌కు ట్రంప్ రావడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారట. దీనికితోడు లండన్ మేయర్ సాదిక్‌ఖాన్ కూడా ట్రంప్‌నకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడంతో ఆయన బ్రిటన్ పర్యటను రద్దు చేసుకున్నట్టు ఆ కథనంలో పేర్కొన్నారు. బ్రిటన్ ప్రభుత్వం ట్రంప్ పర్యటనపై పెద్దగా ఆసక్తి చూపించకపోవడంతో ఆ దేశానికి వెళ్లానే ఆలోచనను విరమించుకున్నట్టు ఆ పత్రిక పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే నెల 26, 27తేదీల్లో లండన్‌లో పర్యటించాల్సి ఉంది. లండన్‌లో అమెరికా ఎంబసీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించాల్సి ఉంది. కానీ ఆయన ఆ కార్యక్రమానికి హాజరుకాబోనని ఇటీవల ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. గత ఒబామా ప్రభుత్వం సెంట్రల్ లండన్‌లో ఉన్న అమెరికా ఎంబసీ కార్యాలయాన్ని మరో చోటుకు తరలించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒబామా లండన్ ఎంబసీని అత్యంత తక్కువ మొత్తానికి అమ్మేశారని.. ఇది చాలా చెత్త డీల్ అని ట్రంప్ ట్వీట్ చేశారు. అందుకే తాను కొత్త కార్యాలయం ప్రారంభించేందుకు వెళ్లడం లేదని చెప్పుకొచ్చారు.

సంక్షేమం అంటే భిక్ష కాదు..

అది ప్రజల హక్కు...



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామనర్సయ్య, జానకిరాములు, పిఎల్, నల్లాసూర్యప్రకాశ్, తమ్మినేని, అశోక్, ఖాన్ సహబాజ్ అలీ ఖాన్, చెరుపల్లి, గొర్రె రమేశ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'సంక్షేమం అంటే ప్రజలకు బిచ్చమెయ్యటం కాదు.. అది వారి హక్కు...' అని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) నేతలు వ్యాఖ్యానించారు. ఎకరానికి నాలుగు వేల రూపాయల చొప్పున రైతులకు ఆర్థిక సాయం చేస్తామంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్.. అసలు గిట్టుబాటు, మద్దతు ధరల గురించి ఎందుకు మాట్లాడటం లేదంటూ వారు ప్రశ్నించారు. బీసీలకు గొర్రెలు, బర్రెలు ఇస్తున్నారు సరే.. కానీ వారి సబ్‌ప్లాన్ మాటేమిటని నిలదీశారు. షాదీ ముబారక్ గురించి ఊదరగొడుతున్న ప్రభుత్వాధినేతలు.. మైనారిటీలకు ఉప ప్రణాళిక, వారికి 12 శాతం రిజర్వేషన్ల గురించి ఎందుకు పట్టించుకోవటం లేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వారికే ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్‌తోపాటు ప్రస్తుత టీఆర్ఎస్‌తోనూ ఇలాంటి సమస్యలకు పరిష్కారం దొరకటం లేదని వారు స్పష్టం చేశారు. ఈ రెండు పార్టీలతోపాటు విధానాలపరంగా బీజేపీ, టీడీపీ తదితర పార్టీలన్నీ ఒకేతాను ముక్కలని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రజా ప్రత్యామ్నాయంతో ముందుకు రాబోతున్న బీఎల్ఎఫ్ అధికారంలోకి వస్తే వీటన్నింటిపై చట్టాలు రూపొందించి అమలు చేస్తామని తెలిపారు.

బీఎల్ఎఫ్ ఆవిర్భావ సభ ఈనెల 25న హైదరాబాద్(వనస్థలిపుం ఎమ్‌వీ రెడ్డి ఫంక్షన్ హాల్)లో జరగనున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫ్రంట్ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రస్తుతం రెండు కోణాల్లో చూడాలి.. అదే విధంగా ఇక్కడి సమాజం రెండు కాళ్లతో నడుస్తున్నదని తెలిపారు. వీటిలో ఒకటి కార్పొరేట్ దోపిడీ కాగా రెండోది అగ్రకుల ఆధిపత్యమని వివరించారు. ఈ రెండింటి నుంచి రాష్ట్రాన్ని విముక్తం చేయాల్సిన అవసరముందని అన్నారు. ఈనెల 25న ఫ్రంట్ ఆవిర్భావ సభ తర్వాత ఆర్నెల్లపాటు అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో తమ నేతలు పర్యటిస్తారని చెప్పారు. తద్వారా రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తామని వివరించారు. తమ ఫ్రంట్ అధికారంలోకి వస్తే మార్కెట్ దోపిడీ నుంచి రైతుల్ని విముక్తి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం న్యాయ వ్యవస్థలో నెలకొన్న సంక్షోభాన్ని, సమస్యలను న్యాయమూర్తులే పరిష్కరించుకోవాలని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. లేదంటే రాష్ట్రపతిగాని, ఇతర పెద్దలుగానీ జోక్యం చేసుకుని సంక్షోభాన్ని నివారించాలని సమాధానమిచ్చారు. ఫ్రంట్‌లోకి సీపీఐని ఆహ్వానిస్తున్నామన్న ఆయన.. ఈ విషయమైన ఇప్పటికే ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డితో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు.

బహుజన రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ.. ఫ్రంట్ ఆవిర్భావ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సామాజిక న్యాయాన్ని సాధించాలంటే బహుజనులకు రాజ్యాధికారం దక్కాలని అన్నారు. ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు (ఆప్) మాట్లాడుతూ.. 28 రాజకీయ పార్టీలు ఒకే వేదిక మీదికి రావటం చారిత్రాత్మకమని అన్నారు. దేశ చరిత్రలో ఇంతకుముందెన్నడూ ఇలాంటి వేదిక ఏర్పాటు కాలేదని చెప్పారు. కేంద్రంలోని మోడీది, రాష్ట్రంలోని కేసీఆర్‌ది ప్రజా వ్యతిరేక అజెండాలని ఎద్దేవా చేశారు. జానకిరాములు (ఆరెస్పీ) మాట్లాడుతూ.. తెలంగాణలో నియంత పాలన, కుటుంబ పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. రామనర్సయ్య (సోషల్ జస్టిస్ పార్టీ) మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రివర్గంలోని మినిష్టర్స్‌కు ఎలాంటి అధికారాల్లేవని.. బీసీ మంత్రులకు అసలే లేవని అన్నారు. మంత్రివర్గంలో ఒక్క మహిళక్కూడ స్థానం లేకపోవటం అన్యాయమని విమర్శించారు. మద్దికాయల అశోక్ (ఎంసీపీఐ-యు) మాట్లాడుతూ.. దళితులు, బడుగులు, గిరిజన శక్తికి తోడు కార్మికవర్గాన్ని ఏకం చేస్తే రాష్ట్రంలో నూతన అధ్యాయానికి తెరలేస్తుందని అన్నారు. ఖాన్ సహబాజ్ అలీ ఖాన్ (ఎంబీటీ) మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే తమ బతుకులు బాగుపడతాయంటూ మైనారిటీలు ఆశించారని.. వారి ఆశలు అడియాశలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో మైనారిటీలకు సమానవాటా దక్కాలని డిమాండ్ చేశారు. గొర్రె రమేశ్ (లేబర్ పార్టీ) మాట్లాడుతూ.. ఉద్యమ ద్రోహులందరూ మంత్రులుగా ఉన్నారంటూ హోం మంత్రి నాయిని, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. వారి ఆవేదన నిజమే అయితే.. తమ తమ పదవులకు రాజీనామా చేసి టీఆర్ఎస్ నుంచి బయటకు రావచ్చుగదా..? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు కూడా పాల్గొన్నారు.

నేడు, రేపు ఢిల్లీలో కేబ్ మీటింగ్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

దేశంలో బాలికల విద్యను ప్రోత్సహించేందుకు గానూ తీసుకోవాల్సిన చర్యల కోసం కేంద్ర ప్రభుత్వం నియమించిన సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఇన్ ఎడ్యుకేషన్ (కేబ్) సబ్ కమిటీ ఆన్ గర్ల్స్ ఎడ్యుకేషన్ సోమ, మంగళవారాల్లో ఢిల్లీలో సమావేశం కానున్నది. మంగళవారం కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్‌ను కలిసి కమిటీ మధ్యంతర నివేదికను అందించనున్నారు. ఫిబ్రవరిలో పూర్తిస్థాయి నివేదికను ఇవ్వనున్నారు. డిప్యూటీసీఎం కడియం శ్రీహరి చైర్మెన్‌గా ఉన్న ఈ కమిటీ ఇప్పటికే నాలుగు సార్లు వివిధ ప్రాంతాల్లో భేటీ అయింది. తాజాగా హైదరాబాద్‌లో కేబ్ సమావేశం జరిగింది. దేశవ్యాప్తంగా బాలికలకు పీజీ వరకూ ఉచిత విద్య అందించాలనీ, మహిళలకు ప్రత్యేకంగా యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలని కేంద్రానికి సూచించనున్నారు. వీటితో పాటు మహిళల కోసం కేంద్రీయ విద్యాలయాల స్థాయిలో ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలనీ, విద్యాసంస్థల్లో బాలికల కోసం ప్రత్యేకంగా వసతులు కల్పించాలని కోరనున్నారు.

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు

బీసీలపై కాంగ్రెస్ కపటప్రేమ

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్ నాయకులకు బీసీలపై ప్రేమ పుట్టుకొస్తున్నదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీలను పట్టించుకోని కాంగ్రెస్ కేసీఆర్‌ను విమర్శించడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ హయాంలో రెసిడెన్షిల్ స్కూళ్లు మూతబడటంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలో విద్యకు దూరమయ్యారని మండిపడ్డారు. టీఆర్ఎస్ హయాంలో 120 గురుకులాలు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 2017లో బడ్జెట్‌లో బీసీలకు రూ.50,736 కోట్లను కేటాయించి అనేక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. 70 బీసీ హాస్టళ్లకు సన్నబియ్యం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఓవర్సీస్ విద్యకు రూ.20 లక్షలు ఇస్తున్నామని చెప్పారు. అత్యంత వెనుకబడిన ఎంబీసీలకు సత్వర అభివృద్ధి కోసం రూ.1000 కోట్లతో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, తుమ్మిళ్ల తదితర ప్రాజెక్టులను చేపట్టి శరవేగంగా పనులు చేస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కల్లుగీత కార్మికులపై మొసలీ కన్నీరు కారుస్తున్నారని..హైదరాబాద్‌లో కల్లును నిషేదించిన ఘతన ఆ పార్టీకే దక్కిందని ఎద్దేవ చేశారు. త్వరలోనే రాష్ట్రంలో కేరళ తరహాలో కల్లుగీత విధానాన్ని ప్రవేశపెడతామని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దీనిని అధ్యయనం చేయడానికి కేరళకు బృందాన్ని పంపుతామన్నారు. కాంగ్రెస్ నాయకులు కల్లబొల్లి కబుర్లను గీత కార్మికులు నమోద్దన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

రైతులకు ఆధునిక పరిజ్ఞానం అందించాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డైరీ ఆవిష్కరణలో డా. సైదులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించినట్టయితే అధిక దిగుబడులు సాధిస్తారని వ్యవసాయ, ఆర్థిక, సామాజిక శాస్త్రవేత్త డాక్టర్. సైదులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ అమృత ఎస్టేట్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో ఎండ్ల నుంచి వ్యవసాయం చేస్తున్న రైతులకు కూడా భాస్వరం, నత్రజని, పొటాషియం ఎంత మోతాదులో వాడాలో తెలియని పరిస్థితులున్నాయని చెప్పారు. దీంతో దిగుబడులు సాధించకపోగా నష్టపోతున్నారని చెప్పారు. నీటిని ఆదా చేసుకునే మార్గాలను కూడా రైతులు తెలియజేయాలని కోరారు. కృషి ఫౌండేషన్ డైరెక్టర్ ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ పారిశ్రామిక, సేవా రంగానికి ఉన్న ప్రాధాన్యత వ్యవసాయ రంగానికి లేకపోవడం బాధాకరమన్నారు. మెజార్టీ ప్రజలకు ఉపాధి మార్గాలు చూపిస్తున్న వ్యవసాయాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ మాట్లాడుతూ



తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 3411 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని చెప్పారు. అందులో 792 మందినే ప్రభుత్వం గుర్తించిందని, గుర్తించిన వారికి కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించలేదన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతులందరికి రూ. 6 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సునంద, సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాంరెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

విస్తృతంగా సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల ఏర్పాట్లు

- నల్లగొండలో ఫిబ్రవరి 4 నుంచి 7వరకు..
- ఏర్పాట్లలో ఆహ్వాన సంఘం





నవతెలంగాణ-నల్లగొండప్రతినిధి

పోరాటాల పురిటిగడ్డ, సామాజిక ఉద్యమాల చైతన్యవేదికగా ఉన్న నల్లగొండ పట్టణంలో సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఫిబ్రవరి 4,5,6,7 తేదీల్లో జరగనున్నాయి. మహాసభల జయప్రదం కోసం ఆహ్వానసంఘం, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలంగాణలో మారుతున్న రాజకీయ సమీకరణల నేపథ్యంలో పాలక పార్టీలకు భిన్నంగా ప్రజా సంక్షేమం, సమగ్రాభివృద్ధి ధ్యేయంగా ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఆవిర్భవించనున్న తరుణంలో జరుగుతున్న ఈ మహాసభలను సీపీఐ(ఎం) ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రజల పక్షాన పోరాడుతున్న కమ్యూనిస్టులు, సామాజిక శక్తులు, ప్రజాతంత్రవాదులు ఒక్కటిగా రాజకీయగా శక్తిగా ఆవిర్భవించనున్నదని ఆహ్వాన సంఘం అధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి చెప్పారు.

విస్తృత ఏర్పాట్లు: జిల్లా వ్యాప్తంగా మహాసభలకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్ల ద్వారా లక్ష కుటుంబాలను కలుస్తూ మహాసభల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తున్నారు. ఫ్లెక్సీలు కట్టడం, గోడరాతలు రాయటం ప్రారంభమయ్యాయి. మైక్ ప్రచారాలు చేస్తున్నారు. నల్లగొండ పట్టణంలో గోడరాతలు, ఫ్లెక్సీలు, బెలూన్స్, స్లైడ్స్ వంటి వివిధ రూపాల్లో ప్రచారం కొనసాగిస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి ఎర్రచొక్కా, ఎర్రచీర ధరించిన వేలాది కార్యకర్తలను తరలించేందుకు గ్రామశాఖలు సన్నద్ధం అవుతున్నాయి. మహాసభల ప్రారంభం రోజు రెడ్‌షర్ట్ కవాతు నిర్వహించే కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఊరూరా తిరిగి ఆటపాటల ద్వారా మహాసభల ఆవశ్యకతను చెబుతున్నారు. మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా తరలిరానున్న ముఖ్య అతిథులు, ప్రతినిధులు, పరిశీలకులకు అవసరమైన భోజనం, వసతులను సమకూర్చే పనుల్లో ఆహ్వాన సంఘం ఉంది.

హక్కుల సాధన కోసం ఎంబీసీ సంఘం నిరంతరం కృషి

- క్యాలెండర్ ఆవిష్కరణలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హక్కుల సాధన కోసం ఎంబీసీ సంఘం నిరంతర కృషి చేస్తున్నదని వక్తలు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎంబీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య అధ్యక్షతన ఎంబీసీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంబీసీ కార్పొరేషన్ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంబీసీల జీవన విధానాలను ప్రతిబింబిస్తూ క్యాలెండర్‌ను రూపొందించడం హర్షణీయమన్నారు. ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్ వినయకుమార్ మాట్లాడుతూ స్థానిక సంస్థల రిజర్వేషన్లను వర్గీకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎఎల్ మల్లయ్య, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు జి మహేష్ చంద్ర, ఎంబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరెపల్లి శ్రీనివాస్, పూసల సంఘం జాతీయ అధ్యక్షులు కోలా శ్రీనివాస్, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి కొండోజు అశోకాచారి, గంగిరెద్దుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆవుల దొడ్డి రామస్వామి, చెన్నారం మల్లేషం, గడప శ్రీహరి, పి నర్సింహులు, చెన్నయ్య, ఎల్లయ్యతో పాటు తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

నవతెలంగాణ-ఖమ్మంరూరల్/సైదాపూర్

అప్పుల బాధతో ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో ఆదివారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం...ఖమ్మంరూరల్ మండలం కొండాపురం గ్రామానికి చెందిన తాడిశెట్టి ఉపేందర్‌రావు(42) తన నాలుగెకరాలతో పాటు మూడేండ్ల నుంచి మరో ఏడెకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి సాగుచేస్తున్నాడు. గతేడాది మిర్చికి ధర లేకపోవడంతో అప్పుల పాలయ్యాడు. ఈ ఏడాది ఎనిమిదెకరాల్లో పత్తి సాగు చేశాడు. పంట సరిగా పండలేదు. దీంతో సుమారు రూ.10లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలీక రోజు తనలో తానే కుమిలిపోయేవాడు. అప్పులు తీర్చే దారి లేక ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుని భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన తిప్పారపు వెంకటయ్య (55) మూడెకరాలను కౌలుకు తీసుకుని ఎకరంలో వరి, రెండెకరాల్లో పత్తి పంట సాగుచేశాడు. కానీ, ఆశించిన దిగుబడి రాలేదు. అప్పటికే పెట్టుబడి, కూతుళ్ల పెండ్లి నిమిత్తం మొత్తం 3 లక్షల రూపాయల అప్పయ్యింది. ఈ నేపథ్యంలో పంట నష్టం జరిగి అప్పులు తీర్చేమార్గం లేకపోవడంతో శనివారం రాత్రి పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే గమనించి హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. మృతుని భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్టు సైదాపూర్ ఎస్ఐ నూతి శ్రీధర్ తెలిపారు.

పెట్రోల్ చోరీ చేస్తుండగానే...

- ట్యాంకర్ పేలిన ఘటనలో ఇద్దరు అరెస్టు, ఒకరు మృతి

నవతెలంగాణ - బోడుప్పల్

ట్యాంకర్ నుంచి పెట్రోల్ చోరీ చేస్తుండగానే చెంగిచర్ల అగ్నిప్రమాదం జరిగినట్టు తేలింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఘటనకు సంబంధించి ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7.50 లక్షల నగదు, 10 పెట్రోల్ ట్యాంకర్లు, రెండు కార్లు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాచకొండ జాయింట్ పీసీ తరుణ్‌జోషి, మల్కాజిగి డీసీపీ ఉమామహేశ్వరశర్మ, ఏసీపీ గోనె సందీప్‌కుమార్, సీఐ జగన్నాథ్‌రెడ్డి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి కేసుకు సంబంధించిన వివరాలు తెలిపారు. వారి కథనం ప్రకారం... కర్నాటకకు చెందిన కునాల్ రాజు, అతని సోదరుడు జగదీశ్ తమ కుటుంబంతో నగరానికి వచ్చి చెంగిచెర్లలో నివాసముంటున్నారు. వీరు ఓ ముఠాగా ఏర్పడి భారీ స్థాయిలో పెట్రోల్, డీజిల్ చోరీ చేస్తున్నారు. నగరంలోని ఐవోసీ, హెచ్‌పీఎల్ కేంద్రాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంక్‌లకు వెళ్లే ట్యాంకర్ల యజమానులను, డ్రైవర్లను మచ్చిక చేసుకుని ఇంధనాన్ని తక్కువ ధరకు తీసుకుని పరిసర ప్రాంతాల వ్యాపారులకు బ్లాక్‌లో అమ్ముతుంటారు. ఈ దందాలో వారు కోట్ల రూపాయలు సంపాదించారు. దీంతో 13 ట్యాంకర్లను కొనుగోలు చేశారు. రోజుమాదిరి గానే కాకినాడ నుంచి ఎస్ఆర్‌నగర్‌లోని పెట్రోల్ బంక్‌కు వెళ్తున్న ట్యాంకర్‌ను చెంగిచర్లలోని తమ అడ్డాలో నిలిపి పెట్రోల్ తీస్తుండగా అగ్ని ప్రమాదం జరిగింది. ట్యాంకర్‌కు ఉన్న సీల్ ఓపెన్ కాకపోవటంతో గ్యాస్ వెల్డింగ్‌తో తీసేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో నిప్పురవ్వలు ఏర్పడి ప్రమాదం జరిగింది. అరెస్టు చేసిన ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.

ఎస్సీ నియోజకవర్గాల్లో 'దళిత్ అదాలత్' : కె. లక్ష్మణ్

నవతెలంగాణ-క్లాక్‌టవర్

రాబోయే రోజుల్లో 19 ఎస్సీ నియోజకవర్గాల్లో దళిత్‌అదాలత్ పేరుతో పెద్ద ఎత్తున సభలు నిర్వహిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దళిత వ్యతిరేకవిధానాలపై పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నల్లగొండ లోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి సుస్థిర పాలన అందిస్తున్న బీజేపీకి ఆదరణ పెరుగుతున్నదన్నారు. 2018 సంవత్సరాన్ని బీజేపీ ఉద్యమ సంవత్సరంగా పరిగణిస్తూ ప్రజాపోరాటాలతో పార్టీని అధికారం లోకి తీసుకురావాలనే సంకల్పంతో ముందుకుసాగుతామని తెలిపారు. మండల, అసెంబ్లీస్థాయిలో ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తూ పార్టీని విస్తృత పర్చాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఐటీ ఉద్యోగుల తొలగింపుపై సర్కారు ఆరా

రెండు నెలల్లో 1100 మంది ఉద్యోగుల తొలగింపు?

- అమెరికా నుంచి హైదరాబాద్‌కు ఐటీ ఉద్యోగుల వలసలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాంకేతిక రంగ ఉద్యోగుల తొలగింపుపై ఐటీ, కార్మిక శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. ఉన్నఫలంగా ఉద్యోగుల తొలగింపుకు గల కారణాలపై ఆయా సంస్థల సీఈఓవోలతో చర్చిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా వివిధ ఐటీ సంస్థలు ఉద్యోగులను తొలగించడానికి గల కారణా లు, వర్క్ ఆర్డర్లు, సంస్థలు ఆర్జిస్తున్న లాభాలు, నష్టాలపై ఐటీ, కార్మిక శాఖ అధికారులు లెక్కలు తీస్తున్నట్టు సమాచా రం. ఐటీ కంపెనీలు నిజానికి నష్టాల్లో ఉన్నాయా? గత నాలుగేండ్లుగా రాజధానిలోని కంపెనీల వార్షిక టర్నోవర్.. లాభాలు, నష్టాలు.. ఉద్యోగులకు చెల్లిస్తున్న వేతనాలపై ఐటీ, కార్మిక శాఖలు లెక్కలు తీస్తున్నట్టు సమాచారం. ఉద్యోగులను తొలగిస్తున్న కంపెనీలు లాభాల్లో ఉంటే ఎందుకు తొలగిస్తున్నారో కారణాలను తెలపాలంటూ ఆయా ఐటీ కంపెనీలకు నోటీసులు జారీ చేయాలని కార్మిక శాఖ ఒక నిర్ణయానికి వచ్చింది. ఉద్యోగుల తొలగింపుకు సంబంధించి ఇప్పటికే ఈ శాఖలు చర్యలు ప్రారంభించినట్టు తెలిసింది.

బలవంతపు సంతకాలు

దేశంలో పూణే, ముంబయి, చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు ఐటీ సంస్థలకు ప్రధాన కేంద్రాలు. ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్రా, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ ఐటీ సంస్థలు లాభాలను ఆర్జిస్తూనే అనేక సాకులు చూపి ఉద్యోగుల తొలగింపునకు పాల్పడుతున్నాయి. ఈ ఏడాది కాలంలోనే దేశవ్యాప్తంగా లక్ష మంది ఉద్యోగాలు కోల్పోయారని తెలుస్తున్నది. గత ఏడాదిలో హైదరాబాద్‌లో 20వేల మందికి పైగా ఉద్యోగులను తొలగించినట్టు ఐటీ శాఖ దృష్టికి వచ్చింది. ప్రతిభ చూపడం లేదని, పనితీరు వేగంగా లేదని సాకులు చూపి ఉద్యోగులను బలవంతంగా తొలగిస్తున్నాయి. వాస్తవానికి లక్షల రూపాయల జీతాల డబ్బును మిగుల్చుకునేందుకే ఐటీ సంస్థలు ఉద్యోగులను తొలగింపునకు పాల్పడుతున్నట్టు తెలిసింది. స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని, లేదంటే సంస్థ తొలగించిన దానికి అంగీకరిస్తున్నట్టు సంతకం చేయాలని ఉద్యోగులను ఐటీ సంస్థలు బలవంతం చేస్తున్నాయి. రెండు నెలల్లో 1100 మంది ఉద్యోగుల తొలగింపు హైదరాబాద్‌లో గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లోనే ఐటీ కంపెనీల్లో పని చేస్తున్న 1100 మంది ఉద్యోగులను తొలగించినట్టు ఐటీ శాఖ అధికారులు తెలిపారు. ఇందులో ప్రధానంగా మేనేజర్ స్థాయి మొదలు కొని, టీమ్‌లీడర్ స్థాయి వరకు ఉన్న ఉద్యోగులపైనే వేటు వేశారు. ఇందుకు ప్రధాన కారణం వారికి ఏడాదికి రూ.12 లక్షల నుంచి రూ.25 లక్షల జీతాలు చెల్లిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తు తం ఇతర దేశాల నుంచి ఐటీ సంస్థలకు భారీ మొత్తంలో వర్క్ ఆర్డర్లు రావడం లేదు. దీంతో సంస్థ నష్టాల్లో కూరుకు పోతుందన్న ఆలోచన తోనే ఎక్కువ వేతనాలను ఉన్న ఉద్యోగులను తొలగించా లని సాఫ్ట్‌వేర్ సీఈఓలు నిర్ణయిం చినట్టు కార్మిక శాఖ అధికారి ఒకరు తెలిపారు.

త్వరలో సీఈఓలతో కార్మిక శాఖ భేటీ

ఉద్యోగుల తొలగింపుపై త్వరలోనే కార్మిక శాఖ అధికా రులు ఐటీ కంపెనీ సీఈఓలతో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో ఐటీ పురోగతి, ఉద్యోగుల తొలగింపుపై చర్చించనున్నట్టు తెలిసింది.

వీసా నిబంధనలను అమెరికా ప్రభుత్వం కఠినత్వం చేయడం, అమెరికాలో ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల అమెరికా నుంచి ఐటీ ఉద్యోగులు హైదరాబాద్, విశాఖపట్టణం, బెంగళూర్, పూణే. చెన్నై, రాష్ట్రాలకు భారీగా వలస వస్తున్నట్టు తెలి సింది. అమెరికాలో పొందుతున్న వేతనం కన్నా హైదరాబాద్‌లో తక్కువ వేతనానికి పని చేయడానికి ఎన్నారైలు

తక్కువ వేతనానికైనా సిద్ధమే

ఆసక్తి చూపుతున్నారు. అమెరికా, లండన్, కెనడా లాంటి దేశాల్లో ఉన్న ఐటీ సంస్థలు కూడా పెద్ద మొత్తంలో వేతనాలు పొందుతున్న ఉద్యోగులను తొలగిస్తున్నాయి. దాంతో స్వదేశంలోనే తక్కువ వేతనాలకైనా ఉద్యోగం చేయడానికి ఎన్నా రైలు సిద్ధ పడుతున్నట్టు ఒక సాఫ్ట్‌వేర్ సంస్థకు చెందిన నాంపల్లి శ్రీకాంత్ అనే ఉద్యోగి తెలిపారు. అమెరికాలో ఉన్న ఐటీ సంస్థలు హైదరాబాద్‌లో కూడా ఉండటంతో అమెరికాలో చెల్లిస్తున్న వేతనంలో సగం వేతనం చెల్లించినా హైదరాబాద్‌లో పని చేస్తామంటూ దరఖాస్తులు పెట్టుకున్నారని తెలిపారు. అక్కడి అనుభవం, చెల్లిస్తున్న వేతనాలు, పని గంటలను దృష్టిలో పెట్టుకుని వారిని స్వదేశానికి పంపుతున్నారని చెప్పారు. అమెరికా, కెనడా, లండన్ నుంచి స్వదేశానికి చెందిన ఉద్యోగులు వలస వస్తున్నందునే హైదరాబాద్‌లో పని చేస్తున్న ఉద్యోగులను అకారణంగా తొలగిస్తున్నారని చెప్పారు.

వాదాలని ప్రశ్నించిన విశిష్ట పరిశోధన


"కవి గానివాడు విమర్శకుడౌతాడు" – ఇదొక నానుడి. అయితే కవులే విమర్శకులు కావల్సిన పరిస్థితి తెలుగునేలకే ప్రత్యేకం. కవిత్వం, విమర్శ పరస్పర విరుద్ధాంశాలు కానప్పటికీ వొకటి వుద్వేగ ప్రధానం, మరొకటి బౌద్ధిక వ్యాపారం. రెండిటి మధ్య సమతౌల్యాన్ని పాటించి సామరస్య పూర్వక సమన్వయం సాధించడం, దానికి ప్రణాళికాబద్ధమైన పరిశోధనని జోడించడం తెలిసి తెలిసీ రోట్లో తలదూర్చడమే. అయినా సాహసించడం నిరంకుశ కవులకు ఒక క్రీడ. ఆ క్రీడలో గెలుపుని సొంతం చేసుకొన్నవాళ్ళలో కవి యాకూబ్ ఒకడు.

నిన్నటి చేరా ఇవాల్టి అఫ్సర్, ప్రసేన్, సీతారాం వంశీ కృష్ణ... ఖమ్మం నేలకే రెండంచుల కత్తుల్ని సృజించే ప్రత్యేకమైన గుణముందేమో! ఆ నేలనుంచే మరో బలమైన చేర్పు యాకూబ్. ప్రవహించే జ్ఞాపకాన్నీ, రారా సాహిత్య పరిశోధననీ ఏకకాలంలో సవ్యసాచిగా తవ్విపోసి అందించిన యాకూబ్, కవిగా పరిశోధకుడిగా జోడు గుర్రాల – స్వారీని కాదు – సవారీని అలవోకగా – అతి జాగరూకతతో నిర్వహిస్తున్నాడనడానికి ఆధునిక సాహిత్య విమర్శలోని వాదాలనూ, ధోరణులనూ సమగ్రంగా గుదిగుచ్చి అందించిన యీ గ్రంథమే సాక్ష్యం.

తెలుగులో ఆధునిక సాహిత్య విమర్శ సాగిన తీరుతెన్నుల్నీ దాని లోతుపాతుల్నీ ఎప్పటికప్పుడు ప్రచలితమైన కొత్త కొత్త వాదాల్నీ ధోరణుల్నీ మొత్తం దాని ప్రస్థానాన్ని విమర్శకుల లోటుపాట్లతో సహా తెలుసుకోడానికి యాకూబ్ పరిశోధన ఒక గైడ్ బుక్ లాగా రెడీ రికనీర్ లాగా తోడ్పడుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

నా వరకు నాకు యీ పరిశోధన ఆత్మ శోధనకి వుపయోగపడింది. సంస్కృత అలంకార శాస్త్రం చదువుకోవడం దగ్గర సాహిత్య విద్యార్థిగా ప్రారంభమైన నాకు, మార్క్సిజం, మనస్తత్వ శాస్త్రం మొదలైన సామాజిక – వైజ్ఞానిక శాస్త్రాల వెలుగులో ఆధునిక సాహిత్య విమర్శలోని భిన్న ధోరణులు పరిచయమయ్యాకే సాంప్రదాయిక ఆలంకారిక శాస్త్రంలోని పరిమితులు తెలిశాయి. భరతుడి దగ్గర్నుంచి జగన్నాథుడి వరకూ సంస్కృతాలంకారికులు అలంకారాలు, రీతి, వృత్తి గుణ–దోష విచారాలు, వక్రోక్తి వైచిత్ర్యాలు గురించి చేసిన చర్చంతా రూపానికీ శైలీ శాస్త్రానికి సంబంధించినదే. నిర్వచించిన లక్షణాలకు శ్లోకాల్ని, శ్లోకాల్లో భాగాల్ని, పదాల్ని, పదాంశాల్ని లక్ష్యాలుగా ఎత్తిపట్టడం మీదే వాళ్ళు ఎక్కువగా దృష్టి సారించారు తప్పితే, కావ్యాన్ని వొక యూనిట్ గా చూసింది లేదు. ఒక కవి గురించో రచయిత గురించో సమగ్రంగా విచారించిందీ లేదు.

"ఉపమా కాళిదాసస్య, భారవేరర్థగౌరవం
దండినః పదలాలిత్యం, మాఘే సన్తి త్రయో గుణాః"
– వంటి నిర్ధారణలు విమర్శ సూక్తులుగానే మిగిలిపోయాయి.



ఆనందవర్ధనుడు మాత్రం కావ్యాత్మ గురించిన ప్రశ్నకు సమాధానం వెతికే ప్రయత్నం చేసి 'భారతంలో అంగిరసం శాంతం' వంటి ప్రస్తావనలు తెచ్చాడు. మొత్తం కావ్యం అందజేసే యెరుక గురించి మాట్లాడటానికి తలుపులు తెరిచాడు. ప్రాచీన ఆలంకారిక శాస్త్ర వివేచనలో ఆనందవర్ధనుడొక మలుపు. కానీ అభినవ గుప్తుడు 'రసో వై సః' అని రసాన్నీ రసస్ఫూర్తినీ రసాస్వాదననీ సాహిత్యేతర ఆలోచనాధార అయిన ఆత్మవాదంతో ముడిపెట్టడంతో ధ్వనికారుడి నూత్న ఆవిష్కరణకి ఆ తర్వాత కొనసాగింపు లేకుండాపోయింది. పాశ్చాత్య విమర్శ ధోరణులు తెలుగు వారికి పరిచయమయ్యాకే ఈ లోటు తీరింది.

కట్టమంచి కవిత్వ తత్త్వ విచారం కావ్యాన్ని అంచనా కట్టడానికి కొత్త సాహిత్య ప్రమాణాల్ని ప్రతిపాదించిన తర్వాత ఆధునిక విమర్శ కొత్త పుంతలు తొక్కినా, శ్రీశ్రీ తదితర అభ్యుదయ వాదులు ప్రస్తావించిన కన్యాశుల్కంలో రస చర్చ, నాయక వివాదం దగ్గర్నుంచి ముదిగంటి సుజాతారెడ్డి యిటీవల కాలంలో నవలల్లో రసం గురించి చేసిన ప్రతిపాదనల వరకూ సంప్రదాయ విమర్శ పోకడలు మనల్ని వొదిలి పెట్టలేదు. మరో వైపు మార్క్సిస్టు తత్త్వశాస్త్రం వెలుగులో త్రిపురనేని మధుసూదనరావు, కె.కె. రంగనాథాచార్యులు, స్త్రీవాద దృక్పథంతో జయప్రభ, కాత్యాయినీ విద్మహే, శిలాలోలిత వంటివారు ప్రాచీన సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేయడం కూడా గమనిస్తాం. నిరంతర చలనశీలమైన సమాజంలో ఆధునికత ఎప్పటికప్పుడు సాపేక్షమే. అందువల్ల ఆధునికతని నిర్వచించడం, ఆధునిక విమర్శకు ప్రారంభ దినాల్ని నిర్ధారించడం చాలా కష్టమైన పని. ఆధునికత కేవలం కాలవాచి కాదు. అదొక జీవన విధానం, ఆలోచనా విధానం. మరింత లోతుగా ఆలోచిస్తే అదొక సామాజిక తాత్త్వికత. దాన్ని సాహిత్యానికీ సాహిత్య విమర్శకూ అన్వయించడంలో సాంకేతిక సామాజిక రాజకీయ ఆర్థిక శాస్త్రాల ప్రమేయం చాలా వుంటుంది. భారతీయ సమాజం మొత్తం పూర్తిగా ఆధునికతలోకి ప్రయాణం చేసిందా లేదా అన్న విషయమే ప్రశ్నార్థకం కాగా, సాహిత్య విమర్శలో యీ లోపు ఆధునికానంతర వాదం కూడా తయారయింది. అఫ్సర్, తిరుపతిరావు లాంటి వాళ్ళు అత్యాధునికత గురించి సైద్ధాంతిక చర్చలు చేసారు. మార్క్సిస్టు సాహిత్య విమర్శలోని పరిమితుల్ని గుర్తిస్తూ అస్తిత్వంలోకి వచ్చిన స్త్రీ దళిత ప్రాంతీయ మైనార్టీ మొదలైన నిర్దిష్టతావాదాలన్నిటినీ ఆధునికానంతర వాదం తనలో యిముడ్చుకొంది. నిజానికి అదొక వాదం కాదు. గత శతాబ్ది కాలంగా సాహిత్యంలో సంప్రదాయికంగా స్థిరపడ్డ అన్ని వాదాలనూ – మార్క్సిజంతో సహా

> **తెలుగులో ఆధునిక సాహిత్య విమర్శ తీరుతెన్నుల్నీ, దాని లోతుపాతుల్నీ యెప్పటికప్పుడు ప్రచలితమైన కొత్తకొత్త వాదాల్నీ, ధోరణుల్నీ, మొత్తం దాని ప్రస్థానాన్ని విమర్శకుల లోటుపాట్లతోసహా తెలుసుకోడానికి యాకూబ్ పరిశోధన ఒక గైడ్‌బుక్‌లా ఉపకరిస్తుందంటున్నారు ఎ.కె.ప్రభాకర్. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ప్రచురిస్తున్న ఈ పుస్తకం త్వరలో ఆరంభమయ్యే హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో విడుదలవుతుంది.**

తిరస్కరించడమే ఆధునికానంతరవాదం లోని మౌలిక సూత్రం. సాహిత్యంలో నిర్దిష్టతను బహుళత్వాన్నీ విభిన్నతను వినిర్మాణాన్నీ వైయక్తిక స్వేచ్ఛనీ అది వున్నతీకరించింది. చాలా సందర్భాల్లో మార్క్సిస్టు విమర్శ పరిమితుల్ని యెత్తిచూపడమే లక్ష్యంగా పనిచేసింది. అందువల్ల పీడితుల్ని వొక తాటిమీదకి రానివ్వకుండా సామ్రాజ్యవాదులు పన్నిన కుట్రగా దాన్ని పరిగణించడం కూడా వుంది. నిర్దిష్టతలోంచీ మరింత నిర్దిష్టతలోకీ శకలీకరణ వైపు అత్యాధునికతా వాదం ప్రయాణం చేసినప్పటికీ సాహిత్యంలో సబాల్టర్న్ స్టడీకి దారులు వేసి, ఆధిపత్యాల కింద అణగారిన జాతుల ప్రాంతాల ఆత్మగౌరవ ప్రకటనలకీ, నూతన వ్యక్తీకరణరీతులకీ అంతకు ముందు ఎక్కడా ఎన్నడూ వినిపించని స్వరాలకీ ప్రాతినిధ్యం కలగడానికి దోహదం చేసింది.

1

మార్క్సిస్టు సాహిత్య విమర్శ వస్తునిష్టమైంది. రూపానికి ప్రాధాన్యం యివ్వక పోవడమే కాదు, రూపవాదాన్ని నిరసించింది. సామాజిక దృక్పథాలతో ప్రమేయంలేని కేవల అనుభూతి వాదాన్నీ వ్యక్తివాదాన్నీ అది ఎండగట్టింది. వెల్చేరు నారాయణరావు కవితా విప్లవాల స్వరూపం గానీ, వాడ్రేవు చినవీరభద్రుడి నూరేళ్ళ తెలుగు కథ సంకలనం గానీ రూపాన్ని భూమికగా చేసుకొని రూపొందినవే. సాహిత్యం ప్రజలకు దగ్గర కావడానికి దారులు వెతికే మార్గంలోనే మోహన్ ప్రసాద్ దళిత కవులు పాటను ఆశ్రయించాలని చేసిన ప్రతిపాదన కూడా రూపాన్ని దృష్టిలో పెట్టుకొని చేసిందే. ఆధునిక సాహిత్య విమర్శ మొత్తం వస్తు రూప వాదాల మధ్యే వూగులాడింది. అయితే ఆ వూగులాటకి ఆయా కాలాల్లో చోటుచేసుకొన్న సామాజిక చలనాలు కారణమయ్యాయి. వాటి ప్రభావం సృజనాత్మక సాహిత్యం మీద ఏ మేరకు పడింది అన్నది ప్రత్యేకంగా పరిశీలనార్హం.

తెలుగులో ఆధునిక సాహిత్య విమర్శకుల్లో నూటికి తొంభై తొమ్మిది మంది మార్క్సిస్టు విమర్శ లోనే పుట్టినప్పటికీ అస్తిత్వోద్యమాల నేపథ్యంలో చాలామంది దానికి దూరమయ్యారు. అయితే మార్క్సిస్టు సాహిత్య విమర్శ తప్ప, తక్కిన వాదాల్ని ఆశ్రయించుకొన్న విమర్శ ధోరణులు కొన్ని విశ్లేషణలూ వివరణలూ చర్చలూ వాద వివాదాల వరకే పరిమితమయ్యాయి తప్పితే, లోతైన తాత్త్వికతను ప్రతిపాదించలేకపోయాయి. వివాదాలు కొన్ని సందర్భాల్లో వ్యక్తిగతంగా కూడా పరిణమించాయి. దళితవాదంలో శివసాగర్ వంటివారు నిర్దేశించిన దళిత సౌందర్య శాస్త్రానికీ, స్త్రీవాద విమర్శలో ఓల్గా వంటివారు "వ్యక్తిగతమంతా రాజకీయమే" అని ప్రస్తావించిన జెండర్ చైతన్యానికీ కొనసాగింపు లేకుండా పోయింది. ఆ మేరకు ఆయా ధోరణుల్లో విమర్శకులు కొత్త విమర్శ పరికరాలను కూడా సమకూర్చుకోలేక పోయారన్నది చేదు వాస్తవం. అరాకొరా సమకూడినా విమర్శకు రొట్ట కొట్టుడు పరిభాష ఏర్పడిందే తప్ప, పదాలు భావనలుగా, భావనలు సిద్ధాంతాలుగా పరిణమించిన దాఖలాలు తక్కువ. అందుకే కొత్త వాదాల్తో ధోరణుల్తో సృజనాత్మక సాహిత్యం వచ్చినంత విరివిగానూ బలంగానూ దానికి సైద్ధాంతిక తాత్త్విక భూమికనేర్పరచగల విమర్శ రాలేదని ఆవేదన తరచుగా వ్యక్తమౌతోంది.

2


ఆధునిక సాహిత్య విమర్శలో కనిపించే ఈ ఖాళీలను తన పరిశోధన గ్రంథంలో యాకూబ్ చాలా స్పష్టంగా గుర్తించాడు. అంతే కాదు, అందుకు కారణాలను సైతం విశ్లేషించాడు. తెలుగు విమర్శకులు వాచకాల్ని పరిశీలించేటప్పుడు రచయితను విపరీతంగా పొగడటానికో తిట్టడానికో, పరిమితం కావడం వల్ల వాచకం లోతుల్లోకి పోలేకపోతున్న వైనాన్ని యాకూబ్ పరిశోధకుడిగానే కాదు, సృజనాత్మక రచయితగా సైతం బలంగా ప్రశ్నించాడు. ఒక విధంగా 'మోత' బరువు విమర్శని తిరస్కరించాడు. విమర్శ రచయిత కేంద్రకంగా గాక వాచక కేంద్రకంగా జరగవలసిన అవసరాన్ని గురించి హెచ్చరించాడు. చాలావరకు ఆధునిక విమర్శలోని వాదాలు

> **ఆధునిక విమర్శలోని వాదాలు ధోరణులూ రూప పరామర్శకే పరిమితమయ్యాయనీ, మార్క్సిస్టు – ఆధునికానంతర వాద విమర్శలు మాత్రమే వాటిలోని సైద్ధాంతిక బలం కారణంగా అప్పటి వరకూ వున్న అన్ని విలువల్నీ బోనులో నిలబెట్టి ప్రశ్నించగలిగాయనీ వాచక సారాంశాన్ని ప్రాధమ్యంగా పరిగణించిన దృక్పథాలు మాత్రమే సాహిత్య విమర్శలో ఇవాల్టికీ ప్రాసంగికంగా వున్నాయనీ నిర్ధారించాడు.**

ధోరణులూ రూప పరామర్శకే పరిమితమయ్యాయనీ, మార్క్సిస్టు – ఆధునికానంతర వాద విమర్శలు మాత్రమే వాటిలోని సైద్ధాంతిక బలం కారణంగా అప్పటి వరకూ వున్న అన్ని విలువల్నీ బోనులో నిలబెట్టి ప్రశ్నించగలిగాయనీ వాచక సారాంశాన్ని ప్రాధమ్యంగా పరిగణించిన దృక్పథాలు మాత్రమే సాహిత్య విమర్శలో ఇవాల్టికీ ప్రాసంగికంగా వున్నాయనీ నిర్ధారించాడు.

"విమర్శ అనేది నిర్దిష్టత (Concrete) నుండి అమూర్తత (Abstract) వైపు తీసుకువెళ్ళే సాధనం. ఈ అమూర్తత వివిధ దశల్లో ఉంటుంది. ఈ పద్ధతి ద్వారా నిర్దిష్ట విషయాన్ని మరింతగా అర్థం చేసుకొనే ప్రయత్నం జరుగుతుంది. విమర్శనా పద్ధతుల్లో ఒకటి రెండు ఆ అమూర్తతా దశకు చేరుకున్నా మిగతావి అసంపూర్ణంగానే విరమించినట్లు అనిపిస్తుంది. తెలుగు సాహిత్యంలో ఇది మరీ స్పష్టంగా కనిపిస్తుంది. విమర్శ ధోరణులు రూపం వరకే పరిమితమవుతున్నాయి. సమాజంలో ఇతర రంగాలతో సాహిత్యానికున్న సంబంధాన్ని గుర్తించడానికి నిరాకరిస్తున్నాయి. దీనికి కారణం 'స్వయం ప్రతిపత్తి' భావన అని సిద్ధాంత కర్తలు గుర్తించారు. ఒక్క మార్క్సిస్టు ధోరణి ఈ పరిస్థితిని అధిగమించింది. అందువల్లనే ఏదో ఒక స్థాయిలో సమాజ కేంద్రితమైన ఈ విమర్శకు సాహిత్యంలోనూ, విమర్శలోనూ కొనసాగింపు ఉంటూనే ఉంది."

ఇటువంటి నిర్ధారణలకు రావడానికి యాకూబ్ ఎన్నో ఉపపత్తుల్ని చూపాడు. విశ్వవిద్యాలయాల లోపలా బయటా జరిగిన పరిశోధనల్నీ, ఎప్పటికప్పుడు పత్రికల్లో వచ్చిన వ్యాసాల్నీ సమీక్షల్నీ చర్చల్నీ వాద వివాదాల్నీ స్పందన ప్రతిస్పందనల్నీ, రచనలకు ముందు, వెనక మాటల్నీ, విమర్శ సంకలనాల్లో పరిశోధన పత్రాల్లో ప్రస్తావించిన అంశాల్నీ సిద్ధాంత గ్రంథం పొడవునా క్రోడీకరించాడు. తనకు దొరికిన ఏ ఆకరాన్నీ అతను వదులుకోలేదు. సేకరించిన సమాచారాన్ని తన ప్రతిపాదనలకి అన్వయించుకోవడంలో తడబాటు పడలేదు. అందువల్ల అతని పరిశీలన పదునెక్కింది. నిర్ధారణలు నిజాలుగా మిగిలాయి. పరిశోధన ప్రామాణికమైంది. ఈ క్రమంలో ఆధునిక విమర్శ ముందు ముందు నడవ వలసిన దారుల్ని సైతం అతను సూచించాడు. సమీక్షలే విమర్శగా చెలామణి అవుతున్న దుస్థితి పట్ల ఆగ్రహం ప్రకటించాడు. అయితే ఆ పని యెంతో సంయమనంతోనూ తెలివిడితోనూ చేశాడు. తన ఎరుకకు నిర్దిష్టమైన మెథడాలజీని జోడించడంలో ఎక్కడా ఏమరుపాటుకి గురికాలేదు.



అందుకే యీ పరిశోధన ప్రణాళికాబద్ధంగా రూపొందింది. పాశ్చాత్య దేశాల్లో, భారతీయ భాషల్లో ఆధునిక విమర్శ ధోరణుల్ని పరిచయం చేస్తూ అవి తెలుగులో ప్రవేశించిన సామాజిక సందర్భాల్ని ప్రస్తావించి, వాటి పుట్టుపూర్వోత్తరాల్నీ పోయిన పోకడల్నీ పొందిన వికాసాన్నీ చెబుతూనే ఆయా సందర్భాల్లో విమర్శకులు – వీరేశలింగం, కట్టమంచి దగ్గర్నుంచీ జీవీ కృష్ణారావు, శ్రీశ్రీ, కొకు, ఆరుద్ర, రాంభట్ల, కేవీఆర్, రారా, టియమ్మెస్, ఆర్వీయార్, జేసీ, వెల్చేరు, సి వి సుబ్బారావు, కేకేఆర్, బాలగోపాల్, సంజీవమ్మ, వల్లంపాటి, కాత్యాయినీ విద్మహే, పాపినేని, రాచపాళెం, ఎన్ వేణుగోపాల్, సూర్యసాగర్, ఆర్.యస్. సుదర్శనం, మందేశ్వరరావు, జీవీ సుబ్రహ్మణ్యం, ఓల్గా, జయప్రభ, వసంత, లలిత, మృణాళిని, శిలాలోలిత, బి.యస్. రాములు, ఉ.సా. కత్తి పద్మారావు, కలేకూరి, లక్ష్మీ నరసయ్య, ఖాదర్, షమీ ఉల్లా, ఖాజా, స్కైబాబా, కరీముల్లా, సురేంద్ర రాజు, అఫ్సర్, తిరుపతి రావు, సుజాతా రెడ్డి సిధారెడ్డి, కె శ్రీనివాస్, కాసుల ప్రతాపరెడ్డి, సంగిశెట్టి, గుడిపాటి వరకూ ఆధునిక విమర్శ మలుపుల్లో యేదో ఒక మేరకు తమదైన ముద్రని వేయగల్గిన ప్రతి ఒక్కరి వరివస్యనీ రాగద్వేషాలకు అతీతంగా నిష్పక్షపాతంగా అంచనా కడతాడు.

పరిశోధన గ్రంథంలో యిటువంటి పరిశీలనలు అనేకంగా వున్నాయి. కొన్ని పరిశీలనలు నిర్ధారణలుగా కూడా కనిపిస్తాయి. ఆయా సందర్భాల్లో యాకూబ్ చేసిన నిర్ధారణలతో, వ్యాఖ్యానాలతో, అభిప్రాయాలతో యెవరైనా విభేదించవచ్చు, అతని సిద్ధాంతాన్ని పూర్వపక్షం కూడా చెయ్యొచ్చు. కానీ పరిశోధకుడిగా యాకూబ్‌లోని ఆబ్జెక్టివిటీని మాత్రం మెచ్చుకోకుండా వుండలేం.

నిర్మమత్వ బుద్ధితో యాకూబ్ చేసిన ముక్కుసూటి ఆవిష్కరణల్లో – వొకటి రెండు సందర్భాల్లో తప్ప – కాఠిన్యాన్నో ఉద్వేగాన్నో గమనించం. యాకూబ్ వ్యక్తిత్వంలోని మార్దవతే కవిత్వంలోకీ అక్కణ్నుంచి పరిశోధనలోకీ ప్రవహించింది. తనకెంతో యిష్టమైన చేరా భాషాశాస్త్రాన్ని కవిత్వ పరామర్శకి అన్వయిస్తూ చేసిన విమర్శనా పద్ధతుల్ని బేరీజు వేసిన సందర్భం యాకూబ్ పరిశోధక వ్యక్తిత్వానికి నికషోపలం. అలాగే జి. లక్ష్మీ నరసయ్య దళిత సాహిత్య తాత్త్విక దృక్పథ వివేచన చేస్తూ అంబేద్కరిజం వెలుగులో బుద్ధిజం జోడింపుతో దేశీయ మార్క్సిజం రూపొందాలని ప్రతిపాదించినపుడు యెటువంటి మొహమాటం లేకుండా మతాతీతమైన లౌకిక ప్రజాస్వామ్య భావన అవసరాన్ని యాకూబ్ నొక్కి చెప్పాడు. బుద్ధిజంలోని అష్టాంగమార్గాల విశిష్టత అతనికి తెలీని విషయం కాదు. కేవల విశ్వాసంగా అమలయ్యే మతంతోనే అతని పేచీ. పరిశోధకుడికి తనదైన దృక్పథం వొకటి వుంటుంది. అది పరిశోధన పొడవునా అంతస్సూత్రంగా కనిపిస్తుంది అనుకొన్నప్పుడు –కవిగా యాకూబ్ సూఫీవాది. అదే సమదృష్టి అతని పరిశోధనలో కూడా ప్రతిఫలించింది.

– ఎ.కె.ప్రభాకర్

ఒక అసంతోషిణి

ఇంటి గుమ్మం ముందు ఆమెను నిరీక్షింపజేసి
నేను దూరంగా, దూరాతిదూరంగా వెళ్లిపోయాను
నేను తిరిగి రానని ఆమెకు తెలియదు
ఒక కుక్క గతించింది, ఒక సన్యాసిని గతించింది
ఒక వారం ఒక సంవత్సరం గతించాయి
వర్షాలు నా పాదముద్రల్ని చెరిపేశాయి



వీధిలో ఆ ముద్రలపై గడ్డి మొలిచింది
ఒక దాని వెంట మరోటి రాళ్ళలా, మైలురాళ్ళలా,
ఆమె తల పైనుండి సంవత్సరాలు దొర్లిపోయాయి–
అంతలోనే ఒక నెత్తుటి అగ్ని పర్వతం వలె
యుద్ధం బద్దలైంది
జనం మరణించారు, జనావాసాలు నశించాయి
ఆ స్త్రీ మాత్రం మరణించలేదు
నేలంతా అగ్గిపాలయ్యింది
వేలాది సంవత్సరాలుగా మౌనముద్రలో ఉన్న
పచ్చని పవిత్రదేవతలు ముక్కలు ముక్కలై
గుడిలోంచి బయటికి విసిరేయబడ్డారు
ఇక వారు స్వప్నించడానికేమీ మిగలలేదు
అందమైన మధురమైన ఇళ్ళు
నేను విశ్రాంతశయ్యపై పడుకున్న వరండా
ఎత్తిన ఎత్తైన చేతుల్లా ఉండే
గులాబి మొక్కలు, వాటి ఆకులు
చలి కాచుకునే కుంపట్లు, జ్ఞాపకాలు
అన్నీ తగలబడి పోయాయి
ధ్వంసమై పోయాయి–
ఒకప్పటి నగరమేది?
బూడిదకుప్పలు
విరిగిపడిన ఇనుప ముక్కలు
వికారమైన శరీర శకలాలు
తెగిపడిన విగ్రహాలు
నల్లటి నెత్తుటి మరకలు –
ఆ స్త్రీ మూర్తి మాత్రం నిరీక్షిస్తూనే ఉంది.


మూలం : పాబ్లో నెరూడా
అనువాదం : డా॥ ఎస్వీ సత్యనారాయణ

'యథేచ్ఛ' ఆవిష్కరణ సభ

నందకిషోర్ కవిత్వం 'యథేచ్ఛ' ఆవిష్కరణ సభ ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6 గంటలకి హైదరాబాద్ రవీంద్రభారతిలో జరుగుతుంది. గోరటి వెంకన్న, అంబటి సురేంద్రరాజు, యాకూబ్, సిద్దార్థ, మామిడి హరికృష్ణ పాల్గొంటారు.

ఈ నెల 18 నుంచి హైదరాబాద్ బుక్‌ఫెయిర్

పుస్తకాలను అపురూపంగా చూసుకునేవారు, పుస్తకాలనుప్రేమించేవారు, ప్రపంచవ్యాప్తంగా కొత్తగా విడుదలైన పుస్తకాల కోసం ఎదురుచూసే వారికోసం, పాత, కొత్త పుస్తకాల ప్రపంచంగా ఈ నెల 18 నుంచి 28 వరకు హైదరాబాద్ బుక్‌ఫెయిర్ మీ ముందుకు వస్తుంది. దేశంలోనే రెండోస్థానంలో ఉన్న ఖ్యాతి హైదరాబాద్ పుస్తకప్రదర్శనకు దక్కుతుంది. ఇది హైదరాబాద్‌లో జరుగుతున్న 31 వ జాతీయపుస్తక ప్రదర్శన. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కమిటి, భాషా సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ బుక్‌ఫెయిర్ నిర్వహించబడుతుంది. పీజి నుంచి కేజీ వరకు తమకు కావాల్సిన పుస్తకాలు ఈ బుక్‌ఫెయిర్‌లో లభ్యమవుతాయి. అన్ని రంగాలకు, అన్ని శాస్త్రాలకు



సంబంధించిన పుస్తకాలు దొరుకుతాయి. శిశువు నుంచి వృద్ధుల వరకు అన్ని కేటగిరీల సాహిత్యం ఒకే దగ్గర దొరకుతుంది. అన్ని భాషల పుస్తకాలు ఈ ప్రదర్శనలో ఉంటాయి. భక్తి, ముక్తి, రక్తి, అనురక్తికి సంబంధించిన పుస్తక సామాగ్రి ఉంటుంది. ముక్తి నుంచి విముక్తి ఉద్యమాల వరకు సాహిత్యం లభిస్తుంది. రచనారంగంలో ఉన్న రచయితలకు, సాహితీవేత్తలకు, కవులకు, కవయిత్రులకు, కథకులు, నవలారచయితలు, వ్యాసరచయితలు సృజనకారులందరికీ ఇది బహుపెద్ద పుస్తకాల పండుగ. ప్రపంచవిజ్ఞానాన్ని తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం, ఇందిరాపార్కు దగ్గరకు) దగ్గరకు తీసుకవచ్చి మీ చేతికందించే ప్రయత్నం చేస్తున్నాం. ముగ్గులు వేసే మగువల దగ్గర నుంచి నూతన సమాజాన్ని నిర్మించే యోధులవరకు, సంచార జాతుల దగ్గర నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌వరకు, కూలీ నుంచి యజమాని వరకు అక్షరమాల నుంచి పోటీపరీక్షలకు హాజరయ్యే వారి వరకు, సబ్బండ వర్ణాల ఆశల ఆకాంక్షల కలయికల కేంద్రం ఈ పుస్తక ప్రపంచం.

సకుటుంబసపరివారంగా విచ్చేసి మీకుకావాల్సిన ఇష్టరీతిలో పుస్తకాలు పొందే అవకాశం ఉంది. ఈ పుస్తక పుష్పకవిమానం ఎక్కి విశ్వమంతా చుట్టి రావచ్చును. సమాజమార్పుకు, సమాజాల పునర్నిర్మాణాలకు ప్రధాన పనిముట్టయిన పుస్తకాన్ని దర్శించండి. ఆరోగ్యవంతమైన సమాజానికి పుస్తకమే ప్రాణం. మంచిపుస్తకాలు ఉత్తమ సమాజ నిర్మాతలు. పుస్తకాలతో చెక్కబడ్డ మనుషులే నవసమాజాల్ని నిర్మించారు. నవతకు, సమతకు దారి పుస్తకమే. సమాజంలోని అన్ని రుగ్మతలను తుడిచివేసేందుకు అధ్యయనమార్గాన్ని అవలంభిద్దాం. ఈ 11 రోజుల పుస్తకాల పండుగకు సాదర స్వాగతం. రండి. పుస్తక విశ్వదర్శనంలో పాల్గొనండి.

పిల్లలను తీసుకుని పెద్దలు, కుటుంబ సభ్యులంతా రావాలి. కొత్తతరం చేతికి ఈ పుస్తకాన్ని అందించాల్సిన బాధ్యత విద్యాసంస్థలది, తరగతి గదులది, ఈ తరం పెద్దలది. హైదరాబాద్‌కు 100 కిలోమీటర్ల పరిధిలో ఉన్న స్కూల్సు నుంచి డిగ్రీ, పీజి కాలేజీల వంకు విద్యార్థులు ఈ బుక్‌ఫెయిర్‌లో పాల్గొనే అవకాశం ఉంది. పిల్లలను జాగ్రత్తగా ఈ బుక్‌ఫెయిర్‌కు తీసుకువచ్చే బాధ్యతను హెడ్‌మాస్టర్లు, ప్రిన్సిపాళ్లు తీసుకోవాలని కోరుతున్నాం.

– జూలూరు గౌరీశంకర్ ; అధ్యక్షులు, హైదరాబాద్ బుక్‌ఫెయిర్
– బుర్రా వెంకటేశం ; ముఖ్యకార్యదర్శి, భాషా సాంస్కృతిక, టూరిజంశాఖ

'కావ్యహిత' పథకం

బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన రచయితలు, కవులు తమ రచనల్ని ముద్రించుకునేందుకు వీలుగా ప్రవేశపెట్టిన కావ్యహిత పథకానికి ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకం ద్వారా రచనలు ముద్రించుకోవడానికి గరిష్టంగా రూ.50 వేల ఆర్థిక సాయం అందిస్తారు. నివాస, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తుతో పాటు రచనలకు సంబంధించిన రెండు ప్రతుల్ని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో లేదా admintbspgad@telangana.gov.in మెయిల్ ద్వారా ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలి.

మూడుతరాల కవిసంగమం 36

మూడుతరాల కవిసంగమం 36 ఈ నెల 21 వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ అబిడ్స్‌లోని గోల్డెన్ త్రెషోల్డ్ నందు జరుగుతుంది. అలాగే మెర్సీమార్గరెట్ అభినందన సభ నిర్వహిస్తారు. ఎండ్లూరి సుధాకర్, నాగిళ్ళ రమేష్, వేణుగోపాల్ జుజ్జూరి, సరసిజ పెనుగొండ, రమేష్ కార్తీక్ నాయక్ పాల్గొంటారు.

తెలంగాణను విస్మరిస్తున్న సాహిత్య అకాడమీ అవార్డులు

ఒక వైపు దాదాపు మూడు దశాబ్దాలుగా తెలంగాణ భాషకు, సాహిత్యానికి, చరిత్రకు జరిగిన వివక్ష పట్ల ఆందోళన తీవ్రస్థాయిలో కొనసాగింది. అన్ని రంగాలలో కేంద్ర స్థాయిలోనూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ తెలంగాణకు అన్యాయం జరిగింది అన్న అంశం బలంగా చర్చనీయాంశం అయింది. అంతిమంగా తెలంగాణ ప్రజలు చలనశీల ఉద్యమాలతో రాష్ట్రాన్ని సాధించుకోగలిగారు. ఇప్పుడు తెలంగాణ తన మూలాలను అన్వేషిసూ అస్తిత్వ చైతన్యంతో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నది. తెలంగాణ రాష్ట్ర నిర్మాత గౌరవ ముఖ్యమంత్రి గారి ప్రత్యక్ష పర్యవేక్షణలో వైభవోపేతంగా ప్రపంచ తెలుగు మహాసభలు ఘనంగా జరిగాయి. భాష, సాహిత్య సాంస్కృతిక రంగాలలో యావత్తు ప్రపంచం ముందు తెలంగాణ విదితమైంది. "మన తెలంగాణము – తెలుగు మాగాణము" అన్న నినాదం తెలంగాణ జాతి జనుల సాంస్కృతిక నాదమైంది.

సరిగ్గా ప్రపంచ తెలుగు మహాసభలకు రెండురోజుల ముందు ఇదే హైదరాబాద్ నగరంలో కేంద్ర



సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సంచాలకులు ఆచార్య ఎన్.గోపి గారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన న్యాయ నిర్ణేతల కమిటీ ఇద్దరు తెలంగాణ అగ్రశ్రేణి సాహితీవేత్తలను పక్కకు నెట్టి తిరిగి గుంటూరు కవికి పట్టం కట్టింది. గత ఐదు సంవత్సరాల పురస్కారాలలో వరుసగా నాలుగు గుంటూరు వాసులను వరించడం అభ్యంతరకరం. భవిష్యత్తు చరిత్ర క్షమించదన్న కనీస భయం లేని కేంద్ర సాహిత్య అకాడమీ వైఖరి పట్ల తెలంగాణ సాహితీవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో సంగిశెట్టి శ్రీనివాస్ లేవనెత్తిన ప్రశ్నలు కేవలం ఆరంభం మాత్రమే. ఆశ్యర్యకరంగా గత నాలుగు సంవత్సరాలుగా సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, జూకంటి జగన్నాథం, నందిని సిధారెడ్డి, ఎస్వీ సత్యనారాయణల గ్రంథాలు తుది పరిశీలన దాకా చేరుకుని అక్కడ వైకుంఠపాళిలోని పాము మింగేయడం విషాదకరం. తెలంగాణ కలాలు, గళాలు దేశవ్యాప్తంగా వెలుగొందకూడదన్న రహస్య ఎజెండాను బద్దలు కొట్టవలసిన సమయం ఆసన్నమైంది. భవిష్యత్తులో తెలంగాణ సాహితీవేత్తలకు, తెలంగాణేతర సాహితీవేత్తలకు విడివిడిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను అందజేస్తే తప్ప ఈ వివక్షను ఆపడం సాధ్యం కాదు. విజ్ఞులు గమనించవలసిందిగా కోరుతున్నాను.

– సత్యాన్వేషి

సుంకిరెడ్డికి పురస్కారం

రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం– 2017 సంవత్సరానికి గాను కవితా పురస్కారం కోసం సుంకిరెడ్డి నారాయణ రెడ్డి 'తావు' కవితా సంపుటి ఎంపికైంది. ఫిబ్రవరి నెలలో సిరిసిల్ల లోని రంగినేని చారిటబుల్ ట్రస్టులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేస్తారు.

విమర్శ గ్రంథాలకు ఆహ్వానం

నెలవంకనెమలీక సాహిత్యమాసపత్రిక, మహేంద్రభారతి సంయుక్త నిర్వహణలో 'గంగిశెట్టి స్మారక మహేంద్రభారతి పురస్కృతి' కి విమర్శనా గ్రంథాలను ఆహ్వానిస్తున్నారు. రచనలు ఆధునిక సాహిత్యం, ప్రాచీనసాహిత్యం పైనైనా ఉండొచ్చు మౌలికవిమర్శనా గ్రంథాలై వుండాలి. రచనలు ఫిబ్రవరి 10 లోగా ఎడిటర్, నెలవంకనెమలీక సాహిత్యమాసపత్రిక, 15 –140, పి అండ్ టి కాలనీ, శ్రీకోదండరామనగర్, దిల్ సుఖ్ నగర్, హైదరాబాద్ –500060 చిరునామాకు పంపాలి. వివరాలకు :9866171648

వీళ్ళే



వీళ్ళే
కప్పదాటు గాళ్ళు
గాలివాటం గాళ్ళు
గోడమీది పిల్లులు
బతుకులు బరిమీద
తెగుతున్నప్పుడు
అవినీతికి తాళం కొట్టేవాళ్ళు
అదనుకోసం పొంచి ఉండే
గుంటనక్కలు
అడుగులకు మడుగులొత్తే
తొత్తులు
కాలరెత్తుక తిరుగలేని
అంతర్ముఖులు
తేనె పూసిన కత్తులు
రెండు నాల్కల పాములు
వీళ్ళే
కప్పదాటు గాళ్ళు
గాలివాటం గాళ్ళు
గోడమీది పిల్లులు.

– సబ్బని లక్ష్మీనారాయణ,
8985251271

రాగం-ద్వేషం

రాగ–నిర్మలమైన
దయామృతహృదయానికీ,
మేలు వలపుల
మానవత్వానికీ పెరిగే వన్నె!

ద్వేషం–మత్సరగ్రస్తమాలిన్య
హృదయానికీ,
కీడు తలపుల రాక్షసత్వానికి
మాయని చిన్నె!

– రఘువర్మ,
9290093933



పల్లెలన్నీ మంచుదుప్పటి కప్పుకొని, పుడమి పొత్తిళ్ళపై నిద్రిస్తున్న వేళ వేకువజామున హరినామ సంకీర్తనతో మేల్కొలిపే సంబరం. ఇంటిల్లిపాది ముచ్చటగా మూడు రోజులు ప్రకృతితో మమేకమై కాలానుగుణంగా వచ్చే మార్పులకు స్వాగతం పలుకుతూ జరుపుకొనే ఉత్సవం. పండుగలా గాక ప్రతి యేడు 'అతిథి'గా వచ్చే ఆడంబరం 'మకర సంక్రాంతి' పర్వదినం.

సంక్రాంతి శుభాకాంక్షలు

సంక్రాంతి సకల శుభాలివ్వాలని...

సూర్యగమనం వల్ల కలిగే సమ్యక్ క్రాంతి – 'సంక్రాంతి'. సంక్రాంతి అంటే మారడం, చేరడం అని అర్థం. సూర్యుడు నెలకొక రాశిలో ప్రవేశిస్తూ పన్నెండు నెలల్లో పన్నెండు రాశుల్లో చేరే ప్రతీకాలం సంక్రాంతే. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించినపుడు వచ్చే మార్పు స్పష్టంగా అగుపిస్తుంది. దీనికి ప్రధాన కారణం సూర్యుడుఉత్తరాభిముఖంగా పయనించడమే. అంతవరకు ఎక్కువగా ఉండే రాత్రి సమయం తగ్గుతూ పగటి సమయం పెరుగుతుంది. ఈ కాలాన్ని ఉత్తరాయనం అంటారు. 'ఆయనం' అంటే సూర్యుని దక్షిణోత్తర దిశల పోకడ. సూర్యుడు మకర సంక్రాంతినుంచి కర్కాటక సంక్రాంతివరకు ఉత్తరాభిముఖంగా సంచరించేకాలం ఉత్తరాయనమని, కర్కాటకం నుండి మకర సంక్రాంతివరకు దక్షిణాభిముఖంగా చేసే గమనాన్ని దక్షిణాయనంగా పిలుస్తారు. దక్షిణాయనం పితృదేవతలకు అనుకులూమైనది కాగా... ఉత్తరాయనం దేవతలకు ఉత్తమమైనది. జ్ఞాన మార్గమై, పుణ్యఘడియలుగా రూపాంతరం చెంది పుణ్మాత్ములను స్వాగతించి పునీతులను చేసే మహత్తర కాలంగా పరిగణిస్తారు.

సూర్యమానం ప్రకారం...

మన పండుగలన్నీ తిథిని అనుసరిస్తూ చాంద్రమానం ప్రకారం జరిపేవి. సంక్రాంతిమాత్రం సూర్య గమనాన్ని బట్టి వస్తుంది. ఇది మూడు రోజుల పండుగ. మొదటిరోజు భోగి. దక్షిణాయనానికి ముగింపు సూచకంగా భోగి మంటలు వేసి చలి కాచుకుంటారు. భోగినాడు నువ్వు పిండితో అందరూ అభ్యంగన స్నానం చేస్తారు. సాయంత్రం పూట చిన్న పిల్లల బాలిరాష్టాలు తొలగిపోవడానికి రేగిపండ్లతో దిష్టి తీస్తారు. భోగి అంటే భోగ ం. భోగి పండుగకు సంబంధించి అనేక ఆధ్మాత్మిక కథనాలున్నాయి. అవన్నీ పక్కన పెడితే... శీతాకాలం దాదాపు పంటచేతికి వచ్చి ఇంట్లో సామాన్లు పెట్టేందుకు కూడా స్థలం దొరకని పరిస్థితి ఉంటుంది.. అందుకే ఇంట్లో పనికి రాని సామాన్లన్నీ భోగి మంటల పేరుతో దహించి వేస్తారు.. ఇది ఒక రకం ఇల్లు ను పనికి రాని వస్తువులను వదిలించుకునే పద్ధతి. ఒకప్పుడు గ్రామాల్లో కందులు, ఆముదాలు కొట్టంగా లొట్ట మిగిలేది. ఆ లొట్టకట్టెలన్నీ.. ఎదురుకొచ్చి చలిమంటలు వేసుకునేవాళ్లు. నోట్ల పండ్ల పుల్ల వేసుకుని చలిమంట ముందు నిలబడి... ఎన్ని ముచ్చట్లో! ముందు కాచుకుంటుంటే వెనుక చలిపెడుతుందని... వెనక్కి మరలి కూర్చుని ఆటలు. గిట్టని వాళ్ల మీదకు పొగను పంపుతూ పాడే పాటలు.. ఒకటా రెండా! పట్టణాలనుంచి పల్లెలకు వెళ్లినవారిని... అక్కడినుంచి వచ్చిపొయ్యే ప్రతి ఒక్కరు పలకరింపుల్లో తడిచిపోతూ... చలిమంట దగ్గర కాచుకుంటూ ఎన్ని... మధురమైన జ్ఞాపకాలు. సంక్రాంతి సెలవు రోజుల్లో ప్రతి రోజూ ఇండ్ల ముందల ప్రతిఫలించే దృశ్యం. ఇప్పుడు ఇండ్ల చుట్టూ ప్రహారీలు వచ్చాయి. అవి మనుషల మధ్యా.. మనసుల మధ్య సైతం గోడలు కట్టాయి. ఒకప్పుడు గల్లీకొకటిగా కనపడే చలిమంటలు ఇప్పుడు కాస్త పలుచనయ్యాయి.

సంక్రాంతి పొంగలిలో...

సంక్రాంతి నాడు చేసే పొంగలికి బియ్యం, నవ్వులు, బెల్లం ఉపయోగిస్తారు. దీనితోపాటు పండుగ రోజు పిండితో అరిసెలు చేస్తారు వీటిలో కూడ పోషక విలువలు అధికంగా ఉంటాయి. కడిగిన బియ్యం నీటిని పంచదారతో సేవించడం వల్ల మూత్ర విసర్జన బాగా జరుగుతుంది. దప్పిక తగ్గుతుంది. వేసవిలో ఎండను తగ్గిస్తుంది. తిదోషహరిణిగా పనిచేస్తుంది. శరీరానికి కార్బోహైడ్రేట్లు అధికంగా అందుతాయి. నవ్వులు శరీరంలో ఉష్ణ ఉత్పత్తిని పెంచుతాయి. ఔషధ గుణం ఉంటుంది. మూత్ర సంబంధిత వ్యాధులను తగ్గిస్తాయి. కాల్షియం అధికంగా ఉంటుంది. ఎముకలు అరిగిపోయినప్పుడు వాటిని సరిచేయడంలో ముఖ్య పాత్ర వహిస్తుంది. ఇక బెల్లం రక్తవ ద్ధికి పనిచేస్తుంది. శరీరంలో ఖనిజలవణాలను పెంచుతుంది. ఉష్ణ, తుష్టి, శరీరంలో కాంతిని పెంచుతుంది. కోప, తాపాలను తగ్గిస్తుంది. హృద్రోగనివారిణిగా పనిచేస్తుంది. సర్వదోష లక్షణాలు ఉంటాయి. ఇన్ని ఆరోగ్య రహస్యాలున్న పొంగలిని... కొసరికొసరి వడ్డించుకుంటూ అందరూ కలిసి తినడం ఓ అద్భుతమైన అనుభవం.



పతంగుల పండుగ...

తెలంగాణలో కనుమ అంటే పతంగుల పండుగ. చిన్నాపెద్దా అంతా కలిసి.. పతంగులై గాలిలో తేలిపోతుంటారు. రెండు వెదురు పుల్లలు, రంగు కాయితాలు లేదంటే న్యూస్ పేపర్లు, కాస్తంత మైదా, దారం ... పతంగి రెడీ! చిన్ని చిన్ని చేతులతో, రంగు కాయితాలు కత్తిరించి, అతికించి. పిల్లల గుంపంతా ఒక దగ్గర చేరితే ఎన్ని కళలు బయటపడేవో. ఒక చేతిలో మాంజా, మరో చేతులో పతంగి పట్టుకుని చెలక వరాలపై పరుగులు పెడుతుంటే... ఎంత ఆనందమో! గాలిని అర్థం చేసుకుంటూ ఒడుపుతో డీల్ కడుతూ... ఖీంచ్‌కాట్‌లు కొడుతూ.. గెలుపుకోసం ఓ యుద్ధమే. మధ్యలో ఎవరైనా కట్ కొట్టిర్రా... దారం తెగిన గాలిపటం కోసం ఎంత వెదుకులాటనో! ఏ చెట్టు కొమ్మనో చిక్కి దక్కకపోతే బాధ... దక్కితే మళ్లీ పోరాటం కోసం ప్రయత్నం. ఎంత బాగుండేదో! ఇప్పుడు ప్లాస్టిక్ మాంజాలొచ్చాయ్! ఒక పతంగి పోతే... పోయిందే అన్న బాధ లేదు... దాని బదులు మరోటి కొనుక్కుందాంలే ఈజీగ్ తీసుకునే తత్వం. అప్పటి వెదుకులాటకి... ఇప్పటి పోయిందిలే అనుకోవడానికి మధ్య ఎంత మార్పు! గుర్తు చేసుకున్నప్పుడల్లా మనసంతా బాధతో మూలుగుతుంటుంది.

హరిదాసులు, గంగిరెద్దులు ఒకప్పటి మాటలు. ఇప్పుడు హరిదాసుల సంకీర్తనలు లేవు. గంగిరెద్దుల ఆటలు లేవు. పండుగైనా పబ్బమైనా టీవీలకే అతుక్కుపోతున్నాం. పట్నం నుంచి శరీరం మాత్రమే పల్లెకు పోతోంది. మనుషులు ఎంత దగ్గరగా ఉన్నా.. మునుపటిలా మనసులు దగ్గర కావడం లేదు. పలకరింపులు నామమాత్రాలయ్యాయి. మర్యాదలు మొక్కుబడిగా మారాయి. ఇంట్లో ఉన్నా సెల్‌ఫోన్‌తోనో, ల్యాప్‌టాప్‌తోనో, టీవీతోనో నిరంతర సంభాషణ చేస్తున్నాడు మనిషి. అందుకే ఈ పర్వదినాన్నైనా గాడ్జెట్స్‌ని కాస్త పక్కన పెట్టేద్దాం. మనుషులతో ఉందాం. మనస్ఫూర్తిగా కలిసి ఉందాం. పని ఒత్తిళ్లు, ఆందోళనలు ఎప్పుడూ ఉండేవే. వాటన్నింటినీ పక్కన పెట్టి... ఇరుగుపొరుగుతో సంతోషాన్ని పంచుకుందాం. పతంగులతోపాటు మనసులను ఎగరేసి ఆనంద డోలికల్లో తేలిపోదాం!

పెద్ద పండుగ



ఇండ్ల ముంగిళ్ళలో ఇంద్ర ధనుస్సులు
రంగవల్లులై పరుచుకుంటున్న సంబురం
గగనాన బాల్యాలు
గాలిపటమై ఎగురుతున్న సంబురం
పల్లెసుద్దుల పలుకులతో
డూ.. డూ బసవల విన్యాసపు సంబురం

పాతకు గోరీ కడుతూ..
కొత్తకూ భేరీ కొడుతూ..
భోగి మంటల భాగ్యాలకు
యువత సయ్యాటల సంబురం

కాల గమనంలో కరిగిపోతున్న
హరిదాసు ఆటపాటలు
మచ్చుకు చూస్తున్న సంబురం

అన్నీ మారుతున్నాయ్..
మసక బారుతున్నాయ్..
పచ్చని పల్లెల్ని జల్లెడ పట్టుకోవాలేమో..

ఎన్ని రంగుల ఎన్ని హంగుల
పెద్ద పండుగొచ్చినా..
పెద్దనోట్ల రద్దుల పద్దు
రైతుకు కానరాని వెలుగుల పొద్దు

పండిన పంటకు లేదు గిట్టుబాటు
వండిన వంటపైనే తిరుగుబాటు
పెద్ద పండుగ ఇప్పుడు పెద్దోళ్ల పండుగ..!

కడు పేదవాడి కడగండ్లు తీరి
కాంతులు చిమ్మినప్పుడే సంక్రాంతి..!

- కటుకోర్ఝ్వల రమేష్
9949083327



అది కావాలి! ఇది కావాలి!

పిల్లలను షాపింగ్ కు తీసుకెళ్లాలంటే తల్లిదండ్రులకు భయం. ఎందుకంటే మొండిగా ప్రవర్తిస్తారు. 'ఇది కొనివ్వ లేదంటే ఇంటికి రాను' అని అక్కడే కూర్చోని ఏడుస్తుంటారు. అలా మొండిగా ప్రవర్తించే పిల్లలతో కింది విధంగా మెలిగితే సరిపోతుంది.

- పిల్లలకు అవసరమైనవి కొనిస్తే సరిపెట్టుకోరు. పక్కవారివి కూడా కావాలని మారాం చేస్తుంటారు. అలాంటి సమయంలో వారి మనసు నొప్పించకుండా నెమ్మదిగా చెప్పండి. 'నీతో ఉన్న వస్తువులు నీ స్నేహితుల వద్ద లేవు కదా! మరెందుకు అవి మనకు అవసరం లేదు చిన్నా' అని చెబితే చక్కగా వింటారు.
- ఇంట్లో ఇద్దరు చిన్నారులుంటే పెద్దవారు సున్నితంగా, చిన్నవారు మరీ మొండిగా ప్రవర్తిస్తారు. అలా మొండిగా ప్రవర్తించే పిల్లలకు కాస్త భయం పెట్టడంలో తప్పేం లేదు. వాళ్లు ఏ ఏ విషయాల్లో మొండికేస్తున్నారో గమనించుకుంటే సరిపోతుంది.
- ఇంటి నుంచి షాపింగ్ కు వెళ్లేముందు పిల్లలతో మనం ఇవి మాత్రమే కొనుక్కోవడానికి వెళ్తున్నాం అని చెబితే సరిపోతుంది.

ప్రోటీన్లు ఉండే పదార్థాలు...


ప్రోటీన్లు పుష్కలంగా ఉండే ఆహారపదార్థాలను తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. దాంతో పాటు ఎముకలు దృఢంగా ఉంటాయి. ప్రోటీన్లు అధికంగా ఉండే పదార్థాలేంటో తెలుసుకుందాం!

- గుడ్డులో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. గుడ్డు 6 గ్రాముల ప్రోటీన్లను కలిగి ఉంటుంది. ప్రతిరోజు ఉదయం ఉడికించిన గుడ్డు తింటే ఆరోగ్యంగా ఉంటారు. బ్రేక్ ఫాస్ట్‌గా ఒక ఉడికించిన గుడ్డు తింటే సరిపోతుంది.
- వెన్నలో కూడా ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి. దీంట్లో 13 గ్రాముల ప్రోటీన్లు ఉంటాయి. వెన్న తినడానికి ఇష్టపడని వారు వివిధ రకాల వంటల్లో, స్వీట్స్‌లో వేసుకొని తింటే మంచిది.




- కప్పు సోయా పాలల్లో 8 గ్రాముల ప్రోటీన్లు ఉంటాయి. సోయా పాలు ఎముకల దృఢత్వానికి దోహదపడతాయి. అలాగే శరీరానికి అవసరమైన కాల్షియంను అందిస్తాయి.
- కప్పు పెరుగు 15 గ్రాముల ప్రోటీన్లను కలిగి ఉంటుంది. కాబట్టి తప్పకుండా ఒక కప్పు చిక్కటి పెరుగును ఆహారంలో చేర్చుకుంటే సరిపోతుంది. పెరుగును లస్సీ మాదిరి చేసుకొని తాగినా మంచి ఫలితం ఉంటుంది.
- రెండు చెంచాల బాదం గింజల్లో 6 గ్రాముల ప్రోటీన్లు ఉంటాయి. బాదం పొడిని సలాడ్స్ లేదా వంటకాల్లో వేసుకొని తినాలి.
- వేరు శనగ గింజల్లో కూడా ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి. ఒక కప్పు వేరు శనగ గింజల్లో 22 గ్రాముల ప్రోటీన్లు ఉంటాయి. కాబట్టి ప్రతిరోజు కొన్ని వేయించుకొని లేదా ఉడికించుకొని తిన్నా సరిపోతుంది.

ముత్యాల ముగ్గులు




డి.అపర్ణ
సూర్యాపేట




25చుక్కలు
1 వరుస
1 వచ్చేవరకు

పి. యమున
మల్కాజ్‌గిరి
హైదరాబాద్




11 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు సరిచుక్క

యం. దీపిక
విద్యానగర్
హైదరాబాద్



21 చుక్కలు
11వచ్చేవరకు
మధ్య చుక్క

కె. శ్రవంతి
మల్కాజ్‌గిరి
హైదరాబాద్



21 చుక్కలు
11 వచ్చేవరకు
సరిచుక్క

ఐ. స్వరూప, మిర్యాలపెంట,
బయ్యారం మండలం




16చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు
సరిచుక్క

సి. వెన్నెల
గ్రా. రంగాపూర్
నాగర్ కర్నూల్



ఉషా
ఉప్పల్
హైదరాబాద్

21 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకు



బి. నవ్యశ్రీ
బండారుపల్లి
భూపాలపల్లి

9చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి : సీఎం

- శ్రీవారి సేవలో ముఖ్యమంత్రి కుటుంబం



తిరుపతి : రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా, కరువు కాటకాలు లేకుండా చూడాలని శ్రీవారిని వేడుకున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. భోగి పండుగను పురస్కరించుకుని తిరుమల శ్రీవారిని చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. సంప్రదాయ దుస్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా మహద్వారం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తన కులదైవమైన శ్రీవెంకటేశ్వరుడిని సంక్రాంతి సందర్భంగా కుటుంబ సభ్యులందరితో కలిసి దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించానని పేర్కొన్నారు. శ్రీవారి అనుగ్రహంతో పోలవరం, అమరావతి త్వరలో పూర్తి చేయాలని కోరుకున్నానని తెలిపారు. తెలుగు వారికి మరో మారు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో ముఖ్యమంత్రితోపాటు అయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు నారా లోకేష్, కోడలు నారా బ్రాహ్మణి, మనుమడు దేవాన్ష్, తమ్ముడి కొడుకు సిని హీరో నారా రోహిత్, నందమూరి బాలకృష్ణ దంపతులు ఉన్నారు.

సాగర్ కుడి కాల్వకు తగ్గిన నీరు

- మిర్చి రైతుల్లో ఆందోళన

గుంటూరు : నాగార్జున సాగర్ ఆయకట్టులో కుడికాల్వ ద్వారా మెట్ట ప్రాంతానికి నీటి విడుదలను అధికారులు గణనీయంగా తగ్గిస్తున్నారు. దీంతో ఆయకట్టు పరిధిలో వివిధ రకాల పంటలు వేసిన రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. శనివారం వరకూ 9 వేల క్యూసెక్కులు విడుదలవుతుండగా ఆదివారం నుంచి 4,400 క్యూసెక్కులు అధికారులు విడుదల చేస్తున్నారు. ప్రధానంగా మిర్చికి మరో తడి నీరు అవసరమని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మంచు బాగా కురుస్తుండటంతో నీటి ఎద్దడి ఉన్నా ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు. మిర్చి తొలి కోతలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ వరకూ కోతలు కొనసాగుతాయి.

కత్తులు దూసిన కోళ్లు

చేతులు మారిన కోట్లు

- నాయకులే ప్రారంభకులు
- పత్తా లేని పోలీసులు
- అనంతపురం'లో పందుల పోటీలు
- కృష్ణాలో పొట్టేళ్ల పందాలు
- చిత్తూరు జిల్లాలో జల్లికట్టు



విజయవాడ : సంక్రాంతి పండుగ ఆదివారం భిన్న దృశ్యాలను ఆవిష్కరించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒకవైపు యువజనులు, ప్రజల్లో ఐక్యమత్యాన్ని, సామ రస్యాన్ని ప్రభోదిస్తూ ప్రజాసంఘాలు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహిస్తుండగా మరోవైపు గోదావరి జిల్లాల్లో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ కోడి పందేలను వేడుకగా దగ్గరుండి మరీ వేయించడం చర్చనీయాంశంగా మారింది. కోడి పందేలు జరక్కుండా గట్టి చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినా, జిల్లా స్థాయి పోలీసు అధికారులు 144వ సెక్షన్ విధించి పందేలను ఎట్టి పరిస్థితుల్లోనూ జరగనివ్వ బోమని ప్రకటించినా అన్నీ ఉత్తుత్తే అని తేలిపోయింది. పందేలు యథేచ్ఛగా సాగిపోయాయి. ఒక్క కోడి పందేలే కాదు.. అనంతపురం జిల్లాలో పందులు పందేలను ఎమ్మెల్యే జెసి ప్రభాకరరెడ్డి,కృష్ణాలో పొట్టేళ్ల పోటీలను పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రారంభించగా.. చిత్తూరు జిల్లాలో జల్లికట్టు పోటీలను నిర్వహించారు. ఇక పందేల్లో భాగంగా గుండాటలు, మూడు ముక్కలాటలు రంజుగా సాగాయి. మద్యం ఏరులై పారింది.

పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 300 బరుల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. జంగారెడ్డిగూడెంలోని శ్రీనివాసపురం, పాల్లకొల్లు ఏరియాలోని పూలపల్లి, కలగంపూడి, భీమడోలు మండలంలోని గుండుగొలను, పెదవేగి మండలం, భీమవరం, కొవ్వూరు, తాళ్లపూడి, పోడూరు, పెనుమంట్ర, చాగల్లు, దేవరపల్లి, జీలుగుమిల్లి, వీరవాసరం, ఆకివీడు, పాలకోడేరు, ఆచంట ప్రాంతం లోనూ యథేచ్ఛగా పందేలు వేశారు. గుండుగొలనులో ఉంగుటూరు ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు, బయ్యన్నగూడెంలో పోలవరం ఏమ్మెల్యే మొడియం శ్రీనివాస్ స్వయంగా పందేలను ప్రారంభించారు. పందేలపై పోలీసులు చేతులెత్తేయడంతో బరుల వద్ద మూడు ముక్కలాట, గుండాట యథేచ్ఛగా సాగాయి. మద్యం ఏరులై పారింది. జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్ కొనసాగుతుందని పోలీసులు చెప్పినప్పటికి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారు. తొలి రోజే రూ.10 కోట్ల నుంచి రూ.20కోట్లు మేర పందేలు జరిగినట్లు అంచనా వేస్తున్నారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుండి పెద్దఎత్తున పందెంరాయుళ్లు జిల్లాకు చేరుకుంటు న్నారు. వెంప గ్రామంలో పందేలను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తుండగా వివాదం చోటుచేసుకుంది.

తూర్పుగోదావరి జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల, అల్లవరం మండలం గోడి, గోడిలంక ప్రాంతాలతోపాటు జిల్లాలో 90కి పైగా బరుల్లో ఆదివారం కోడి పందేలు యథేచ్ఛగా సాగాయి. ఒక్క మురమళ్లలోనే భోగి రోజు రూ.25కోట్ల మేర పందేలు, జూదాలు జరిగాయని అంచనా. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా పందెంరాయుళ్లు రావడంతో పందేలు జరిగిన ప్రాంతం జనంతో కిక్కిరిసింది. జిల్లావ్యాప్తంగా భోగి రోజున రూ.70 కోట్లకుపైగా పందేలు జరిగాయని అంచనా. ఐ.పోలవరం మండలం మురమళ్లలో 15 ఎకరాల్లో 10 బరులు సిద్ధం చేశారు. 2,500 మంది తిలకించేలా మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేశారు. మీడియా ప్రతినిధులు రాకుండా వందమంది గార్డులను నియమించారు. ఐదు వేల వాహనాలు పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. ఈ బరిని కోటిన్నరకు వేలం వేసినట్టు, గుండాటల నిర్వహణకు రూ.50 లక్షలకు వేలం పాట జరిగిందని ప్రచారం జరుగుతోంది. ఇక్కడ 20 గుండాట బోర్డులు ఏర్పాటు చేశారు. బరుల వద్ద మద్యం, బిర్యానీ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) మురమళ్లలో పందేలను ప్రారంభించారు. గతేడాది కూడా ఈయనే పందేలను ప్రారంభించారు.

పెదగొట్టిపాడు క్షతగాత్రులకు పరామర్శ

గుంటూరు : గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో అగ్రకులాల దాడిలో గాయాలపాలై క్షతగాత్రులను సీపీఐ(ఎం) నేతలు ఆదివారం పరామర్శించారు. గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రి (జిజిహెచ్)లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు జొన్నలగడ్డ ప్రకాష్, బూసి దీనాభరణంను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి పాశం రామారావు, న్యాయవాది వైకె, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు. బాధితులకు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని మధు భరోసా కల్పించారు. పెత్తందార్లు మారణాయుధాలతో తమ ఇళ్లలోకి చొరబడి దాడి చేశారని బాధితులు నేతల దృష్టికి తెచ్చారు. ప్రకాష్‌కు కాలుకి, దీనాభరణంకు చెయ్యి, కాలుకి తీవ్ర గాయాల య్యాయి. క్షతగాత్రులకు ఆపరేషన్ అవసరం అని నిర్ధారించినప్పటికీ ఆలస్యం జరుగుతున్నట్లు నాయకుల దృష్టికి వచ్చింది. ఈ సందర్భంగా మధు మీడియాతో మాట్లాడుతూ.. గొట్టిపాడు క్షతగాత్రులకు వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు.

అడకత్తెరలో డీఎడ్ అభ్యర్థులు

విశాఖ: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు అనుమతించినా దరఖాస్తులో ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు డీఎడ్ అభ్యర్థులకు తల బొప్పి కట్టిస్తున్నాయి. టెట్‌కు కనీస అర్హత వయసు పద్దెనిమిదేండ్లు ఉన్నప్పటికీ వెబ్‌సైట్ తమ దరఖాస్తును నిరాకరిస్తుండడంతో డీఎడ్ అభ్యర్థులు హతాశులవుతున్నారు. 2016 – 18 బ్యాచ్ డీఎడ్ అభ్యర్థులకు మొదటి సంవత్సరం పరీక్షలు కూడా నిర్వహించలేదు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా బ్యాచ్ డీఎడ్ అభ్యర్థుల ఆందోళనలతో ప్రభుత్వం స్పందించింది. వారిని టెట్‌కు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వారంతా దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఎన్‌సీటీఇ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్) మార్గదర్శకాల ప్రకారం టెట్ దరఖాస్తుదారులకు పద్దెనిమిదేళ్లు నిండాలి. అయితే 1999 జులై 1వ తేదీ తర్వాత జన్మించిన విద్యార్థుల దరఖాస్తులు వెబ్‌సైటులో నమోదు కావట్లేదు.

25న 'పద్మావత్' విడుదల

న్యూఢిల్లీ : ఎట్టకేలకు 'పద్మావత్' సినిమా విడుదల తేదీని అధికారంగా ప్రకటించారు. ఈ నెల 25న పద్మావత్ విడుదల చేస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారంగా ప్రకటించింది. సినిమా చిత్రీకరణ ప్రారంభమైన దగ్గర నుంచి పద్మావత్ ఎన్నో వివాదాల్లో చిక్కుకుంది. ఈ సినిమాను ముందుగా గత ఏడాది డిసెంబరు 1న విడుదల చేయాలని ముందుగా చిత్ర నిర్మాతలు భావించారు. అయితే మతత్వ శక్తులు, మితవాదులు ఈ సినిమా విడుదలకు అడ్డంకులు సృష్టించారు. దర్శకుడు సంజయ్ లీలా బన్సాలి,నటి దీపికా పదుకునేను హత్య చేస్తామని బెదిరించారు. వారి తల నరికితే బహుమతి ఇస్తామని కూడా ప్రకటించారు. చివరికి సినిమాకు కొన్ని మార్పులతో పాటు, 'పద్మావతి'గా ఉన్న ఈ సినిమా పేరును పద్మావత్‌గా మార్చాలని కేంద్ర సెన్సార్ బోర్డు సూచించింది. మార్పులతో సినిమా విడుదలకు అనుమతి ఇచ్చింది. ప్రతీ భారతీయుడు గర్వించేవిధంగా సినిమాను ప్రపంచ వ్యాప్తంగా విడుదలచేస్తున్నట్లు వయాకామ్18 గ్రూప్ సిఈఓ సుధాన్షు వాత్స్ ఒక ప్రకటనలో తెలిపారు. తన పద్మావత్ కల నిజమవుతుందని దర్శకుడు సంజయ్ లీలా బన్సాలి ప్రకటించారు. ఈ సినిమాలో రాజ్‌పుత్ యోధుల గౌరవం, సాహసాలను అందంగా తెరకెక్కించినట్లు ఆయన తెలిపారు.

అభ్యంతరకర దృశ్యాలు తొలగించాలి : కేంద్రమంత్రి అత్‌వాలే

రాజపుత్రులు అవమానంగా భావించే దృశ్యాలను పద్మావత్ సినిమా నుంచి తొలగించే వరకు దానిని విడుదల చేయొద్దని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత సహాయ మంత్రి రామ్‌దాస్ అతవాలే శనివారం అన్నారు. పద్మావతి పేరును 'పద్మావత్'గా మార్చడం మాత్రమే సరిపోదని ఆయన అన్నారు. రాజపుత్రులకు సంబంధించినంత వరకు సినిమాపై వారి అభ్యంతరాలు తొలగిపోలేదన్నారు. ఆ సినిమా విడుదలను నిలిపివేయాలని అన్నారు.

వేతన సంఘం ఆనవాయితీకి స్వస్తి చెప్పనున్న కేంద్రం : ఆర్థికశాఖ వర్గాలు

న్యూఢిల్లీ:ఉద్యోగుల జీతభత్యాల పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం కొత్తగా వేతన సంఘాన్ని ఏర్పాటు చేయబోదని ఆర్థికశాఖలోని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఆనవాయితీగా వస్తున్న వేతన సంఘం ఏర్పాటు విధానానికి కేంద్రం స్వస్తి పలకనున్నట్టు ఆ అధికారి తెలిపారు. భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారుల జీతభత్యాల సమీక్ష కోసం 8వ వేతన సంఘానికి బదులు ప్రత్యామ్నాయాలపై కేంద్రం దృష్టి సారించినట్టు తెలుస్తోంది. 7వ వేతన సంఘం కూడా ఉద్యోగుల వేతనాల పెంపు కోసం పదేండ్లదాకా వేచి చూడటమెందుకని సూచించినట్టు అధికారులు గుర్తు చేస్తున్నారు. ధరల సూచీకనుగుణంగా ప్రతి ఏటా ఉద్యోగుల వేతనాలను సమీక్షించాలని 7వ వేతన సంఘం చైర్మన్ జస్టిస్ ఏకె మాథుర్ సూచించారు.

పాథ్‌కేర్ ఆధ్వర్యంలో జినోమిక్స్ డివిజన్ ప్రారంభం



హైదరాబాద్ :క్లినికల్ లేబోరేటరీ రంగంలో దూసుకుపోతున్న పాథ్‌కేర్ మరో ముందడుగు వేసింది. కీసర మండల పరిధిలోని చిర్యాల గ్రామపరిధిలోని సంస్థ ప్రధానకార్యాలయంలో జినోమిక్స్ డివిజన్‌ను శనివారం ప్రారంభించింది.ఈ ప్రారంభోత్సవానికి ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నగరంలోని బేగంపేట సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పాథ్‌కేర్ ఫౌండర్ అండ్ చైర్మెన్ జీవీ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో పేరున్న ల్యాబులలో పాథ్‌కేర్ ఐదోస్థానంలో ఉన్నదని తెలిపారు. దేశవ్యాప్తంగా 40 కిపైగా ప్రాసెసింగ్ సెంటర్లు,2వేల శాంపిల్ సేకరణ కేంద్రాలు అనుభవజ్ఞులైన సిబ్బందితో..పదేండ్లుగా తమ సంస్థ సేవలందిస్తోందని వివరించారు.ఎన్ఏబీఎల్,క్యాప్ గుర్తింపు పొందిందని ఆయన గుర్తుచేశారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుంటున్న సంస్థను ఐటీ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ ప్రశంసించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఈఓ అనిల్ సుంకర,డైరెక్టర్లు నందినీ ప్రసాద్, డాక్టర్ పార్వతీదేవీ,వి.శ్రీనివాస్,వైస్ ప్రెసిడెంట్ ఆదర్శ్ శ్రీవాస్తవ, ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ సీఎల్ఎన్ భాస్వాన్,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులకు రైల్వే వాత!

న్యూఢిల్లీ : దూరప్రాంతాలనుంచి వచ్చే ప్రయాణికులు తమ వస్తువులను భద్రంగా ఉంచుకోవటానికి రైల్వే క్లాక్ రూమ్స్,లాకర్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.ఇప్పటికే రైల్వేప్రయాణికులపై భారాలు మోస్తున్న రైల్వేబోర్డు తాజాగా లగేజ్ దాచుకోవాలంటే బాదేలా నిర్ణయం తీసుకున్నది.2000 సంవత్సరంలో ఏడు రూపాయలుంటే..ప్రస్తుతం 24 గంటలపాటు లాకర్ వాడితే రూ.20 వసూలు చేస్తున్నారు.అంతకు మించితే రూ.30 వసూలు చేస్తున్నారు.తాజాగా పెంచే చార్జి భారాన్ని డివిజనల్ రైల్వే మేనేజర్లకు కట్టబెడుతూ రైల్వే బోర్డు నిర్ణయం తీసుకున్నట్టు రైల్వే వర్గాలు తెలిపాయి.

విద్యా సంస్కరణల లొల్లి

నిటి ఆయోగ్, హెచ్‌ఆర్‌డీ మంత్రిత్వశాఖ మధ్య కుదరని రాజీ

- ఒడిషా, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌కు నిటి ఆయోగ్ ప్రణాళికలు
- యూపీ, జమ్మూకాశ్మీర్‌కు హెచ్‌ఆర్‌డీ ప్రణాళికలు
- మమ్మల్నే అనుసరించాలంటూ హెచ్‌ఆర్‌డీ హుకుం..?



న్యూఢిల్లీ: విద్యా విధానాన్ని పునర్ వ్యవస్థీకరించడం కోసం కేంద్ర ప్రభుత్వ మేధోమథన సంస్థ నిటి ఆయోగ్ చేపట్టిన సాత్(సస్టెయినెబుల్ యాక్షన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ హ్యూమెన్ క్యాపిటల్) కార్యక్రమానికి మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ(హెచ్‌ఆర్‌డీ) నుంచి అభ్యంతరం వ్యక్తమైనట్టు తెలుస్తోంది. సాత్‌లో భాగంగా రోడ్ మ్యాప్ రూపొందించడానికి ఒడిషా, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో నిటి ఆయోగ్ ఒప్పందాలు చేసుకున్నది. కానీ, దేశంలోని విద్యా సంస్థలకు నిధులు అందివ్వడంతోపాటు నియంత్రణ అధికారం హెచ్‌ఆర్‌డీ చేతిలో ఉన్న విషయం తెలిసిందే..

గతేడాది ఉత్తర్‌ప్రదేశ్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాలకు ఆ రాష్ట్ర ప్రభుత్వాల కోరిక మేరకు విద్యా విధానంలో సంస్కరణలతో కూడిన రోడ్‌మ్యాప్‌ను హెచ్‌ఆర్‌డీ తయారు చేసి ఇచ్చింది. కాలపరిమితిలో అమలు చేయాలని ఆ రాష్ట్రాలకు సూచించింది. ఉత్తరప్రదేశ్ విషయంలో హెచ్‌ఆర్‌డీతో ఆ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జరిపిన చర్చల ఫలితంగా రోడ్‌మ్యాప్‌ను రూపొందించారని కేంద్ర అధికారి ఒకరు తెలిపారు. అయితే, అందుకు అధికారిక ఒప్పందమేమీ లేదని ఆయన చెప్పారు. కానీ, నిటి ఆయోగ్ చేపట్టిన సాత్ కార్యక్రమాన్ని మాత్రం 30 నెలలపాటు భాగస్వామ్య రాష్ట్రాలతో అధికారిక ఒప్పందం ద్వారా కొనసాగిస్తారు. ఈ ప్రాజెక్ట్‌కయ్యే ఖర్చును నిటి ఆయోగ్, రాష్ట్రాలు చెరి సగం భరించాలి. హెచ్‌ఆర్‌డీకీ నిటి ఆయోగ్‌కీ మరో తేడా ఏమంటే..హెచ్‌ఆర్‌డీ ప్రణాళికల్ని రాష్ట్రాల విద్యాశాఖలు స్వేచ్ఛగా అమలు చేయడానికి స్వతంత్రత ఉంటుంది. నిటి ఆయోగ్ విషయంలో మూడు రాష్ట్రాల విద్యాశాఖల్లో రెండు ప్రయివేట్ బృందాలు ప్రణాళికల అమలును పర్యవేక్షిస్తాయి.

నిటి ఆయోగ్ ప్రణాళిక మొదటి దశ..

మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న ప్రణాళికా సంఘం స్థానంలో 2015లో నిటి ఆయోగ్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ దీర్ఘకాలిక వ్యూహాత్మక విధానాలు, కార్యక్రమాల రూపకల్పనలో సలహాలివ్వడం నిటి ఆయోగ్ బాధ్యత. కేంద్రంతోపాటు రాష్ట్రాలకు సాంకేతికపరమైన సలహాలివ్వడం కూడా నిటి ఆయోగ్ బాధ్యత. కేంద్ర–రాష్ట్ర సంబంధాలను పునర్‌నిర్వచించాలని నిటి ఆయోగ్ ప్రతిపాదించింది. కేంద్రం–రాష్ట్రాలు సమాన భాగస్వామ్యంతో కలిసి పని చేయాలంటూ సమాఖ్య సహకార విధానాన్ని నిటి ఆయోగ్ సూచించింది.



గతేడాది మే నెలలో విద్య, ఆరోగ్య రంగాలలో అభివృద్ధికి తమ సహకారం తీసుకోవాలని కోరుతూ అన్ని రాష్ట్రాలకు నిటి ఆయోగ్ లేఖ రాసింది. అందుకు 16 రాష్ట్రాలు మాత్రమే స్పందించాయని నిటి ఆయోగ్ అధికారి ఒకరు తెలిపారు. ప్రణాళికల అమలుకు ముఖ్యమంత్రుల్లో సంకల్పం ఉండాలని తాము కోరుకుంటామని ఆ అధికారి అన్నారు. రాష్ట్రాలకు సహకారమందించేందుకు బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్‌తోపాటు దాతృత్వ సంస్థ పిరామల్ గ్రూప్‌నకు చెందిన పిరామల్ ఫౌండేషన్ ఫర్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సంతకాలు చేశాయని ఆ అధికారి తెలిపారు. జూన్ 10న ఆసక్తి చూపిన 16 రాష్ట్రాల్లో 14 రాష్ట్రాలు తమ విద్య, ఆరోగ్య రంగాల గురించిన వివరాలతోపాటు అభివృద్ధి ప్రణాళికలను ఇచ్చాయని ఆ అధికారి తెలిపారు. దాంతో, సాత్ కార్యక్రమాన్ని నిటి ఆయోగ్ ప్రారంభించిందని చెప్పారు. ఆగస్టులో ఈ కార్యక్రమం కోసం ఒడిషా, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలను ఎంపిక చేశారు. ఈ దశ వరకూ హెచ్‌ఆర్‌డీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నది. హెచ్‌ఆర్‌డీలోని ఓ డైరెక్టర్ కూడా మూడు రాష్ట్రాల్లోని కమిటీల్లో భాగస్వామిగా ఉన్నారు. ఆ తర్వాత తమ ప్రణాళికలపై హెచ్‌ఆర్‌డీ మంత్రిత్వశాఖ అభ్యంతరం వ్యక్తం చేసిందని నిటి ఆయోగ్ అధికారి స్క్రోల్ డాట్ ఇన్ ప్రతినిధికి తెలిపారు. మంత్రిత్వశాఖకు మేం సమాచారమిచ్చాం. సలహాలు స్వీకరిస్తాం. నిధులు ఇచ్చి అమలు చేయాల్సింది వాళ్లే. మేం ప్రణాళికలు మాత్రమే సిద్ధం చేయగలమని నిటి ఆయోగ్ అధికారి స్పష్టం చేశారు. నవంబర్‌లో ఒడిషా ప్రభుత్వంతో, డిసెంబర్‌లో మధ్యప్రదేశ్ ప్రభుత్వంతో ఇప్పటికే ఎంయూపై సంతకాలు జరిగాయని ఆ అధికారి తెలిపారు. జార్ఖండ్‌తోనూ ఒప్పంద ప్రక్రియ పూర్తి కానున్నదని ఆయన తెలిపారు. త్వరలోనే ఈ మూడు రాష్ట్రాల్లో సంస్కరణలు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. డిసెంబర్‌లో ఆ మూడు రాష్ట్రాల విద్యాశాఖలతో కలిసి ఇప్పటికే వర్క్‌షాపులు నిర్వహించామని, స్వచ్ఛంద సంస్థలు కూడా వాటిలో పాల్గొన్నాయని ఆ అధికారి తెలిపారు. కానీ, ఈ కార్యక్రమాల్లో హెచ్‌ఆర్‌డీని ఆహ్వానించినప్పటికీ ఎవరూ పాల్గొనలేదని ఆయన చెప్పారు. అయితే, యూపీ, జమ్మూకాశ్మీర్‌కు సంబంధించిన ప్రణాళికలను పంపిన హెచ్‌ఆర్‌డీ మంత్రిత్వశాఖ వాటిని అనుసరించాలని తమను కోరిందని ఆయన తెలిపారు. కానీ, మా బృందాలు ఇప్పటికే ఆ మూడు రాష్ట్రాలకు విధానాలను ఖరారు చేశాయని నిటి ఆయోగ్ అధికారి చెప్పారు.

విలీనం, మూసివేతలో రెండింటి మధ్యా ఏకాభిప్రాయం

రోడ్‌మ్యాప్‌ల విషయంలో నిటి ఆయోగ్, హెచ్‌ఆర్‌డీ మధ్య విభేదాలున్నప్పటికీ హాజరీ తక్కువగా ఉన్న పాఠశాలల మూసివేత, విలీనం విషయంలో ఏకాభిప్రాయం ఉన్నట్టు తెలుస్తోంది. 50మందికన్నా తక్కువ సంఖ్య ఉన్న పాఠశాలల మధ్య కి.మీ.కన్నా తక్కువ దూరం ఉన్నపుడు విలీనం చేయాలని యూపీకి హెచ్‌ఆర్‌డీ మంత్రిత్వశాఖ సూచించింది. తమ ప్రణాళికల్లోనూ అదే ప్రధానాంశమని నిటి ఆయోగ్ అధికారి తెలిపారు.

సాత్‌ను అమలు చేయడంలో ఒడిషా ముందు వరుసలో ఉన్నట్టు ఆయన తెలిపారు. అక్కడ 10మంది విద్యార్థులకన్నా తక్కువ సంఖ్య పాఠశాలలు 4200 ఉన్నట్టు గుర్తించారు. అయితే, జిల్లాస్థాయి అధికారులిచ్చిన ఆ సమాచారంపై తాము పరిశీలన జరుపుతున్నట్టు ఒడిషా రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ డైరెక్టర్ చింతామణిసేత్ తెలిపారు. కిలోమీటర్ పరిధిలో పాఠశాల లేనట్టయితే విద్యార్థులకు రవాణా ఖర్చులు ఇచ్చే ఆలోచన ఉన్నట్టు ఆయన తెలిపారు. ప్రణాళికలో భాగంగా ప్రాథమిక పాఠశాలలను(1 నుంచి 5వ తరగతి) సమీపంలోని ప్రాథమికోన్నత పాఠశాలలతోనూ(6 నుంచి 8వ తరగతి), ప్రాథమికోన్నత పాఠశాలలను సెకండరీ పాఠశాలలతోనూ (9,10 తరగతులు) విలీనం చేయనున్నారు.

హిందూ యువవాహిని కార్యకర్తల దాడి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బగ్‌పట్ కోర్టు ప్రాంగణంలో లవ్‌జిహద్ ఆరోపణలతో ముగ్గురు వ్యక్తులపై హిందూ యువవాహిని కార్యకర్తలు దాడి చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన ప్రేమికులు, మరో ఇద్దరు బగ్‌పట్ ప్రేమజంటకు బగ్‌పట్ కోర్టులో వివాహం జరిపించుటకు వారితో పాటు మరో ఇద్దరు పురుషులు వచ్చారు. వీరు కులాంతర వివాహం చేసుకుంటున్నారన్న ఆరోపణలతో హిందూ యువవాహిని కార్యకర్తలు న్యాయవాది ఛాంబర్‌లోనే దాడికి దిగారు. వారిని తీవ్రంగా కొట్టారు. ఆమెను తీసుకెళ్లి మతం మార్చుకోవాలని జిల్లా అధ్యక్షురాలు దుర్గవాహిని ఒత్తిడి చేశారన్నారు.

'బీఫ్ వ్యాపారం చేయలేం'

పనాజి (గోవా) : గోవాలో బీఫ్ వ్యాపారస్తులు ఇక తాము వ్యాపారాలు నిర్వహించలేమంటూ వాపోతున్నారు. కర్ణాటకలోని బెల్గాం నుంచి గోవాకు మాంసాన్ని తెచ్చుకొనే సందర్భంలో వేధింపులు ఎదుర్కోవలసి వస్తోందని వారు పేర్కొంటున్నారు. కర్ణాటక నుంచి బీఫ్ సరఫరా తగ్గిపోవడంతో వారికి ఈ పరిస్థితి ఎదురైనట్లు చెబుతున్నారు. కర్ణాటక నుంచి బీఫ్ సరఫరాను పునరుద్ధరించుకున్నప్పటికీ చాలా పరిమితంగానే సరఫరా జరుగుతున్నదని వారు చెబుతున్నారు. కర్ణాటక నుంచి దున్నపోతు మాంసాన్ని గోవాకు ఇన్సులేటెడ్ ఫ్రీజర్ వాన్‌లో దిగుమతి చేసుకుంటున్నామని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు.

పెండ్లి కార్డుపై పశ్చాత్తాపం

- మధ్యప్రదేశ్‌లోని బీజేపీ సర్కారుపై వ్యతిరేక నిరసన
- మా తప్పిదం..కమల వికాసం (హమారీ భూల్..కమల్ కా ఫూల్)
- మధ్యప్రదేశ్‌లో ఓ పేదకుటుంబం ఆగ్రహం




భోపాల్: మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో ఓ పేద కుటుంబం బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.తమ కుమార్తె పెండ్లి కార్డుపై మా తప్పిదం..కమల వికాసం (హమారీ భూల్..కమల్ కా ఫూల్) అంటూ ప్రింట్ చేసి వైవిధ్యంగా నిరసన తెలుపుతోంది.గతంలో ఈ విధంగా గుజరాత్ వ్యాపారులు కూడా బీజేపీ పాలకులకు వ్యతిరేకంగా నినదించారు. తాజాగా మధ్యప్రదేశ్‌లోనూ అలాంటి నిరసన కనిపించింది.ఫిబ్రవరి ఆరున రాజేంద్ర కుమార్తె రాగిణికి పెండ్లి ఖరారు చేశారు. పెండ్లికి అవసరమైన నగదు,ఇతరత్రా వాటికోసం ఉన్న కొద్దిపాటి పొలాన్ని తాకట్టు పెట్టాల్సి వచ్చింది. దీనికి గల కారణం ఏమిటంటే..వారి కుమారుడు అనురాగ్ జైన్ 2010 నుంచి ఆరోగ్యశాఖలో కాంట్రాక్టుపై పనిచేస్తున్నాడు. అయితే అమాంతంగా అతనితో పాటు మరో 473 మంది ఉద్యోగులను తొలగించారు.ఏడేండ్ల నుంచి తన కుమారుడు కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తూ..తమకు అండగా ఉన్నాడనుకున్నాం.కానీ ఇపుడు అతనికి ఉద్యోగంపోయింది.ఏడాది నుంచి భోపాల్‌లో అధికారులను కలవటానికి తనయుడు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. అందువల్లే తాము శివరాజ్‌సింగ్ చౌహాన్ సర్కారుకు వ్యతిరేకంగా పెండ్లి కార్డుపై ఇలా ముద్రించినట్టు తెలిపారు.యువతకు ఉద్యోగాలిస్తామనంటూ..మరో వైపు వారిని ఉద్యోగాలనుంచి తొలగించటం ఎంతవరకు న్యాయమని తండ్రి రాజేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పెండ్లికార్డుపై రాజకీయం వేడెక్కింది.

నయీం కుడిభుజం శేషన్న కోసం వేట

- వీలైనంత త్వరగా పట్టుకోవాలని డీజీపీ ఆదేశాలు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి



గ్యాంగ్‌స్టర్ నయీమ్ కుడిభుజం శేషన్న, అతని గ్యాంగ్ కోసం రాష్ట్ర ఎస్ఐబీ పోలీసుల వేట సాగుతున్నది. వీలైనంత త్వరగా కరడుగట్టిన ఈ నేరస్తుడిని పట్టుకోవాలనే లక్ష్యంతో నిఘా విభాగంతో పాటు వివిధ జిల్లాల పోలీసులు సమన్వయంతో పని చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారని సమాచారం. రాష్ట్రంతో పాటు సరిహద్దు రాష్ట్రాలలో నేర సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని దాదాపుగా సమాంతర ప్రభుత్వాన్ని నడిపించిన నయీమ్ ఎలియాస్ నయీముద్దీన్ 2016 ఆగస్టు 8వ తేదీన షాద్‌నగర్‌లో ఎన్‌కౌంటర్ అయిన విషయం తెలిసిందే. ఈ ఘటన చోటు చేసుకున్నాక మరో నయీమ్ కుడిభుజంగా పేరుబడ్డ శేషన్న తన 30 మంది అనుచరులతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. నయీమ్ ఎంతటి కరడుగట్టిన నేరస్తుడో దాదాపు అదే స్థాయిలో వ్యవహారాలు నడిపించే శేషన్న జాడ పోలీసులకు సవాల్‌గా మారింది. నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగిగి 17 నెలలు దాటింది. కాని శేషన్నను ఈ కేసు దర్యాప్తు జరుపుతున్న స్పెషల్ ఇన్‌వెస్టిగేషన్ టీమ్(సిట్) కానీ , ఇటు హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ పోలీసులు కానీ పట్టుకోవడంలో విఫలమయ్యారనే ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. మరో వైపు గ్యాంగ్‌స్టర్ చనిపోవడంతో నయీమ్ బాధితులు ఎంతగా కుదుట పడ్డారో, అతని కుడిభుజం ఇంకా పట్టుబడక పోవడం పట్ల తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు. ఇప్పటికే జైలులో ఉన్న నయీమ్ మరో అనుచరుడు పాశం శ్రీను లోపలి నుంచే సెటిల్‌మెంట్లను నడిపించడం, నేరుగా ఫోన్‌లో మాట్లాడుతూ తమన మాట వినని వారికి వార్నింగ్‌లు ఇవ్వడం వంటి చర్యలు చోటు చేసుకున్నాయి.

దీంతో ఇటు జైలులో ఉన్నప్పటికి నయీమ్ గ్యాంగ్ ఆగడాలు సాగుతుండటం, ఇంకా శేషన్న కటకటాల వెనక్కి చేరక పోవడంతో బాధితులు కోర్టులో సాక్ష్యం చెప్పడానికి కూడా వెనుకంజ వేసే ప్రమాదం ఉంది. శేషన్న ను పట్టుకోవడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని పోలీసు ఉన్నతాధికారులు చెబుతుండగా, చోటా గ్యాంగ్‌స్టర్ నగర శివార్లలో కొందరి శుభకార్యాలకు హాజరయ్యాడని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నయీమ్ కు చెందిన దాదాపు 126 మంది గ్యాంగ్ సభ్యులు, ఇతర అనుచరులను సిట్ అరెస్టు చేసినప్పటికి శేషన్న దొరికేంత వరకు ఈ కేసు దర్యాప్తు కూడా పూర్తి కానట్టేననే అభిప్రాయం బాధితుల నుంచి వ్యక్తం అవుతున్నది. ఈ నేపథ్యంలో డీజీపీగా చార్జి తీసుకున్న తర్వాత మహేందర్‌రెడ్డి శేషన్నను త్వరలోనే పట్టుకుంటామని చేసిన ప్రకటనతో బాధితులకు కొంత స్వాంతన చేకూరినట్టు తెలుస్తోంది.

అలాగే శేషన్నను పట్టుకోవడానికి యాంటీ నక్సలైట్ నిఘా విభాగం ఎస్ఐబీకి ప్రత్యేకించి అసైన్‌మెంట్‌ను కూడా ఇచ్చారు. దీంతో రంగంలోకి దిగిన వేగులు శేషన్న కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారని తెలిసింది. ఇందుకు అన్ని జిల్లాల్లోని తమ ఇన్‌ఫార్మర్లను అలర్ట్ చేసిన అధికారులు మరో పక్క పక్క రాష్ట్రాల నిఘా విభాగాల సహకారాన్ని తీసుకుంటున్నారని తెలిసింది. మాజీ నక్సలైట్ అయిన శేషన్న కదలికలు, ఎత్తుగడల గురించి బాగా తెలిసిన నిఘా అధికారులతో పాటు పదవీ విరణ చేసిన మరి కొందరు అధికారులను కూడా ఈ వేటలో భాగం చేశారని తెలిసింది. ఇక ఎన్ని రోజుల్లో శేషన్న పట్టుబడతాడోనని బాధితులు, ఎదురు చస్తున్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్నది ఎవరు?



తోకల రాజేశం

ఆ.వె. కనక మృగము భువిని
కద్దు, లేదనకుండ
తరుణి విడిచిపోయే దాశరథియు
తెలివి లేనివాడు దేవుడెట్లాయెరా?

అని మధ్యయుగాల్లోనే ప్రజాకవి వేమన్న ప్రజలవైపు నుంచి సూటిగా ప్రశ్నించాడు. ఎంత దేవుడైతే మాత్రం ఆయనక్కూడా తెలివి ఉండాలని కోరుకోవటంలో తప్పులేదు కదా! అలాగే ప్రొఫెసర్లుగా పనిచేసిన వాళ్లకు కూడా ఇంగిత జ్ఞానం తెలివి ఉండాలని ఆశపడటంలో తప్పులేదను కుంటాను? 4 జనవరి 2018 నాటి ఒక దినపత్రికలో ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్ రాసిన "చరిత్రను వక్రీకరించింది ఎవరు?" అన్న వ్యాసం చదివిన పాఠకులకు ఈ కోరిక కలిగితే అది వాళ్ల తప్పు కాదు. భారతీయ జనతా పార్టీలోనో, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లోనో సభ్యత్వం కలిగిన అతి మామూలు కార్యకర్త మాట్లాడినంత పేలవంగా ఒకింత దుందుడుకుగా వీరావేశంగా రాసిన శివప్రసాద్‌కు చరిత్రకూ పుక్కిటి పురాణాలకూ మధ్య గల తేడా తెలిసినట్టు లేదు. ఆ తేడా తెలుసుకోవడం వల్ల వచ్చిన గందరగోళం వల్ల నష్టపోయేది ఆయనొక్కరే కాదు, పాఠకులు కూడా. "త్రేతాయుగం నుంచి నేటి వరకు గల ప్రపంచ చరిత్ర అష్టదశ పురాణాల్లో ఉంది" అని అనటాన్ని పదవ తరగతి చరిత్ర చదువుకున్న పిల్లవాడు కూడా ఒప్పుకోడు.

1 జనవరి 2018 నాడు కలకత్తాలో జరిగిన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సభ ప్రారంభోపన్యాసంలో దాని అధ్యక్షుడు కెఎం.పరిమళి మాట్లాడిన మాటలను అసత్యాలు అనే ఆరోపణ చేసి ఖండించడం పనిలోపనిగా తాననుకుంటున్న చరిత్రను వ్యాఖ్యానించడం ముదిగొండ వారు తన వ్యాసం ద్వారా పెట్టుకున్న లక్ష్యం. అయితే కెఎం.పరిమళి గారు మాట్లాడిన మాటలేవీ అసత్యం కాదు. ఆయన గురించీ చరిత్ర గురించీ ముదిగొండ వారు మాట్లాడిన మాటలే పచ్చి అబద్ధాలు.

విజ్ఞాన శాస్త్రాలు ఇంతగా అభివృద్ధి చెందిన ఈ కాలంలోనే కొన్ని చారిత్రక సంఘటనలను ధృవీకరించటానికి చరిత్రకారులు అష్టకష్టాలు పడుతుంటే చాలా పరిమిత జ్ఞానంతో అంతూపొంతులేని అభూతకల్పనలతో జుగుప్సాకరమైన శారీరక సంబంధాలతో నిండిఉన్న ప్రాచీన కాలపు అష్టదశ పురాణాల్లో ప్రపంచ చరిత్ర ఎలా ప్రతిఫలించిందో ముదిగొండ వారికొక్కరికే తెలియాలి. పోనీ పురాణాలు ఇక్కడే పుట్టాయి కాబట్టి వాటిలో భారతదేశ చరిత్ర ఉందని రాసినా అర్థం చేసుకోవచ్చు. ఏకంగా వాటిలో ప్రపంచ చరిత్రనే అవుతుంది. అప్పటి పురాణకర్తలు కండ్లు మూసుకొని ప్రపంచంలో జరుగుతున్నదంతా గ్రహించి పురాణాల్లో చరిత్రగా నిక్షిప్తం చేశారా? పుష్పక విమానలెక్కబోయి విదేశా ల చరిత్రనంతా తెలుసుకొని పురాణీకరించినట్టున్నారు పాపం. అంతకుమించిన మార్గమైతే వాళ్లకు ఆ కాలంలో లేదు. నడిచి ప్రపంచాన్ని మొత్తం చుట్టొచ్చినారనుకున్నా అది సాధ్యమయ్యే పనికాదు. సముద్రయానమేమో నిషిద్ధం. కానీ పురాణాల్లో మాత్రం వారు ప్రపంచ చరిత్రను మొత్తం నింపిపారేశారు. ఆ చరిత్ర ఏమిటో బయటపెట్టి ప్రపంచానికి మహోపకారం చేయాలని ముదిగొండ శివప్రసాద్ గారిని సవినయంగా వేడుకుంటున్నాను. 1 జనవరి 2018 నాడు కలకత్తాలో జరిగిన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సభ ప్రారంభోపన్యాసంలో దాని అధ్యక్షుడు కెఎం.పరిమళి మాట్లాడిన మాటలను అసత్యాలు అనే ఆరోపణ చేసి ఖండించడం పనిలోపనిగా తాననుకుంటున్న చరిత్రను వ్యాఖ్యానించడం ముదిగొండ వారు తన వ్యాసం ద్వారా పెట్టుకున్న లక్ష్యం. అయితే కెఎం.పరిమళి గారు మాట్లాడిన మాటలేవీ అసత్యం కాదు. ఆయన గురించీ చరిత్ర గురించీ ముదిగొండ వారు మాట్లాడిన మాటలే పచ్చి అబద్ధాలు. సొంత నిర్ధారణలు. మోడీ గారిమీద, బీజేపీ–ఆర్ఎస్ఎస్‌ల మీద ఈగవాలినా కత్తితో యుద్ధానికి దిగే బృందంలోని సభ్యుడైన ముదిగొండవారు ఢిల్లీ విశ్వవిద్యాలయంలో హిస్టరీ ప్రొఫెసర్‌గా పనిచేసిన పరిమళి గారికి చరిత్ర పాఠాలు బోధించే పనిని తలకెత్తుకున్నారు. పాపం తాను నమ్మేదంతా చరిత్రకాదని పుక్కిటి పురాణాలను చరిత్రగా అర్థం చేసుకోవడం తన అవగాహన లోపం అని మళ్లీ పరిమళి దగ్గర చదువుకున్న శిష్యుడికి శిష్యునిలాంటి వాడొచ్చి చెప్పాల్సిన పరిస్థితి ఎదురైంది గురువుగారికి.

క్రీ.శ.1521 సెప్టెంబర్‌లో మెక్సికోను క్రూసేడరు ఆక్రమించకముందు అక్కడ హిందూ దేవాలయాలు ఉండేవి. వాటిని స్పానిష్ క్రిష్టియన్లు ధ్వంసం చేశారు. మహ్మద్ ప్రవక్త పుట్టకముందు కాబా (మక్కా)లో విగ్రహారాధన ఉండేది. దానిని ప్రవక్త నిరోధించాడు. ప్రవక్త గారి పినతండ్రి శివభక్తుడు. ఆయన అయాత్ అనే పేరుతో శివస్తోత్రాలు రచించాడు. గ్రీసులో హిందూ సంస్కృతి ఉండేది. ఎథీనా అంటే దుర్గాదేవి. ఫాసిడాన్ అంటే పరమ శివుడు. ఇదిగో ఇట్లా నడుస్తుంది ముదిగొండ వారి ముద్దుల చరిత్ర. వాడెవడో ఉగ్రవాది ప్రపంచం మొత్తాన్ని ఒకే మతం కిందికి తీసుకొస్తానని శపథం చేసినట్టు ఈయన గారు విశ్వం మొత్తాన్ని హైందవీకరించే పనిలో ఉన్నట్టున్నారు. ఈయన గారి ఊహలకు చరిత్రతో సంబంధం లేదు. చరిత్రకు కాలవసింది అందమైన ఊహలు, అంతకు మించిన ఉద్వేగాలూ కాదు. ఆధారాలు కావాలి. ముదిగొండ వారి చరిత్రకు పురావస్తు శాఖల నుంచి కానీ, శిలాజాల సంస్థల నుంచి కానీ భారత, ప్రపంచ చరిత్ర పరిశోధనా మండళ్ల నుంచి కానీ ఏ విధమైన ఆధారాలూ లేవు. తన ఇంటి మీదికెక్కి ఈ ప్రపంచం మొత్తానికి నేనే రాజును అని అరిచేవాణ్ణి చూసి ప్రజలు నవ్వుకుంటారు. కానీ నువ్వే మా రాజువని నెత్తిమీద పెట్టుకోరు. ఇతర మతాల అస్తిత్వాలకు సొంత గుర్తింపుకు భంగం కల్గించే రీతిలో అవి కూడా హిందూ మతంలో లేదా సంస్కృతిలో భాగాలే అనే విధంగా చేసిన చారిత్రక వక్రీకరణలు హిందూ మతానికి ప్రజల్లో అదనంగా గౌరవం తెచ్చిపెట్టకపోగా ఉన్న గౌరవాన్ని తగ్గిస్తాయన్న కనీస అవగాహన కూడా మేధావులనుకునే వాళ్లకు లేకపోతే ఎలా? "బ్రిటిషు వారు కమ్యూనిస్టులు కలిసి రూపొందించిన దొంగ చరిత్రలు చదివి వాటిని కెఎం.పరిమళిలు పాఠాలు చెప్పి విద్యార్థుల మనస్సులో విషం నింపుతున్నారు" అని ఆరోపిస్తున్నారు శివప్రసాద్ గారు. తమ విశ్వాసాలకు అనుగుణంగా లేని చరిత్రలన్నీ ఈయన గారి దృష్టిలో దొంగ చరిత్రలు. కనీస చారిత్రకావగాహన ఉండి ఉన్నా ఆయనిలా మాట్లాడేవారు కాదు. చరిత్రలను ఎవరో ఒకరిద్దరు కలిసి రూపొందిస్తారని చరిత్రలో చాలా పరిమిత జ్ఞానం ఉన్న వాడు కూడా ఒప్పుకోడు. ఈ క్రమాన్నంతా వదిలేసి ఉనికిలో ఉన్న చరిత్రకు వ్యక్తిగత స్వార్థాలను ఆపాదించి నానాయాగి చేయడం చారిత్రక దృక్పథమనిపించుకోదు.

"నెహ్రూ రాజవంశంలో ఆరుగులు పాలకులు వచ్చారు. వారంతా తమ రాజకీయ అస్తిత్వం కోసం కమ్యూనిస్టులపై ఆధారపడ్డారు. అందుకు సామ్యవాదులు ఒక షరతు పెట్టారు. ఈ విధంగా రాజ్య పాలన మీరు చేసుకోండి. కళా సాంస్కృతిక విద్యారంగాలు మాకు స్వాధీనం చేయండి అని" అంటూ ఇంకో ఆరోపణ. ఇట్లాంటి షరతులు, ఒప్పందాలు ఎప్పుడు ఎక్కడ జరిగాయో ఆధారాలతో సహా బయటపెడితే శివప్రసాద్ గారు చరిత్రకు ఎంతో మేలు చేసినవారవుతారు. మొత్తానికి కాంగ్రెస్ వాళ్ల జోస్యం, సరే కమ్యూనిస్టు రాసిన అంటే మార్క్సిస్టు దృక్పథం గల రచయితలు రాసిన చరిత్రలను పక్కన పెడదామా? చదివి వాటి అసలు స్వరూప స్వభావాలను వివరిస్తూ స్పష్టమైన చారిత్రక దృక్పథంతో డా॥బాబా సాహెబ్ అంబేద్కర్ ఎన్నో రచనలు చేశాడు. ఆయన అటు కమ్యూనిస్టు కాదు. ఇటు కాంగ్రెస్ వాది కాదు. మరి ఆయన రాసిన చరిత్రలు కూడా హిందూమతంలోని పరస్పర విరుద్ధమైన విషయాల గురించి, వర్ణ, కుల వ్యవస్థలను, అవి పోషించిన దుర్మార్గాలను దానికి మతామోదం లభించటం గురించి బ్రాహ్మణీయ విష సంస్కృతి దేశాన్ని పట్టి పీడించటం గురించి వేదాల డొల్లతనం గురించీ, సప్రామాణిక చరిత్రలను రాశాడు. ఈ పనికిమాలిన వేదాల్లో ఉన్నవేమిటి? పవిత్రతాలేదు. ప్రశ్నాతీత్వమూ లేదు. తమ శత్రువుల నాశనం కోసం వారి ఆస్తులను దోచకొని వాటిని తమ అనుయాయులకు పంచుకోవడం కోసమూ కొండదేవతలను ప్రార్థించటం తప్ప మరేమీ లేని ఆ వేదాలను ప్రశ్నించే ధైర్యం ఎవ్వరికీ లేకపోయింది. బ్రాహ్మణులు ప్రచారం చేసి అందరి మెదళ్లలోకి చొప్పించిన ఈ అర్థరహిత భావాల హిందూమతంలో చిక్కుముడులు (పుట.9) అన్న గ్రంథం ఉపోద్ఘాతంలో పేర్కొన్నాడు. దీనికి ముదిగొండలాంటి వాళ్ల సమాధానమేమిటో? మన వ్యక్తిగత ఇష్టాఇష్టాలకు అనుగుణంగా చరిత్ర నడవదు. అట్లాంటి చరిత్రలు రాసినా నిలబడవు. ఎందుకంటే వాటికి ఆధారాలుండవు కాబట్టి. లేదు లేదు మా దగ్గర ఆధారాల్లేవు కానీ అది మా నమ్మకం. మత విశ్వాసం. చరిత్ర మొత్తం మా తాటాకుల్లోనే ఉంది అని అరిచేవాళ్లంతా సాధించగలిగిందేమీ లేదు.

సెల్ : 9676761415

సవరణ : ఈనెల 11వ తేదీన ప్రచురితమైన వేదిక పేజీలో "కాబోయే ముఖ్య కార్యదర్శి ఎవరు?" అనే వ్యాస రచయిత చిరిపోతుల శ్రీనివాస్‌కు బదులు మహ్మద్ రఫీయొద్దీన్ అని గమనించగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం.

కవిత్వంతో సమాజాన్ని కడిగేసిన అలిశెట్టి ప్రభాకర్



ఉషాశ్రీ తాల్క

సాహసం అనే నిప్పుల మీద కాలాన్ని ఫలంగా వండేందుకు నెత్తుటి ఊటేతో ఊపిరి తీసుకుంటుంది. కష్టాలనే సిరాగా నింపుకునే కలంగా మారి పీడితుడే అణ్వస్త్రంగా, కన్నీళ్లకు కర్తవ్యాన్ని నిర్దేశిస్తుంది. దోపిడీ దారుల గుండెల్లో అగ్నిని రగిల్చిన కవి అలిశెట్టి ప్రభాకర్. పూర్వపు కరీంనగర్ జిల్లా నేటి జగిత్యాల జిల్లాలోని జగిత్యాల ప్రభాకర్ జన్మస్థలం. 12-1-1954న జన్మించారు. చినరాజం, లక్ష్మి వీరి తల్లిదండ్రులు. అలిశెట్టి గారికి ఏడుగురు అక్క చెల్లెల్లు, ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. కరీంనగర్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేసి ఇంటర్ విద్యను సిద్దిపేటలో చదివారు. అలిశెట్టి గారి తండ్రి తన చిన్నతనంలోనే మరణించడం వల్ల కుటుంబ పోషణ బాధ్యతలు స్వీకరించాడు. తన ఆదర్శాలకు అనుగుణంగా ఒక పేదింటి అమ్మాయి అయిన భాగ్యంను వివాహం చేసుకున్నాడు. మొదట చిత్రకారుడిగా పెన్సిల్‌తో బొమ్మలు గీసి తన జీవితాన్ని ప్రారంభించాడు. పత్రికలకు పండుగల, ప్రకృతి దృశ్యాల, సినీ నటుల బొమ్మలను వేశాడు. తరువాత జగిత్యాలలో సాహితీ మిత్ర దీప్తి అనే సంస్థ పరిచయంతో కవిత్వ రంగంలోకి అడుగుపెట్టారు. 1974లో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో వచ్చిన పరిష్కారం అచ్చయిన ఆయన మొదటి కవిత. జీవిక కోసం ఫోటోగ్రాఫర్‌గా, జీవిత పోరాటంలో కవిగా ఎదిగాడు. 1978వ సంవత్సరంలో జగిత్యాలలో "జగిత్యాల జైత్రయాత్ర" అనే పేరుతో పెత్తందారీ వ్యవస్థ మీద పేదోళ్లు జరుపుతున్న పోరుతో ప్రభాకర్‌లోని అక్షరసూరీడు కొత్త దిక్కున ఉదయించాడు. అందుకే జైత్రయాత్రలో ప్రజల ఉరకలెత్తే ఉత్సాహాన్ని చూసి తనలోని ఆవేశాన్ని "ఎర్ర పావురాలు" గా ఎగరవేశాడు. ఇది 1978లో వచ్చిన అలిశెటిట గారి మొదటి కవితా సంకలనం. అప్పటి నుంచి కవిగా ముందుకు సాగాడు. ఎప్పుడూ వెనుదిరిగి చూడలేదు. అల్ప అక్షరాలతోనే అనల్పార్థాలనిచ్చే నానీలను మినీ కవిత్వంతో తెలుగు సాహిత్యంలో అలజడి సృష్టించాడు.

చీకట్లో జడుసుకుంటే
ఒక చెట్టే నీ చుట్టూరా
అరణ్యమై భయపెడుతుంది
గుండెంటూ కలిగుంటే నీ వెంటే
అదే పెద్ద సైన్యంలా నిలుస్తుంది

అని అటాండు. 1981లో "చురకలు" అనే కవితా సంకలనంలో పీడితుల పక్షాన తన అక్షర బాణాన్ని సంధించాడు. వ్యంగ్యం, పదును విమర్శ, సామాజిక స్పృహలాంటివి అన్నీ కలిపి ఒక చురకలో చూపించాడు. ఇందులో "అన్యాయానికి ఏకీలుకాకీలు విరగొట్టగల వాడే వకీలు" అని న్యాయవాదులకు ఒక చురక అలాగే

వాడు ముందే వానపాము
వాడి ముడ్డెటో మూతెటో

అని రాజకీయ నాయకులకు ఒక చురక అంటించాడు. 1982లో తన భార్యాపిల్లలతో హైదరాబాద్‌కు మకాం మార్చాడు. అప్పుడు ఆయన సిటీలైఫ్ అనే కవితా సంకలనాన్ని రచించాడు. అందులో

నగారా మోగిందా
నయాగరా దుమికిందా
నాలుగు రోడ్ల కూడలిలో ఏమది?
అదే నగరారణ్య హోరు
నరుడి జీవన ఘోష
తల్లి బడి వంటి పల్లె సీమల్నొదిలి
తరలి వచ్చిన పేద రైతులూ
ఇవపెట్టే లాంటి ఈ పట్టణాల్లో
ఊపిరాడని మీ బతుకులూ

సిటీ అంటే బ్యూటీ కాదు బిల్డింగ్‌లు కాదు
అటు భవంతులూ ఇటు పూరిండ్లు
దారిద్ర్యం, సౌభాగ్యం సమాంతర రేఖలు!!
ఇది వెరైటీ మనుష్యుల సమస్యల
సమ్మేళన కోలాహలం

అని అలిశెట్టి చెప్పారు. ఇక సెక్స్ వర్కర్ల గరించి వారి దయనీయ స్థితి గురించి ప్రపంచానికి చాటాడు.

తనువు శవమై ఒకరికి వశమై
తనువు పుండై ఒకడికి పండై
ఎప్పుడూ ఎడారై ఎందరికో ఒయాసిసై

అని వారి గురించి చెప్పాడు. ఇక అలిశెట్టి రాజకీయాలన్నా, నాయకులన్నా మొదటి నుంచి తీవ్ర వ్యతిరేకత. వారిని గురించి అలిశెట్టి

ఓ నక్క ప్రమాణ స్వీకారం చేసిందట
ఇంకెవర్నీ మోసగించనని
ఒక పులి పశ్చాత్తాపం ప్రకటించిందట
తోటి జంతువుల్ని సంహరించనని
ఈ కట్టుకథ విని గొర్రెలింకా పుర్రెలూపుతూనే ఉన్నాయ్

అని రాజకీయ నాయకుల తీరును తన కవితలో ఏకిపారేశాడు. 1985లో ఆయన రక్తరేఖ అనే కవితా సంకలనం విడుదల చేశాడు. ఆ కవితా చిత్రాలను చూసి ఎందరో ఎగబడి మరీ కొనుక్కున్నారు. 4వేల కాపీలు అమ్ముడుపోయి ఇప్పటికీ ఓ రికార్డుగా మిగిలిపోయింది. ఈ సమయంలోనే ఆయనను క్షయ వ్యాధి చుట్టుముట్టింది. అయినా ఆయన కవిత రాయడం ఆపలేదు. 1990లో సంక్షోభ గీతంలో దేశంలోని సంక్షోభాన్ని అద్భుతంగా చిత్రించాడు, చెప్పాడు. అందులో

పాలరాతి బొమ్మైనా
పార్లమెంట్ భవనమైనా
వాడు చుడితేనే శ్రీకారం
వాడు కడితేనే ఆకారం

అని శ్రామికుల్ని కీర్తించాడు. ఇంకా అలిశెట్టి ఇతర రచనలు 'మంటల జెండాలు' 'ఎన్నికల ఎండమావి' ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ఆరేండ్లుగా సీరియల్‌గా 'సిటీలైఫ్' పేరుతో హైదరాబాద్ నగరంపై రాసిన మినీ కవితలతో ప్రఖ్యాతి పొందారు. "మరణం నా చివరి చరణం కాదు" అని ప్రభాకర్ తనని కబలించే మృత్యువును ముందే గుర్తించి ఒక వ్యక్తిగత కవితను రచించాడు. అది

"తెరవెనుక లీలగా మృత్యువు కదలాడినట్టు
తెరలు తెరలుగా దగ్గొస్తుంది..
తెగిన తీగను సవరించడానికన్నట్టు
గబగబా పరుగెత్తుకొచ్చి నా భాగ్యం
గ్లాసెడు నీళ్లిస్తుంద"ని రాసుకున్నాడు.

చివరి రోజుల్లో పేదరికంతో పోరాటం చేసే రోజుల్లోనూ ఆయన దారితప్పలేదు. ఆయన రాసిన కవితా సంకలనాలను సినిమాలకు అమ్ముకునే అవకాశం వచ్చినా ఆయన ఒప్పుకోలేదు. సినిమా కవిగా మారుంటే ఎంతో పేరు ప్రఖ్యాతులు వచ్చేవి. కానీ సమాజం కోసం రాస్తాననే మాటకు కట్టుబడి ఉన్నారు. ఫలితంగా క్షయకు చికిత్స చేయించడానికి డబ్బులు లేక 12.1.1993న హైదరాబాద్‌లో కన్నుమూశారు. మృత్యువు దాడి చేసిన రోజు కూడా అక్షరాలకు జీవం పోశాడు. అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం, ఫొటోగ్రఫీ వంటి రంగాల్లో అసమాన ప్రతిభను కనబరిచిన సృజనశీలి. జీవిక కోసం తప్ప సంపాదన కోసం ఆరాటపడని గొప్ప వ్యక్తి. తన కవిత్వంతో పాఠకుల్లో ఆలోచనా దృక్పథాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంపొందించిన కవి. పీడితుల కోసం వారికి అండగా నిలిచి వారి గుండెల్లో స్థానం కలిగిన మహాకవి అలిశెట్టి. 40 ఏండ్ల స్వల్ప వయసులోనే ఆయన కన్నుమూశారు. అందుకే ఆయనను కడసారిగా చూసేందుకు సగం హైదరాబాద్ ప్రభాకర్ ఇంటిముందు నిలిచారు. ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు.

సెల్ : 9949914485

కవులు కుల సమూహాల్లోనా.. కల్లోల సమయంలో సమైక్యతలోనా?



కపిల రామ్‌కుమార్

ఇప్పుడొస్తున్న కవిత్వాన్ని తీక్షణంగా పరిశీలిస్తే కొంత అధ్యయన లోపం కొట్టొచ్చినట్టు కనపడుతోంది. శిల్పంలోనూ, అంశంలోనూ, రూపంలోనూ సమకాలీన సమాజ విశ్లేషణతో స్పందించే విధానంలోనూ, ఎవరి ధోరణి వారిదే. రచనా వ్యాసంగా సరదాగా కాకుండా నిబద్ధత, నిమగ్నతతో సజన చేయవలసిన అవసరం, అగత్యం అనివార్యంగా వుంది ఇప్పటి పరిస్థితులను సరిగా బేరీజు వేసుకుంటే. భావ కవిత్వ దశనుండి అభ్యుదయ మార్గం పట్టిన దశలో వచ్చిన పరిణామ దశలను, ఆయా కవుల శైలి, సమాజం పట్ల వారి ధక్కోణాన్ని అవలోకనం చేయడంలో నేటి కవులు ఎందుకు విస్మరిస్తున్నారో తెలియదు. అప్పటి సాహిత్యంలోవున్న సాంద్రత, సూటితనం కొంత కొరవడినా మంచి కవితలు వస్తున్నాయనడంలో సందేహంలేదు కానీ ఇంకా రావలసివుంది. కవిత్వం ఎవరి ప్రయోజనలకు ఉపయోగపడుతున్నది, ఎవరి గురించి రాస్తున్నావు, సర్వజనీయత వున్నదా లేదా, ప్రజల పక్షమా, పాలకవర్గ బోయీలమా అనే ఊగిసలాట నుండి స్థిరమైన బాటలో రచనలు రావాలి. కులాధిక్యత , మతోన్మాదం, ఉగ్రవాదం చాపకింద నీరులా నరనరాల్లో జీర్ణించుకున్న తరం నుండి కవిత్వం బయటపడి సంకెళ్లను తెగకొట్టుకుని, ముందుకు వస్తున్న తరుణంలో ఇంకా కొంత వెనుకబాటుతనం వదిలించుకోవలసి వుందనేది అతిశయోక్తి కాదు. అనివార్యంగా గత కాలపు సామాజిక వైరుధ్యాలను పెంచి పోషించిన, ధర్మ శాస్త్రాల పేరనో, కొన్ని సూత్రాల పేరనో సంస్కతుల పేరనో, కల్పిత కావ్యాల ఝరిలోంచి, తడిలోంచి, పుక్కిటిపురాణాల కబంధ హస్తాల పరిష్వంగంలోంచి భాషని, పడికట్టు పదాలని విడిపించి, ఆ కల్మషాలను కడిగి, ఎండగట్టే విధంగాను, మూలాలతో సహా రూపుమాపే దిశగా ఆ భావాల వ్యాప్తిని సహేతుకంగా ఎదుర్కొనగలిగే సత్తా పొందేందుకు అధ్యయనం ఎంతో అవసరం. సహేతుకమైన రచనా పటిమ అలవడాలనేది నిర్వివాదాంశం. గురజాడ, త్రిపురనేని, కొడవటిగంటి, శ్రీశ్రీ, ఆరుద్ర, ఉన్నవ, అడివి బాపిరాజు, జాషువా, గరిమెళ్ల, మంగిపూడి భరతశర్మ, కుసుమ ధర్మన్న, తాపి ధర్మారావు, రాహుల్ సాంకత్యాయన్ లాంటివారెందరో ఒక కొత్త బాట అందించారు. అలాగే రాజా రామ్మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర, విద్యాసాగర్, పెరియార్ రామస్వామి, సుబ్రహ్మణ్య భారతి వారి రచనలను ఔపోసాన పట్టడం ద్వారా సమాజంలో ఇంకా జడలు విప్పిగంతులేస్తూ అమాయక జనాలపై పడుతున్న మూఢ నమ్మకాలపై కవులు కలం ఆయుధంగా వాడాల్సిందే, కులాల మధ్య తుంపులాటలు కాకుండ, ఆధిపత్యకులాల అణిచివేతపై (చుండూరు, కంచికచర్ల, గంగవరం ఉదంతాలు) మననం చేసుకోవాలి. అన్యాయం, అత్యాచారం, పరువు హత్యలు ఎవరు చేసినా అక్కడ కవిత్వం నిలబడాలి, ఖండించాలి. క్షేత్ర పర్యటన ద్వారా బాధితులకు ఊరట కలిగించి మీ వెనుక మేమున్నామని భరోసా ఇవ్వగలగాలి. ఇప్పటికే కొన్ని సంఘటనలకు కవులు స్పందించారు. పర్యటనలు జరిపి ప్రజల పక్షం వహించారు. నిర్ద్వంధ్వంగా కవులు స్పందించాలి. ఒక సంఘటనలో అందరు సమైక్యంగా స్పందిస్తే, మరొక సంఘటనలో పాక్షిక స్పందన కవులకు తగదు. సంఘటననే ముఖ్యంగా తీసుకున్ని కవులు తీవ్రంగా స్పందించాలి, అక్కడ వర్గ ప్రయోజనాల కంటే బాధితుల పక్షమే ప్రధానం కావాలి. ఒకప్పటి భూస్వామ్య వ్యవస్థ తాలూకు అవశేషాలు అప్పుడప్పుడు పడగవిప్పుతున్న తరుణలో ఉపేక్షించకూడదు. గ్రామాల్లోను చేతి వత్తులవారిపై ఇంకా పెత్తనం కొనసాగుతోంది. అణిచివేత, అత్యాచారాలు, సాంఘిక బహిష్కరణలు, జులుంలు పెచ్చరిల్లుతున్న సంఘటనలు రోజూ ఎక్కడో అక్కడ జారుతూనేవున్నాయి. పాలకవర్గాలు తమదైన తరహాలో స్పందిస్తున్నాయే తప్ప, న్యాయం జరగటంలేదు. అలాంటి సమయాల్లో కూడా కవులుగా స్పందించాల్సి వుంది.

కవులు కాలాన్ని, రాజ్యాన్ని, రాజకీయాలని శాసించే స్థాయిలో విజయం సాధించినా, అది ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన పరిణామాలు ఉదాహరించుకుని సంబరపడటం మాని, ఆ పోరాట ఫలితం ఎలా ప్రతిబింబిస్తున్నదో కవులు గమనించకపోతే, కేవలం ఉద్యమ కవులుగా మిగులుతారేమో, రాజకీయ నాయకులకు ఉపయోగపడతారేమో. పాలకవర్గానికి జూ హుజూర్ అంటారేమో. ఆ ఆలోచన వుండకపోతే మనం ప్రజా ద్రోహులమే. ఎన్నో రచనలు, పాటలు పాడారు. అప్పటి ప్రభుత్వాన్ని ఎండగట్టారు. కానీ ఒరిగిందేమిటి. అలాంటి వారిలో కొందరు మంది మాగధులయ్యారు. కొలువులు పొందారు. ధిక్కార స్వరం మౌనం వహించింది. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో కూడా మునపటి పరిస్థితులే కొనసాగుతున్నాయి.


"కవులేంచేస్తారంటే/ కలాలకు కళ్లిచ్చి, అక్షరాలకు ప్రాణమిచ్చి,/ సొంత గొంతుకనిచ్చి ఆవేశానికి ఆలోచనను దట్టించడమే" కవులు చేసే పని, అంతే కాదు" ఆచార సంప్రదాయాల పట్టు వస్త్రాల ముసుగులోని లొసుగులు తొలిగించి, జాతులనణగతొక్కే మంత్ర, తంత్ర కుతంత్రాలను మట్టుబెడతారు. స్వచ్ఛమైన నేత్రాలిచ్చి నిప్పులు కక్కే ధిక్కార స్వరమిచ్చి, కలాలను కలకాలమెగిరే నిత్యారుణ కేతనాలు చేస్తారు".

కవులు కాలాన్ని, రాజ్యాన్ని, రాజకీయాలని శాసించే స్థాయిలో విజయం సాధించినా, అది ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన పరిణామాలు ఉదాహరించుకుని సంబరపడటం మాని, ఆ పోరాట ఫలితం ఎలా ప్రతిబింబిస్తున్నదో కవులు గమనించకపోతే, కేవలం ఉద్యమ కవులుగా మిగులుతారేమో, రాజకీయ నాయకులకు ఉపయోగపడతారేమో. పాలకవర్గానికి జూ హుజూర్ అంటారేమో. ఆ ఆలోచన వుండకపోతే మనం ప్రజా ద్రోహులమే. ఎన్నో రచనలు, పాటలు పాడారు. అప్పటి ప్రభుత్వాన్ని ఎండగట్టారు. కానీ ఒరిగిందేమిటి. అలాంటి వారిలో కొందరు మంది మాగధులయ్యారు. కొలువులు పొందారు. ధిక్కార స్వరం మౌనం వహించింది. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో కూడా మునపటి పరిస్థితులే కొనసాగుతున్నాయి. ఇంకా నిర్బంధాలు, అణిచివేతలు పెరిగాయి. అది గ్రహించకపోతే ఎలా. అన్ని రంగాలలోను అసంతృప్తి నెలకొనివుంది. రైతుల నష్టపరిహార సమస్య, విద్యార్థుల విద్యా రుసుం ముదరాయించే సమస్య, నిత్యావసర వస్తువుల దుకాణాల సమస్య, రోజువారి కూలీల సమస్య వెక్కిరిస్తున్నా పట్టించుకోకుండా, అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు, ప్రజాధనం అనవసర హంగు ఆర్భాటాలకు పందేరం చేయటం ఇటీవలి కాలంలో ఎక్కువైంది. ఒక అగాధం ఏర్పడబోతోంది. ప్రజావసరాలను పక్కకు తోసి, కార్పొరేట్ వ్యవస్థలకు ధారాదత్తం చేస్తుంటే నిమ్మకునీరెత్తినట్టు కవులు కలాలు దూయకపోతే, జనాలకు తెలిసేదెట్లా... మందిరాలలో కాక, జన సమూహంలో కవులు తమ గొంతుక వినిపించాలి. కొత్త వొరవడి సష్టించాలి. జనం దగ్గరకే వారి సమస్యలపై తమ కవిత్వం వినిపించాలి, పాటలు పాడి, వీధినాటకాల ద్వారా చైతన్యం కలిగించాలి. నూటికి ఎనభై శాతంగా వున్న జనసమూహానికి ప్రతినిధులుగా కవులుండాలి. వారిని సమీకరించడంలో కవులు ప్రధాన ప్రతిపక్ష భూమిక నిర్వహించాలి. ఎందుకంటే కవులే అనధికార శాసన కర్తలు కాబట్టి. ఆ దిశగా మన మాట, పాట, బాట ఎల్లప్పుడూ ప్రజల తరపున సర్కారుపై ఎక్కుపెట్టిన బాణం కావాలి.

సర్కారు ఏదైన సాంస్కతిక విధానంతో ముందుకుపోతోందా లేక పలుకుబడిని పెంచుకో చూస్తోదా అనే కోణం పరిశీలించాలి. "మా తాతలు నేతులు తాగారు, కానీ మా మూతులు గుడుంబా వాసన వేస్తున్నాయి" అన్న చందంగా గాక సమరశీల ఉద్యమ ఘోష నిరంతరం వినిపించకపోతే సర్కారు ఆటలకు అడ్డు అదుపు వుండదని గ్రహించకపోతే ఎలా? మనం ప్రజల పక్షమే వహించాలి. లేకపోతే ప్రజా ద్రోహుల జాబితాలో చేరుతామనేది నిత్యం గుర్తెరిగి అప్రమత్తంగా వుండాలి. మనలో కొందరు కవులు, రచయితలు ఇవాళ కులాలుగా ప్రయాణం చేస్తూ కవితా సంకలనాలు వెలువరిస్తున్నారు. సంకలనాలను ఆహ్వానిద్దాం. సమూహాల పేరుతో కాక, సమిష్టి కవులు సమైక్య కషిగా మాత్రమే దానిని మార్చుచేదాం. విడిగా రచనలు చేస్తుంటే, విడగొట్టడం సర్కారుకు వెన్నతో పెట్టిన విద్యే అవుతుంది. అవకాశం మనమే ఇచ్చిన వాళ్లమవుతున్నామని తెలుసుకోకపోతే పోనుపోను మనలో మనకు వైరుధ్యాలు నెరపటం వారికి తేలిక. ఆ ధోరణిని వ్యతిరేకించాలి. మన సాహితీ ప్రయాణంలో ప్రధాన విరోధి ఎవరో వారిపై మన గళం విప్పటానికి సమైక్యం కాకపోతే, రానున్న ప్రమాదం నివారించడం కష్టమౌతుంది. మనందరిని బలహీనపరిచే ఎత్తుగడలు సర్కారు చేపడుతుంది. నూటికి ఎనభై పైగా వున్న ప్రజల వాణిని వినిపించడంలో మనం ఐక్యంగా లేకపోతే ఇలా? విశాల వేదికగా కవులందరు తమ గళాన్ని వినిపించాల్సిన అగత్యం ఇవాళ అనివార్యమని గ్రహించాలి. రాజ్యానికి వ్యతిరేకంగా కవుల గళం వినిపిస్తేనే కవిత్వానికి, ప్రజా కళలకు మనుగడ అనేది మరువకూడనిది. సర్కారు చేసిన వాగ్దానాలను అమలు జరిపించేలా ఒక పథకంద్వారా సమైక్య శంఖారావం కవిత్వం ద్వారా, ప్రజాకళల ద్వారా మనం వెలువరించాలి. ఆ దిశగా మనం ప్రయాణం చేయాలని కోరుకుందాం.

సెల్ : 9849535033

ప్రజాస్వామ్య పరాభవం



లంక పాపిరెడ్డి

మన దేశంలో ప్రజాస్వామ్యం మన దేశ మట్టిని తొలుచుకుని మొలకెత్తలేదని నియంతత్వమే తమ నైజమని టీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి రుజువు చేసింది. ప్రజాస్వామ్యం మన దేశపు భూస్వామ్యపు మట్టిలో పైనుండి నాటు వేయబడినది మాత్రమే. మన ప్రజాస్వామ్యం మన దేశ నియంతత్వపు కంపు కొంపకు వేసిన పైసున్నం మాత్రమే. ఇప్పుడు మన దేశంలోనైనా, తెలంగాణ రాష్ట్రంలోనైనా అన్నింటికంటే అత్యవసరంగా మారిన విషయాలు ఏమైనా ఉన్నాయంటే అవి ప్రజాస్వా మిక హక్కులే. ప్రజాస్వామిక హక్కులు లేకుండా ఎవరూ తమ న్యాయ బద్ధమైన ఏ ప్రయోజనాలను సాధించుకోలేరు. ఎవరు ప్రశ్నించినా విమర్శించినా వారి పైన అన్ని ప్రభుత్వ సంస్థలను ప్రయోగించి వేధిస్తు న్నారు. అరెస్టులు చేయిస్తున్నారు. తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి, ప్రతిప క్షాలను లేకుండా చేయడానికి కావలసినంత కషి చేసింది. టీఆర్ఎస్ మొదటి నుండి జేఏసీ అంటే ఎక్కువ భయపడుతూ వస్తున్నది. తెలం గాణ రాష్ట్ర ఉద్యమంలో కీలకమైన పాత్ర పోషించిన జేఏసీకి తెలంగాణ ప్రజల హదయాలలో బలమైన స్థానం ఉంది. అందుకే జేఏసీ అస్తిత్వాన్నే అంతం చేయడానికి టీఆర్ఎస్ ఎన్నో కుతంత్రాలకు పాల్పడింది. తమ అంతేవాసులతో రాజీనామాల డ్రామాలు ఆడించి, జేఏసీ అంతమైం దంటూ ప్రచారం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, ఇక జేఏసీ అవసరం లేదంటూ అవకాశవాద సిద్ధాంతాలు వల్లించారు. ఎన్ని కుట్రలు చేసినా జేఏసీ అంతం కాలేదు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు అర్థమవుతున్న కొద్దీ, తెలంగాణ ప్రజలలో జేఏసీ పోరాట పిలుపులకు మద్దతు పెరుగుతూ వస్తున్నది. ఈ క్రమం లోనే జేఏసీ పైన టీఆర్ఎస్ ప్రభుత్వపు నిర్బంధం, కక్షసాధింపు చర్యలు పెరుగుతూ వస్తున్నాయి. మల్లన్న సాగర్ మొదలు అన్ని ప్రాజెక్టులలోని అసంబద్ధతను ప్రశ్నిస్తే, ప్రశ్నలకు జవాబు ఇవ్వకుండా, జేఏసీ రైతులకు సాగునీరు ఇవ్వకుండా అడ్డుపడుతున్నదని అబద్ధాలు ప్రచారం చేశారు. మిషన్ భగీరథ ఖర్చు అంచనాలను ప్రశ్నిస్తే, తాగునీరు ఇవ్వకుండా అ డ్డుకుంటున్నారని ప్రచారం చేశారు. చత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో అవకతవకలు ఉన్నాయనీ, తెలంగా ణకు నష్టమని ఎత్తి చూపినందుకు విద్యుత్‌రంగ జేఏసీ నాయకులపైన కక్షసాధింపు చర్యలకు దిగింది టీఆర్ఎస్ ప్రభుత్వం. జేఏసీ ఏ కార్య క్రమం తలపెట్టినా, రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను తుంగలో తొక్కు తూ అనుమతిని నిరాకరిస్తున్నది. తెలంగాణ అమరుల స్ఫూర్తి యాత్రల కు కూడా టీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డంకులు కల్పించింది. అరెస్టులు చేసింది. తెలంగాణ విద్యావంతుల వేదిక మహాసభలకు కూడా ఆటం కాలు కల్పించింది. తెలంగాణలో ఏ ప్రజాసంఘం కూడా స్వేచ్ఛగా సభ లు, సమావేశాలు జరుపుకోలేని పరిస్థితులను టీఆర్ఎస్ ప్రభుత్వం సృష్టించింది. చివరికి కుటుంబ సభ్యులు చనిపోయినా తమ కుటుంబ స భ్యున్ని స్మరించుకోలేని పరిస్థితి దాపురించింది. డిసెంబర్ 4న నిరు ద్యోగుల సమస్యలపై జేఏసీ తలపెట్టిన కొలువుల కొట్లాట సభకు టీఆర్ ఎస్ ప్రభుత్వం అడ్డంకులు కల్పించి హక్కులు కాలరాసివేతలో అగ్ర స్థా నానికి చేరుకున్నది. నిరుద్యోగుల సమస్యలపై సభ పెట్టుకుంటామని అనుమతి కోసం జేఏసీ నాయకులు 2017 ఫిబ్రవరి నుండి తిరిగినా అనుమతి ఇవ్వలేదు. చివరికి హైకోర్టుకు వెళ్తే డిసెంబర్ 4 సభ జరుపు కోవడానికి అనుమతి లభించింది. ఒక శాంతియుత సభకు అనుమతి లభించడానికి పది నెలల కాలం పట్టిందంటే తెలంగాణలో ప్రజాస్వా మ్యం పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. కాలాన్ని లాగదీయడం ద్వారా నిరుద్యోగులలో ఇక ఏమి చేయలేమనే నిరాశ కలిగించి ఉద్యమించ కుండా చేయాలని చూసింది టీఆర్ఎస్ ప్రభుత్వం. కానీ జేఏసీ పట్టు వదలకుండా చట్టబద్ధంగా కోర్టు ద్వారా అనుమతి సాధించింది. అయితేనేం నియంతల పాలనలో చట్టబద్ధ పాలన, చట్టాలు అన్నింటిని చెత్త బుట్టలోకి సులువుగా నెట్టేయవచ్చని, కోర్టు ఆదేశాలు ఏమి పని చేయవని టీఆర్ఎస్ ప్రభుత్వం నిరూపించింది. తెలంగాణ జిల్లాల నుండి పెద్ద ఎత్తున సభకు వస్తున్న ప్రజలను హైకోర్టు అనుమతి ఉన్నప్పటికీ పోలీసులు అరెస్టు చేశారు. ముందు సభ జరుపుకోకుండా అన్ని అడ్డంకులు కల్పించారు. మళ్లీ వారే జంకుబొంకు లేకుండా సభ విఫలమైందంటూ ప్రకటనలు ఇస్తున్నారు. ఇక టీఆర్ఎస్‌కు బాకాలు ఊదే దమ్మున్న పత్రికలు, ఇంటి పత్రికలు, ప్రజల స్పందన లేదంటూ, ఫ్లాప్ అంటూ గోబెల్స్ ప్రచారం చేశాయి. కానీ ప్రభుత్వం హైకోర్టు ఆదేశాన్ని ఉల్లంఘించడం నేరమని మాత్రం వీరికి గుర్తుకు రాలేదు. సభకు ముందు, తరువాత కూడా అధికార పార్టీ తన ప్రజాస్వామిక వ్యతిరేక నైజాన్ని బయట పెట్టుకుంది. ఆశ్చర్యం ఏమిటంటే, టీఆర్ఎస్ 2014 నాటి తన ఎన్నికల ప్రణాళికలో ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక పాలన గురించి గొప్పగా చెప్పుకున్నది. "హింసకు తావులేకుండా, ప్రజాస్వామిక పద్ధతుల్లో తమ తమ భావజాలాన్ని ప్రచారం చేసుకునే స్వేచ్ఛను గౌరవిస్తుంది. రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులను కాపాడడం ప్రజాస్వామిక విలువల పునాది మీద పరిపాలన సాగించడం ప్రభుత్వ విధి. రాజ్యాంగం ప్రసాదించిన పౌరహక్కులను అధికార వ్యవస్థతోపాటు ఎవరూ భంగం కలిగించే అవకాశం ఉండొద్దని టీఆర్ఎస్ భావిస్తోంది. భావప్రకటన స్వేచ్ఛ, రాజకీయ విశ్వాసాలను కలిగిఉండే హక్కును గౌరవిస్తుంది" (టీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళిక పేజి 30). "ప్రజాస్వామికమైన కార్య కలాపాలు ఎవరు చేపట్టినా వారికి ఎటువంటి అవరోధం లేని విధంగా వారి హక్కులు కాపాడే విధంగా పరిపాలన ఉంటుంది, ప్రజలు శాంతియుతంగా అహింసా మార్గంలో ఉద్యమించే హక్కు అమలయ్యే వాతావరణం నిర్మిస్తుంది" (అదే పుస్తకం పేజి 31)

ఈ గొప్ప మహా వాక్యాలన్ని టీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళికలోనివే. ఎన్నికల ప్రణాళికలో రాసిన విషయాలను టీఆర్ఎస్ నాయకత్వం అవసరం రీత్యానే మరిచిపోయింది. అందుకే ఎన్నికల ప్రణాళికలో పేర్కొనని మిషన్ భగీరథ పైన్నే కేంద్రీకరించింది. ఎన్నికల ప్రణాళికలో చెప్పనివి కూడా చేస్తున్నాము అంటే, చెప్పినవి చేయరని తెలంగాణ ప్రజలకు ముందు అర్థం కాలేదు. కానీ ఈ మూడున్నర సంవత్సరాల నిరంకుశ పాలన తరువాత ప్రజాస్వామ్యం గురించి చెప్పిన విషయాలు ఎందుకు అమలు కావడం లేదో, ఎవరి ప్రయోజనాలు అమలు కావడం లేదో అర్థం చేసుకుంటున్నారు. కలలుకన్న సుఖశాంతుల తెలంగాణ ఇంకా కలగానే మిగిలిపోయింది. తెలంగాణ రాష్ట్రం మాత్రమే ఏర్పడింది. తెలంగాణ కష్టాలన్ని అలాగే వెక్కిరిస్తున్నాయి. పండించే రైతు ఇంకా ఉరికొయ్యకు వేలాడుతూనే ఉన్నాడు. వినియోగదారుడు మండిపోతున్న ధరల మీద మాడిపోతూనే ఉన్నాడు. నిరుద్యోగులు ఎండమావులలో పరుగులు తీస్తూనే ఉన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు ఆశ నిరాశల మధ్య అంతం లేకుండా ఊగుతూనే ఉన్నారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు, హైదరాబాద్ నుండి వరంగల్ వరకు పారిశ్రామిక కారిడార్, ప్రతి జిల్లాకేంద్రంలో నిమ్స్ స్థాయి సూపర్ స్పెషాలిటి హాస్పిటల్, కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య లాంటి హామీలన్నీ అటక మీదనే కాపురం పెట్టాయి. సూర్యుడిలా ధగధగ మెరిసిపోతూ సమస్యలన్నింటినీ మార్చివేస్తూ , ప్రతి మూలకు వెలుతురు పంచుతూ తెలంగాణ ఉదయిస్తుంది అనుకుంటే, ఉదయంలోనే మాది ఇక ఉద్యమ పార్టీ కాదంటూ అవకాశవాద రాజకీయాలకు టీఆర్ఎస్ తెర లేపింది. తెలంగాణ వ్యతిరేకులందరినీ సాదరంగా "రాజకీయ పార్టీ"లోకి ఆహ్వానించింది. ఇప్పుడు టీఆర్ఎస్‌లో వీరిదే ఆధిపత్యం. అసలు ఉద్యమంలో పాల్గొన్న ఎందరో నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో అడుగున అనామకులుగా మిగిలిపోయారు. ఉద్యమ పార్టీ నుండి అవకాశవాద పార్టీగా మారిన టీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజల ప్రయోజనాలను నెరవేర్చే శక్తి లేకుండా పోయింది. కానీ టీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజల ధిక్కార స్వభావం గురించి బాగా తెలుసు. అందుకే తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి ప్రజలకు ఎటువంటి ప్రజాస్వామిక అవకాశం కూడా ఇవ్వడం లేదు ప్రభుత్వం. అయితే తెలంగాణ ప్రజలు రాచరిక నిజాం దగ్గరనుండి అసెంబ్లీ రాజుల వరకు చాలా మందిని చూశారు. ప్రజాస్వామిక హక్కులు పునరిద్ధరించబడకపోతే అందరు రాజులకు చూపించిన స్థలాన్నే ఈ రాజులకూ చూపిస్తారు.

సెల్ : 8500853792

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :


email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020. Ph:27665420,27673787,9490099077/78. Fax:040-27652228





షో

నేటి
యువతరం డాన్స్‌కు చాలా
ప్రయారిటీ ఇస్తోంది. అద్భుతమైన డాన్సర్లుగా
సత్తా చాటేందుకు శతవిధాలా కృషి చేస్తున్నారు.
వీరి ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయటంలో
ఇప్పటికే బుల్లితెర ప్రధాన భూమిక పోషిస్తోంది.
అలాగే డాన్స్ నేపథ్యంలో రూపొందిన ఎన్నో చిత్రాలు
వెండితెర ప్రేక్షకుల్ని సైతం మంత్రముగ్ధుల్ని చేశాయి.
ఆద్యంతం అబ్బురపరచే రీతిలో తెరకెక్కిన కొన్ని డాన్స్ బేస్డ్
చిత్రాలు ఊహించని రీతిలో వసూళ్ళని రాబట్టి
చరిత్ర సృష్టించాయి. అటువంటి కొన్ని
డాన్స్ ప్రధాన చిత్రాల గురించి ఈ వారం
అందిస్తున్న స్పెషల్ షో..

అబ్బురపరచే డాన్స్ నేపథ్య చిత్రాలు

























స్టెప్ అప్ సిరీస్

చెత్త డాన్స్‌తో సమస్యలు సృష్టించే ఒక స్ట్రీట్ డాన్సర్ కొరియోగ్రాఫర్‌గా ఎదిగిన తీరు నేపథ్యంలో దర్శకుడు అన్నే ఫ్లెచర్ 2006లో రూపొందించిన అమెరికన్ రొమాంటిక్ డాన్స్ చిత్రం **'స్టెప్ అప్'**. టైలర్ అనే వీధి డాన్సర్ తాగి మేరీల్యాండ్ ఆర్ట్స్ స్కూల్‌లో థియేటర్‌తోపాటు పలు వస్తువులను పగలగొట్టడంతో అతనికి 200 గంటలపాటు ఆ స్కూల్‌ను శుభ్రం చేసే శిక్ష వేస్తారు. ఈ క్రమంలో టైలర్ కారు తుడుస్తూ డాన్స్ చేస్తుంటాడు. అది గమనించిన నోరా క్లర్క్ అనే డాన్సర్ అతనిలో దాగున్న గొప్ప డాన్సర్‌ను వెలికితీయాలని శిక్షణ ఇప్పిస్తుంది. అలా టైలర్ అనతి కాలంలోనే గొప్ప కొరియోగ్రాఫర్‌గా ఎదుగుతాడు. ఒకానొక క్రమంలో నోరాని వదిలేసి వెళ్తాడు. ఆ టైమ్‌లో జరిగిన ఒక సంఘటనతో తిరిగి నోరాకు దగ్గరయ్యాడా..? మళ్ళీ రెబల్ డాన్సర్‌గా మారాడా? లేదా అనే ఆసక్తికర అంశాలతో తెరకెక్కిన చిత్రమే 'స్టెప్ అప్'. టైలర్ పాత్రలో చానింగ్ టాటుమ్, నోరా పాత్రలో జెన్నా దేవన్ నటించి మెప్పించారు. ముఖ్యంగా వీరిద్దరి మధ్య వచ్చే రొమాంటిక్ సన్నివేశాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా విశేష ఆదరణ పొంది, 11కోట్ల డాలర్లకుపైగా వసూళ్ళతో రికార్డు సృష్టించింది. అంతేకాదు పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులనూ సొంతం చేసుకుంది.

ఈ చిత్ర సిరీస్‌లో భాగంగా ఐదు సినిమాలు వచ్చాయి. విభిన్న నేపథ్యాలకు చెందిన ఇద్దరు డాన్సర్లుగా అత్యున్నత స్థాయికి ఎదిగిన నేపథ్యంతో **'స్టెప్ అప్ 2: ద స్ట్రీట్స్'** అనే చిత్రం వచ్చింది. జాన్ ఎం.చు దర్శకత్వంలో 2008లో విడుదలైన ఈ చిత్రం 15కోట్ల డాలర్లకు పైగా వసూలు చేసింది. ఇందులో బ్రయానా ఎవిగన్, రాబర్ట్ హోఫ్మన్ నటించి మెప్పించారు. 'స్టెప్ అప్' సిరీస్‌లో భాగంగా వచ్చిన మూడవ చిత్రం **'స్టెప్ అప్ 3డి'**. న్యూయార్క్ నగరంలో వీధి డాన్సర్లుగా ఉన్న ఒక గ్రూపు తమలోని టాలెంట్‌కు పదును పెట్టి ప్రపంచ పాపులర్ డాన్స్ టీమ్‌కు పోటీనివ్వడమనే ఇతివృత్తంతో తెరకెక్కిన ఈ చిత్రానికి కూడా జాన్ ఎం.చునే దర్శకత్వం వహించారు. ప్రధాన పాత్రల్లో ఆడమ్ సెవని, రిక్ మలంబ్రి, శర్నీ విన్సన్, అలీసన్ స్టోన్స్ నటించారు. 2010లో విడుదలైన ఈ సినిమా దాదాపు 16 కోట్ల డాలర్లు వసూలు చేసింది. ఈ సిరీస్‌లో భాగంగా వచ్చిన నాల్గవ చిత్రం **'స్టెప్ అప్ రివల్యూషన్'**ను ప్రొఫెషనల్ డాన్సర్లుగా ఎదగాలనుకున్న తమను అడ్డుకుంటున్న వ్యాపారవేత్తపై తిరగబడి, తమ లక్ష్యం కోసం డాన్స్ టీమ్ చేసే పోరాట నేపథ్యంలో దర్శకుడు స్కాట్ స్పీర్ రూపొందించారు. 2012లో వచ్చిన ఈ సినిమా విశేష ప్రేక్షకాదరణతోపాటు సుమారు 15కోట్ల డాలర్లు వసూలు చేసింది. ఇందులో ప్రధాన పాత్రల్లో నటించిన ర్యాన్ గుజ్మన్, కాథరిన్ మెక్ కార్మిక్, మిషా గాబ్రియెల్, క్లియోపాత్రా కోల్మన్‌ల డాన్స్ షో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తుంది. సీనియర్ డాన్సర్లు చాలా కాలం తర్వాత తిరిగి కలిసి మళ్ళీ తమ సత్తా చాటేందుకు చేసిన ప్రయత్నం నేపథ్యంలో **'స్టెప్ అప్: ఆల్ ఇన్'** చిత్రం రూపొందింది. 'స్టెప్ అప్' సిరీస్‌లో వచ్చిన ఐదవ చిత్రమిది. 2014లో విడుదలైన ఈ సినిమాను దర్శకుడు ట్రిష్ సై రూపొందించారు. విమర్శకుల ప్రశంసలందుకున్న ఈ చిత్రం సుమారు 9 కోట్ల డాలర్లు వసూలు చేసింది.

హనీ సిరీస్

ఒక అందమైన స్ట్రీట్ డాన్సర్ జాతీయ స్థాయి డాన్సర్‌గా ఎదగడమనే ఇతివృత్తంతో తెరకెక్కిన చిత్రమిది. 2003లో బిల్లి వూడ్రఫ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో హనీ డేనియల్స్ అనే 21 ఏళ్ళ అందమైన అమ్మాయి న్యూయార్క్‌లో బార్‌టెండర్‌గా, రికార్డ్ స్టోర్ క్లర్క్‌గా పనిచేస్తూనే డాన్స్ నేర్చుకుంటుంది. ఒక రోజు క్లబ్‌లో డాన్స్ రికార్డు చేస్తున్న క్రమంలో దర్శకుడు మైఖెల్‌తో పరిచయం ఏర్పడుతుంది. ఆ పరిచయంతో డాన్సర్ నుంచి కొరియోగ్రాఫర్‌గా మారుతుంది. జాతీయ స్థాయిలో రాణించే క్రమంలో తన మెంటర్ నుంచి లైంగిక వేధింపులు ఎదుర్కొంటుంది. అతని ఒత్తిళ్ళకు లొంగి లైంగికంగా సపోర్ట్ చేయడమా?, సినీ రంగం నుంచి వెళ్ళి పోవడమా? అనే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో తనే ప్రత్యేకంగా డాన్స్ స్కూల్‌ను ప్రారంభించే క్రమంలో ఆర్థికంగా, మానసికంగా అనేక సవాళ్ళను ఎదుర్కొని ఎలా నిలబడిందనేది చిత్ర కథాంశం. ఉర్రూతలూగించే డాన్స్‌తో ఈ చిత్రం విశేష ప్రేక్షకాదరణ పొందింది. ఇందులో హనీ పాత్రలో జెస్సికా ఆల్బా తనదైన నటనతో, డాన్సింగ్ స్టెప్పులతో మైమరపిస్తూనే కష్టకాలంలో మనోస్థైర్యంతో నిలబడే అమ్మాయిగా అదరగొట్టింది. ఈ చిత్రం ఆరుకోట్ల డాలర్లకుపైగా వసూలు చేసి కలెక్షన్లలోనూ సత్తాచాటింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'హనీ 2' చిత్రం కూడా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. బిల్లి వూడ్రఫ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈచిత్రంలో డాన్సర్‌గా ఎదగాలనుకునే యువతి మారియా ఇంట్లో ఆర్థిక పరిస్థితులను, బయటి వారి వేధింపులను ఎదుర్కొంటుంది. అదే సమయంలో స్టార్ డాన్సరైన ప్రత్యర్థితో గట్టి పోటీ నెలకొంటుంది. వాటన్నింటిని ఎదుర్కొని తను అనుకున్నది సాధించడానికి ఆమె చేసిన పోరాటమే ఈ చిత్ర కథాంశం. మరియా బెనెట్‌గా కాటెరినా గ్రాహం నటన అద్భుతం.

వన్ ఛాన్స్ టు డాన్స్

17 ఏండ్ల అమ్మాయి గొప్ప డాన్సర్‌గా రాణించేందుకు ఓ హై స్కూల్‌లో చేరుతుంది. ప్రొఫెషనల్ డాన్సర్‌గా ఎదిగేందుకు ప్రయత్నిస్తుంటుంది. ఈ క్రమంలో ఇద్దరబ్బాయిలతో ప్రేమలో పడుతుంది. అనంతరం ఆ అమ్మాయి ఎలాంటి సవాళ్ళను ఎదుర్కొంది?. తను పడిన ఇబ్బందులతో లక్ష్యాన్ని చేరుకుందా, లేదా అనేది సినిమా. ఓ టీనేజ్ అమ్మాయి సంఘర్షణను కళ్లకు కట్టినట్టు చూపించిందీ చిత్రం. ఆడమ్ డెయోయ్ దర్శకత్వం వహించారు. 2014లో విడుదలైన ఈ సినిమా మంచి విజయం సాధించింది. టీనేజ్ అమ్మాయిగా టెక్సీ గియోవాగ్నోలి తనదైన నటనతో మెప్పించింది.

బ్యాటిల్ ఆఫ్ ది ఇయర్

బి-బాయ్స్ డాన్స్ టీమ్ వరల్డ్‌లోనే ది బెస్ట్ టీమ్. కానీ 'బ్యాటిల్ ఆఫ్ ది ఇయర్ ట్రోఫీ'ని తిరిగి అమెరికాకు తీసుకురాలేకపోతారు. 15ఏండ్లుగా ఓడిపోతూనే ఉంటారు. ఈ క్రమంలో బాస్కెట్ బాల్ కోచ్ బ్లేక్‌ను తమ టీమ్‌ను గైడ్‌గా టీమ్ ప్రొడ్యూసర్ డంటా ఎంపిక చేసుకుంటాడు. కోచ్ బ్లేక్ 'డ్రీమ్ టీమ్' పేరుతో కొత్త టీమ్‌ను ఫామ్ చేసి కఠినంగా శిక్షణ ఇస్తాడు. అనేక రోజుల శ్రమ, ఎన్నో స్ట్రగుల్స్ అనంతరం వారిని ది బెస్ట్ టీమ్‌గా మారుస్తాడు. ఫైనల్‌గా ఫ్రాన్స్‌లో జరిగే ట్రోఫీలో బి-బాయ్స్ గెలుపొందారా, లేదా? అనేది ఉత్కంఠ భరితం, ఆసక్తికరం. బెన్సన్ లీ దర్శకత్వం వహించారు. 'ప్లానెట్ బి-బాయ్' అనే డాక్యుమెంటరీ ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. జోష్ హోల్లోవే, క్రిస్ బ్రౌన్, జోష్‌పెక్, లాజ్ అలోన్సో, కైట్ లాజ్ ప్రధాన పాత్రల్లో నటించారు. స్ఫూర్తివంతమైన డాన్సింగ్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా 2013లో విడుదలై మంచి ప్రశంసలందుకుంది.

బ్యాటిల్ ఫీల్డ్ అమెరికా

ఒక యువ వ్యాపారవేత్త కమ్యూనిటీ సర్వీస్ చేయాలని భావిస్తాడు. అందులో భాగంగా యోగ్యత లేని కుర్రాళ్ళని తీసుకుని ప్రొఫెషనల్ డాన్సర్స్‌గా తయారు చేయడమే ఈ చిత్ర కథాంశం. అండర్ గ్రౌండ్ డాన్స్ కాంపిటీషన్‌లో విజేతలుగా నిలిచేందుకు ఆ యువ వ్యాపారవేత్తతోపాటు తన టీమ్ ఫేస్ చేసిన అడ్డంకులకు ప్రతీకగా ఈ చిత్రాన్ని దర్శకుడు క్రిస్ స్టోక్స్ రూపొందించారు. 2012లో విడుదలైన ఈ చిత్రంలో వ్యాపారవేత్తగా మార్కస్ హూస్టన్, ఇతర పాత్రల్లో మేకియా కాక్స్, గారి ఆంటోని స్టర్గిస్, ట్రిస్టెన్ ఎం.కార్టర్, కిదా బర్న్స్, రస్సెల్ ఫెర్గుసన్ నటించి మెప్పించారు.

డిసెర్ట్ డాన్సర్


ఇరాన్‌కు చెందిన డాన్సర్, కొరియోగ్రాఫర్, డైరెక్టర్, యాక్టర్ అఫ్షీన్ ఘఫారియన్ జీవితాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించిన బయోగ్రాఫికల్ డాన్స్ బేస్డ్ చిత్రమిది. డాన్సర్‌గా ప్రావీణ్యం పొందిన అఫ్షీన్ డాన్స్ కంపెనీ ప్రారంభించేందుకు తన జీవితాన్నే రిస్క్‌లో పెడతాడు. కొంత మందితో కలిసి డాన్స్ టీమ్ ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తుంటాడు. కానీ అస్థిరమైన ప్రభుత్వం దాన్ని బ్యాన్ చేసేందుకు ప్రయత్నిస్తుంటుంది. దీంతో ప్రభుత్వంలో అఫ్షీన్ చేసే పోరాటమే ఈ చిత్రం. రిచర్డ్ రెయిమాండ్ దర్శకత్వంలో 2014లో విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలను సొంతం చేసుకుంది. అఫ్షీన్ పాత్ర రీసి రిట్చీ నటన ఆకట్టుకుంటుంది.


ఫూట్‌లూజ్

సిటీకి చెందిన రాక్ డాన్సర్ రెన్ మెక్ కార్మాక్ ఓ చిన్న పట్టణానికి వెళ్తాడు. అక్కడ రాక్ అండ్ రోల్ డాన్స్ నిషేధించబడి ఉంటుంది. దాన్నొక క్రిమినల్ యాక్టివిటీగా భావిస్తుంటారు. రెన్ అక్కడ క్రమ క్రమంగా ఓ డాన్సర్స్ టీమ్‌ను తయారు చేస్తాడు. రాక్ అండ్ రోల్ డాన్స్‌తో అక్కడి యువతతోపాటు జనాన్ని ఆకర్షిస్తుంటాడు. ఈ క్రమంలో ఓ అమ్మాయితో ప్రేమలో పడతాడు. అనంతరం చోటు చేసుకున్న ఆసక్తికర సన్నివేశాల సమాహారమే సినిమా ఇతివృత్తం. 1984లో అదే పేరుతో వచ్చిన చిత్రానికి రీమేక్. క్రెయిగ్ బ్రూవర్ దర్శకత్వంలో 2011లో విడుదలైన ఈ సినిమా 24 మిలియన్ డాలర్లతో తెరకెక్కి 64 మిలియన్ డాలర్లను రాబట్టింది. రెన్ మెక్ కార్మాక్‌గా కెన్నీ వోర్మల్డ్, గర్ల్‌ఫ్రెండ్‌గా జూలియన్నే హాఫ్ నటన ఆద్యంతం మెస్మరైజ్ చేస్తుంది.

గో ఫర్ ఇట్


కార్మెన్ తెలివైన యువతే కాదు మంచి హిప్‌హాప్ డాన్సర్ కూడా. ప్రొఫెషనల్ డాన్సర్ కావాలనేది తన కల. కానీ భయం కారణంగా డాన్స్ కాంపిటీషన్‌లో రాణించలేకపోతుంది. తనలోని భయాన్ని అధిగమించి బెస్ట్ డాన్సర్‌గా రాణించేందుకు కార్మెన్ పడిన సంఘర్షణే ఈ చిత్రం. మహిళా దర్శకురాలు కార్మెన్ మర్రోన్ తన అనుభవాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 2011లో విడుదలై మంచి విజయాన్ని సాధించింది. సెక్సువల్ కంటెంట్, హింస, డ్రగ్స్ వంటి అంశాల విషయాల్లో విమర్శలెదుర్కొంది. ఇందులో కార్మెన్ పాత్రలో ఐమీ గార్సికా నటించారు.





















కంప్యూటర్ పాస్‌బుక్‌లతో

కౌలు రైతులకు అన్యాయం

హక్కులు కోల్పోయిన వాస్తవ సాగుదారులు

- **అమలుకు నోచుకోని రక్షిత కౌలుదారుల చట్టం**




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్ట్రానిక్ కొత్త పాస్ పుస్తకాల విధానం వల్ల కౌలు రైతులకు ముప్పు వాటిల్లనుంది. ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం వల్ల వారికి పాస్ పుస్తకాలు వచ్చేపరిస్థితి లేదు. దీంతో ప్రభత్వం ద్వారా వచ్చే రాయితీలను కోల్పోనున్నారు. బ్యాంకు రుణాలు కూడా వచ్చే అవకాశం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 70లక్షల రైతు ఖాతాలున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం 2 కోట్ల ఎలక్ట్రానిక్ పాస్ పుస్తకాలు ముద్రించాలని రెవెన్యూ శాఖ అంచనాకు వచ్చింది. జనవరి మొదటి వారంలోనే పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని గతంలో చెప్పిన సీఎం మార్చి 11న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభిస్తామని శనివారం రెండోసారి చెప్పారు. రాష్ట్రంలో కోటి 63 లక్షల ఎకరాల భూమి కలిగి ఉంటే అందులో అందులో 52 లక్షల ఎకరాల భూమి బీడుగా మారింది. 1971లో భూమి హక్కులు, పట్టేదారు పాసు పుస్తకాల చట్టం వచ్చింది. ఈ చట్టం ప్రకారం పాస్ పుస్తకాలు జారీ చేసేవారు. కౌలుదారులకు, భూమి ఆక్రమించుకున్నవారికి, ప్రభుత్వం ఇనామ్ ఇచ్చిన భూములకు కూడా పాసు పుస్తకాలు జారీ చేసేవారు. కొత్త పాస్ పుస్తకాలు కూడా సులువుగా ఇచ్చేది. ఇందులో సర్వే నెంబర్లు, కలిగి ఉన్న హక్కులు, పట్టాదారు, వాస్తవ సాగుదారుడి పేరుతో సహా పొందుపర్చేవారు. ఏదైనా భూమి చట్టబద్ధంగా మార్పిడి జరిగితేనే పాస్ పుస్తకాల్లో మార్పు జరిగేది. నైజాం కాలంలో 'పావుతాబహిచే' పేరుతో పాస్ పుస్తకాలు ఇచ్చే విధానం ఉండేది. ఆ పుస్తకాల ఆధారంగానే రైతులు శిస్తు చెల్లించాల్సి వచ్చినపుడల్లా పట్వారీకి చూపించి చెల్లించేవారు. పట్టా మార్పిడి జరిగినప్పుడు కూడా అందులోనే పొందుపర్చేవారు. రెవెన్యూ అధికారులు ప్రతి సంవత్సరం సర్వే చేసే క్రమంలో భూమి మీద ఎవరుంటే వారి పేరు నమోదు చేసుకోవాలని చట్టంలోనే పొందుపర్చారు. అయినా అది క్షేత్రస్థాయిలో అమలుకాలేదు. ఇప్పుడు పూర్తిస్థాయిలో ఎత్తివేయడమే కాకుండా గత శాసన సభలో కౌలుదారు అనే పదాన్ని మినహాయించారు. దీంతో రాష్ట్రంలో ఉన్న 14 లక్షల మంది కౌలు రైతులు హక్కులు కోల్పోయారు. ల్యాండ్ రెవెన్యూ యాక్టు 91 ప్రకారం పాస్ పుస్తకాలు ఇవ్వాలి. 1951 సెక్షన్ 48 ప్రకారం రక్షిత కౌలుదారి హక్కులు కూడా కల్పించాల్సి ఉంది. సాగు చేసే వాళ్లకు గత నైజాం నుంచి తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన వరకు కౌలుదారులకు హక్కులు కల్పించారు. కానీ 2011లో పట్టేదారులు కౌలుదారుల పేరు రాయకుండా భయపడుతున్నారని కొత్త చట్టం తీసుకొచ్చారు. 2011లో కౌలు అనే పదం ఉపయోగించకుండా లైసెన్స్‌డ్ రైతులు అనే పేరు పెట్టారు. ప్రతి ఏటా ఏప్రిల్ నెలలో రెవెన్యూ అధికారులు గ్రామాల్లో బహిరంగ సభలు నిర్వహించి కౌలుదారుల పేర్లు నమోదు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. నిబంధన మేరకు ఒక రిజిస్టరులో నమోదు చేయాలి. ఈ కార్డుల వల్ల నాలుగు ప్రయోజనాలుండేవి. ఒకటి వ్యవసాయ పంట రుణాలు, రెండు బీమా సౌకర్యం, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడితే పరిహారం, నాలుగోది ప్రభుత్వ పథకాల్లో సబ్సిడీ పొందే అవకాశం ఉండేది. భూ యజమానికి వ్యతిరేకంగా గానీ, ఏదైనా సాక్ష్యం కింద కూడా కార్డు చెల్లదని నమోదు చేసి ఉంటుంది. 2011లోనూ కౌలుదారులను గుర్తించారు. పాస్ పుస్తకాల బదులు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్వయించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 46 లక్షల మంది కౌలు రైతులుంటే, ఇప్పుడు తెలంగాణలో 14 లక్షల మంది ఉన్నారని, ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. పెట్టుబ డి పథకంలో ఇవ్వబోయే ఎకరానికి రూ. 4 వేల చొపుపన ఈ లెక్కల ప్రకారమే 2017-18లో ఇవ్వాలి. కానీ 1971 చట్ట సవరణ ద్వారా కౌలుదారుల గుర్తింపు పోయింది. వ్యవసాయదారులు 54 లక్షల కమతాలు కలిగి ఉన్నారు. రైతులుగా పరిశీలించి చూస్తే 75 లక్షలున్నారు. వీళ్లందరికీ పాసు పుస్తకాలు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు.

ఆవుచుట్టూ బీజేపీ రాజకీయాలు

విరసం బహిరంగ సభలో వరవరరావు



నవతెలంగాణ-మహబూబ్‌నగర్

ఆవుచుట్టూ బీజేపీ రాజకీయాలను తిప్పుతున్నదని, దేశంలో పేట్రేగిపోతున్న హిందూ భావజాలాన్ని బద్దలు కొట్టాలని విరసం రాష్ట్ర నాయకులు వరవరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. విరసం రాష్ట్ర మహాసభల సందర్భంగా మహబూబ్‌నగర్‌లోని క్రౌన్‌గార్డన్‌లో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ...దేశంలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు గోడల మధ్య వ్యక్తిగతానికి పరిమితం కావాల్సిన మతం నేడు పాలక బీజేపీ రాజకీయం, అర్థిక అంశాలపై బలవంతంగా రుద్దుతున్నదని అవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా ఈ దేశంలో దళిత, గిరిజన, అదివాసీలను బానిసలుగా ఉంచుతున్నారన్నారు. వ్యాపారానికి మతం రంగును ఒక సాధనంగా వాడుకుంటున్నారని విమర్శించారు. సంస్కృతిపైనా హిందూ ఫాసిజాన్ని సినిమాల ద్వారా ప్రచారం చేస్తున్నారని వివరించారు. చిన్న వయస్సులోనే పిల్లలకు హిందూ జాతీయ భావజాలాన్ని పాఠ్యపుస్తకాల ద్వారా ఎక్కించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ప్రశ్నించేవారిపై చట్టాలను అడ్డుపెట్టుకుని పాలకులు దాడి చేస్తున్నారని వాపోయారు. మెజార్టీ హిందువులను ఓటు బ్యాంకు రాజకీయలకు వాడుకునేందుకు బీజేపీ మతాల మధ్య చిచ్చుపెడుతోందని విమర్శించారు. ఈ విషబీజం జాతీయోద్యమ కాలంలోనే పండిదన్నారు. తెలంగాణ ఉద్యమంలో నక్సలైట్లు కీలకపాత్ర పోషించారని తెలిపారు. పెట్టుబడిదారులు, భూస్వాములు కలిసీ పేదలపై దాడులు చేస్తుంటే ప్రశ్నించే వారు లేరన్నారు. విరసం రాష్ట్ర కార్యదర్శి పాణి అధ్యక్షతన జరిగిన ఈ సభలో వీరసాథేదార్, కళ్యాణరావు, తదితరులు మాట్లాడారు.

విరసం నూతన కమిటీ ఇదే...

విప్లవ రచయితల సంఘం(విరసం) నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర నూతన కార్యదర్శిగా పాణి, కార్యవర్గ సభ్యులుగా కాశిం, క్రాంతి, ఎ.కృష్ణ, జగన్, చిన్నయ్య, బాసింత్, వెంకన్న గీతాంజలి, ఉదయ్‌భానులను ఎన్నుకున్నారు.

సీట్‌బెల్ట్టా నామోషీనా!

న్యూఢిల్లీ: కార్లలో ప్రయాణిస్తున్నప్పుడు అనుకోని ప్రమాదాల నుంచి మనల్ని రక్షించే ఒక రక్షణ కవచం సీట్‌బెల్ట్. ఒక రకంగా చెప్పాలంటే మన ప్రాణాలను కాపాడే సైనికుని లాంటిది. కానీ... ఏమవుద్దిలే అన్న నిర్లక్ష్యం, అతి విశ్వాసం వల్ల చాలా మంది దానిని ధరించక ప్రాణాలు కోల్పోతున్నారు. గతేడాది అక్టోబర్‌లో చైనాలో ఓ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. బస్సు నడుపుతున్న డ్రైవర్ (సీట్‌బెల్ట్ ధరించాడు) ముందున్న బస్సును ఓవర్‌టేక్ చేయబోయాడు. అదుపు తప్పి బస్సు అక్కడే గింగిరాలు తిరిగింది. డ్రైవర్ మినహా బస్సులో ఉన్నవాళ్లందరికీ గాయాలయ్యాయి. ఈ వీడియోను భారత్‌లో చాలా మంది వీక్షించారు. అయినప్పటికీ సీట్‌బెల్ట్ ధరించడానికి విముఖత చూపిస్తున్నారు. వినడానికి కొంచెం వింతగా ఉన్నా.. సీట్‌బెల్ట్ ధరించడం ప్రాణాలు రక్షించుకోవడానికి చేసిన ఒక చట్టం లాంటిదేం కాదని కొంతమంది విద్యావంతులు అంటున్నారు. ఈ మధ్య ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ దేశంలోని 17 నగరాల్లో ఇదే అంశంపై సర్వే చేయగా విస్తుగొలిపే నిజాలు వెలువడ్డాయి. కేవలం 25శాతం మందే తాము విధిగా సీట్‌బెల్ట్ ధరిస్తున్నామని తెలిపారు. దేశంలో దాదాపు ప్రతీ ఏడాదీ 30 లక్షల కార్లు అమ్ముడవుతున్నాయి. వీరిలో చాలా మంది కేవలం నిర్లక్ష్యం కారణంగా తాము సీటుబెల్టు పెట్టుకోవడం లేదని తెలిపారు. డబ్ల్యూహెచ్‌ఓ వెల్లడించిన ఒక నివేదిక ప్రకారం 45 నుండి 50 శాతం వరకు సీట్‌బెల్ట్ పెట్టుకోవడం వల్ల ప్రాణాలు కాపాడుకునే అవకాశముందని తెలిపింది.

కారు ప్రమాదాల నుంచి కాపాడే ఒక సులభ నిరోధకం సీట్‌బెల్ట్. అవి కారు నడిపే వ్యక్తికి రక్షణలా పని చేస్తాయి. కొంతమంది వీటిని వాడకుండా తమకు కార్లలో ఎయిర్‌బ్యాగ్స్ ఉన్నాయని చెబుతున్నా.. అవి అంత శ్రేయస్కరం కాదని, వాటివల్ల ప్రమాదం పొంచి ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరో ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే కార్లలో వెనుక సీట్లలో కూర్చున్నవారు సీట్‌బెల్ట్‌లు ధరించడంలో చాలా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కేవలం 4శాతం మంది మాత్రమే ధరిస్తున్నారని ఆ సర్వే తెలిపింది. ఈ సర్వే ప్రకారం వెనుక కూర్చుని సీట్‌బెల్ట్‌ను ధరించని వారిలో 80శాతం మంది పెళ్లికానివారున్నారు. ఇదీ కాక ప్రభుత్వం ఈ విషయంపై సరైన అవగాహన కల్పించట్లేదని వాపోతున్నారు. కానీ తమ ప్రాణాలు రక్షించుకోవడానికీ ప్రభుత్వం చెప్పాలనుకోవడం నిజంగా ఆశ్చర్యం కలిగించే అంశం. దాదాపు 40శాతం మంది కేవలం తమ పక్కన కూర్చున్న వారితో తాము తక్కువగా చూడబడతామనే కారణంతో వాటిని ధరించట్లేదంటున్నారు. ఇవే అధిక శాతం మరణాలకు కారణమవుతున్నాయి. కానీ బ్రిటన్‌లో జరిపిన ఒక పరిశోధన ప్రకారం వెనుక కూర్చున్నవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవడం వల్ల 73 శాతం మరణాల్ని నియంత్రించగలిగారని తెలిసింది.

సీట్‌బెల్ట్ పెట్టుకోవడం వల్ల వారు వేసుకున్న డ్రెస్‌లు పాడవుతున్నాయనే కారణం 32శాతం మంది చెప్పడం వింత పరిణామం. కానీ సీట్‌బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల దేశంలో రోజుకు 15 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. సెంటర్ ఫర్ ఆటో సేఫ్టీ అనే సంస్థ అమెరికాలో జరిపిన సర్వే ప్రకారం ఆ దేశంలో వెనకాల కూర్చున్నవారు సీట్‌బెల్ట్‌లు ధరించకపోవడం వల్ల ప్రతీ ఏటా 1000 మంది వరకు చనిపోతున్నారని తెలిపింది. 2016లో భారత్‌లో 5,638 మంది కారు ప్రమాదాల్లో చనిపోయారు. కొంతమంది చలాన్లు తప్పించుకోవడానికి వాటిని ధరిస్తున్నా అవి అంతకన్నా విలువైన ప్రాణం కాపాడుతున్నాయి. ప్రభుత్వాలూ కేవలం డబ్బులు దండుకుందామనే కాకుండా మానవతా దృక్పథంతో ప్రయాణికుల ప్రాణాలు కాపాడే విధంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలి.

తెలంగాణ పునర్నిర్మాణంలో

పుస్తకానిది కీలక పాత్ర

- **వాటి ద్వారానే మానసిక పరివర్తన**
- **ఇంటర్‌నెట్‌లో చదివితే తృప్తి ఉండదు**
- **పరిజ్ఞానం విస్తరించినా పఠనం తగ్గలేదు**
- **ఆసక్తి పెంచేందుకే పుస్తక ప్రదర్శన**



చంద్రమోహన్

'నవతెలంగాణ'తో హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, కార్యదర్శి చంద్రమోహన్ తెలంగాణ పునర్ నిర్మాణంలో పుస్తకం కీలక పాత్ర పోషించనుందని హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, కార్యదర్శి కె.చంద్రమోహన్ వ్యాఖ్యానించారు. ప్రపంచంలో ఇంటర్‌నెట్ వినియోగం, విస్తరణ ఎంత పెరిగినా పుస్తకం అజేయం అని చెప్పారు. పుస్తకాన్ని నేరుగా చదివినపుడు వచ్చే తృప్తి ఇంటర్‌నెట్‌లో చదివితే రాదని వారు తెలిపారు. కంప్యూటర్, ల్యాప్‌టాప్, మొబైల్‌లో పుస్తకాలను చదివితే కండ్లు దెబ్బతింటాయన్నారు. పుస్తకాలు కొని చదవడం వల్ల పబ్లిషర్లు, రచయితలకు మేలు కలగడంతోపాటు పుస్తక ప్రియులకు ఆనందం, ఆరోగ్యం, విజ్ఞానం, వినోదం లభిస్తాయని వివరించారు. ప్రస్తుతం మూఢనమ్మకాలను పారదోలే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సివి రచించిన నరబలి పుస్తకాన్ని అందరూ చదవాలని సూచించారు. హేతుబద్ధమైన, లౌకిక భావాలు పెంపొందించుకోవాలని, పుస్తకాల ద్వారానే మానసిక పరివర్తన పెరుగుతుందని వివరించారు.



జూలూరు గౌరీశంకర్

నవతెలంగాణ హైదరాబాద్ బ్యూరో

ఈనెల 18 నుంచి 28 వరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌వద్దనున్న తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో 31వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ జరగనుందని తెలిపారు. దేశంలో ఢిల్లీ తర్వాత మూడో అతిపెద్ద పుస్తక ప్రదర్శన ఇదేనని వివరించారు. బుక్ ఫెయిర్ సందర్భంగా గౌరీశంకర్, చంద్రమోహన్ నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌తో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా బుక్‌ఫెయిర్‌కు సంబంధించిన అనేక విషయాలను వారు వెల్లడించారు.

ఈ పుస్తక ప్రదర్శనకు ఉన్న ప్రాధాన్యత ఏమిటి..?

పుస్తకాలను విక్రయించడం, చదివించడంతోపాటు వాటిని తరగతి గది వద్దకు తీసుకెళ్లాలన్నది ముఖ్య ఉద్దేశం. విద్యాశాఖ అధికారులతోపాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలను కలుస్తున్నాం. విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ సమావేశం, సభ జరిగినా అక్కడ పుస్తక ప్రదర్శన గురించి ప్రత్యేకంగా చర్చ జరిగేలా చూస్తున్నారు. బుక్‌ఫెయిర్‌లో విస్తృతంగా పాల్గొనాలని కోరాలి. జ్ఞాన తెలంగాణ నిర్మాణానికి పుస్తకమే పునాది కావాలని మేం ఆకాంక్షిస్తున్నాం.

పోటీ పరీక్షల కోసం చదువుతున్న నిరుద్యోగ యువత కోసం ఎలాంటి పుస్తకాలున్నాయి?

భారత దేశ చరిత్ర, తెలంగాణ సాహిత్యం, చరిత్రకు సంబంధించిన అరుదైన పుస్తకాలన్నీ ఈ పుస్తక ప్రదర్శనలో అందుబాటులో ఉంటాయి. పోటీ పరీక్షల కోసం చదివే యువతకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. హ్యారిపోటర్, చేతన్ భగత్ పుస్తకాలే కాకుండా సచిన్ ఆత్మకథ వంటి అనేక రకాల పుస్తకాలుంటాయి. ఏ పుస్తకాలు కొనాలి, ఏ పుస్తకాలు చదవాలన్నది వారి పరిపక్వతకు సంబంధించిన విషయం. బైబిల్, ఖురాన్, భగవద్గీతతోపాటు అస్తిత్వ ఉద్యమాలు, పూలే, అంబేద్కర్, సావిత్రిభాయి పూలే, కారల్‌మార్క్స్ ఇలా అన్ని రకాల పుస్తకాలుంటాయి. రాజ్యాంగం గురించి విస్తృతంగా తెలుసుకోవాలి. ఇంజినీరింగ్ విద్యార్థులు సోషల్ సైన్స్‌కు సంబంధించిన పుస్తకాలు చదవాలి.

హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రాధాన్యత?

ఒకనాడు ప్రజల్ని విజ్ఞాన వంతులు చేయడం కోసం భాషాభిమానంతో గ్రామగ్రామాన గ్రంథాలయాలను స్థాపించి, నిర్వహించారు. వట్టికోట ఆళ్వారుస్వామి వంటివారు విలువైన పుస్తకాలు ప్రచురించి ప్రజల్లోకి తీసుకెళ్ళారు. 1901 నాటికి శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలాంటి వాటిని స్థాపించారు. మాడపాటి హనుమంతరావు, కొమర్రాజు, రావిచెట్టు రంగారావు, ఆదిరాజు వీర భద్రరావు లాంటి వారు విశేష కృషి చేశారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా 1985లో 20 స్టాల్స్‌తో హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రారంభమైంది. ఈ రోజు 300 పైన స్టాల్స్‌తో నడుస్తోంది.

పుస్తక ప్రదర్శన వల్ల ఒనగూరే ప్రయోజనాలను వివరిస్తారా?

పుస్తకాలను ప్రజలకు అందుబాటులోకి తేవడం, పిల్లల్లోను, పెద్దల్లోనూ పఠనాసక్తిని పెంచేందుకు పుస్తక ప్రదర్శనలు ఉపకరిస్తాయి. కె.జి నుంచి పి.జి వరకూ బాలసాహిత్యం నుంచి భారత, భాగవత రామాయణ పురాణేతిహాసాలు అన్ని వయసులవారికి ఉపకరించే విభిన్న గ్రంథాలు, వేర్వేరు ప్రచురణ కర్తలు, గ్రంథకర్తలు భిన్న భాషా గ్రంథాలు ఒకే చోట భారీ డిస్కౌంట్‌లతో లభ్యమవుతాయి. రచయితలకు, ప్రచురణకర్తలకు, పుస్తక విక్రేతలకు అనుసంధాన కర్తగా ఈ పుస్తక ప్రదర్శనలున్నాయి. పుస్తకాల వ్యాపారం ఆధారంగా జీవించే వారికెందరికో జీవన భృతి దొరుకుతున్నది. రచయితలు వారి పుస్తకాలు ఇతర భాషల్లోకి అనువాదాలకు ప్రయత్నించుకొనే వీలుంటుంది. రచయితలకు/పబ్లిషర్స్‌కు ఈ ప్రదర్శనలు సంధాన కర్తలుగా ఉంటాయి.

మీరు కేవలం హైదరాబాద్‌లోనే నిర్వహిస్తున్నారా?

పుస్తక ప్రదర్శనలను హైదారాబాద్‌కు మాత్రమే పరిమితం చేయకుండా తెలంగాణ పల్లెకు, చిన్న పట్టణాలకు తీసుకుపోయాం. పల్లెకు పుస్తకం పేరుతో 'రొట్టమాకురేవు' (కారెపల్లి మండలం, ఖమ్మంజిల్లా) అనే గ్రామంలో ప్రదర్శన ఏర్పాటు చేశాం జిల్లా మండల కేంద్రాల్లోకి కూడా బుక్ ఫెయిర్ ద్వారా అక్షర గుభాళింపులు వెదజల్లాం. వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, కరీంనగర్, కొత్తగూడెం, కామారెడ్డి, సిద్ధిపేట, కోదాడ కేంద్రాల్లోనూ బుక్ ఫెయిర్‌లు నిర్వహిస్తూ తెలుగు భాషకు ఎనలేని కృషి జరిపాం. పుస్తకాలు అత్యంత తక్కువ ధరల్లో, భారీ డిస్కౌంట్‌లతో దొరికేట్టు చేశాం.

ఈ సంవత్సరం నిర్వహించే బుక్ ఫెయిర్ ప్రాధాన్యత ఏమిటి?

2016 నుంచి జాతీయ పుస్తక ప్రదర్శనగా మలిచాం. 12 రాష్ట్రాల నుంచి, దక్షిణాది అన్ని భాషల పుస్తక రచయితలు, పబ్లిషర్స్ పాల్గొన్నారు. ఈసారి పుస్తక ప్రదర్శనతో పాటు సాహిత్య కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు, బాలసాహిత్యం, పిల్లలకోసం చిత్రలేఖనం, బుక్ హంట్, బుక్ వాక్, వర్క్‌షాపులు, పిల్లలకు కథలు వంటి కార్యక్రమాలు రూపొందిస్తున్నాం. ఈ సంవత్సరం తెలంగాణ రచయితలకు మాత్రమే ఉచితంగా తమ పుస్తకాలను అమ్మకాలు జరుపుకొనేందుకు స్థలాన్ని కేటాయించాం. ప్రధాన వేదికకు తెలంగాణ గర్వించదగిన సాహితీ మూర్తి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి నారాయణ రెడ్డి పేరుతో ఏర్పాటు చేస్తున్నాం. ప్రాంగణానికి భాగ్యరెడ్డివర్మ ప్రాంగణంగా నామకరణం చేశాం.

పుస్తక ప్రదర్శన సమయం.. ఇతర వివరాలు తెలపగలరా...?

సాహిత్య వేదికకు సామల సదాశివ ప్రాంగణంగా, బోయి జంగయ్య వేదికగా నామకరణం చేయటం ద్వారా ప్రత్యేకతను సంతరించుకునేటట్టు చేస్తున్నాం. సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల సందేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 8.30 గంటలవరకు ఉంటాయి. పుస్తకావిష్కరణలు బాలసాహిత్య కార్యక్రమాలు మినీహాల్‌లో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటాయి. పుస్తక ప్రదర్శన సమయం సోమవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం 2.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు, శని,ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పుస్తకప్రియులు భారీగా తరలొచ్చి జయప్రదం చేయాలని కోరుతున్నాం.

భారత్‌లో నెతన్యాహూ

- **ఆరు రోజుల పాటు ఇజ్రాయిల్ ప్రధాని పర్యటన**
- **ప్రోటోకాల్ దాటి స్వాగతం పలికిన మోడీ**
- **తీన్‌మూర్తి చౌక్‌కు హాఫియా చౌక్‌గా నామకరణం**



న్యూఢిల్లీ : ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ఆరు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం భారత్‌కు విచ్చేశారు. న్యూఢిల్లీలోని పాలం విమానాశ్రయంలో భార్య సారాతో కలిసి దిగిన నెతన్యాహూకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రోటోకాల్‌ను సైతం పక్కనబెట్టి అసాధారణరీతిలో స్వాగతం పలికారు. కరచాలనం చేయడమేగాక ఆత్మీయంగా కౌగలించుకొని మరీ స్వాగతించారు. ఇద్దరు నేతలూ చేతులు పట్టుకొని కలిసికట్టుగా అభివాదం చేశారు. 'నా నేస్తమా నెతన్యాహూ భారత్‌కు స్వాగతం. భారత్‌లో మీ పర్యటన చారిత్రాత్మకం, ప్రత్యేకం. మన ఇరు దేశాల మైత్రీబంధాన్ని మీ పర్యటన మరింత బలోపేతం చేస్తుంది' అని ఆంగ్లంలోనూ, హిబ్రూలోనూ మోడీ ట్వీట్ చేయడం విశేషం.

ఇక నుంచి తీన్‌మూర్తి హాఫియా చౌక్

భారత్, ఇజ్రాయిల్ స్నేహబంధానికి ప్రతీకగా నిలిచిన న్యూఢిల్లీలోని యుద్ధ స్మారకం తీన్‌మూర్తి చౌక్‌కు ఇజ్రాయిల్ నగరమైన హాఫియా పేరు జతచేసి తీన్‌మూర్తి హాఫియా చౌక్‌గా మోడీ, నెతన్యాహూ సమక్షంలో నామకరణం చేశారు. ఈ స్మారకం వద్ద హైదరాబాద్, జోధ్‌పూర్, మైసూర్‌కు చెందిన అశ్వికదళ వీరుల కాంస్య విగ్రహాలున్నాయి. నామకరణోత్సవానికి ముందు యుద్ధ వీరులకు మోడీ, నెతన్యాహూ శ్రద్ధాంజలి ఘటించారు. సందర్శకుల పుస్తకంలో సంతకాలు చేశారు.

తీన్‌మూర్తి స్మారకం ప్రత్యేకత ఇది..

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ఒట్టోమాన్ ఆక్రమణ నుంచి హాఫియా నగరాన్ని భారత సైనికులు విముక్తి చేశారు. ఆనాడు 15వ ఇంపీరియల్ సర్వీస్ అశ్వికదళంలో పనిచేసిన భారత సైనికులు అనేక మంది ఈ పోరాటంలో అమరులయ్యారు. దాదాపు 900 మంది సైనికులకు ఇజ్రాయిల్‌లోనే అంత్యక్రియలు జరిగాయి. వీరి పోరాటం ఫలితంగా 1918 సెప్టెంబర్ 23న హాఫియా స్వతంత్రం పొందింది. భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అధికారిక నివాసమైన తీన్‌మూర్తి భవన్ సమీపంలో ఉండటంతో ఈ యుద్ధ స్మారకాన్ని కూడా తీన్‌మూర్తి చౌక్‌గా పిలుస్తూవచ్చారు. గతేడాది మోడీ ఇజ్రాయిల్ పర్యటన సందర్భంగా న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ఈ చౌక్ పేరు మార్చాలని ప్రతిపాదించింది. ఇప్పుడు దానికి తీన్‌మూర్తి హాఫియా చౌక్‌గా అధికారికముద్ర పడింది.

15 ఏండ్ల విరామం తర్వాత..

భారత్‌లో పర్యటించిన రెండో ఇజ్రాయిల్ ప్రధానమంత్రిగా నెతన్యాహూ రికార్డులకెక్కారు. 15 ఏండ్ల కిందట 2003లో అప్పటి ఇజ్రాయిల్ ప్రధాని ఏరియల్ షరోన్ భారత్‌లో పర్యటించారు. అప్పట్లో భారత ప్రధానిగా బీజేపీ సీనియర్ నేత అటల్ బీహారీ వాజ్‌పేయి ఉన్న సంగతి విదితమే.

ఘోర రోడ్డు ప్రమాదం

- **నలుగురు మృతి..మరొకరి పరిస్థితి విషమం**



నవతెలంగాణ-టేకులపల్లి

భోగి పండుగ వేళ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న ఆటోని లారీ ఢీకొట్టడంతో నలుగురు అక్కడిక్కడే మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీ పరిధిలోని తంగెర్లతండా వద్ద ఆదివారం జరిగింది. టేకులపల్లి సీఐ దోమల రమేష్ వివరాల ప్రకారం కారేపల్లి మండలం టేకులగుంపు పంచాయతీ పరిధిలోని పంతుల్యతండాకు చెందిన మాలోతు మోతీలాల్, అతని భార్య లలిత, కుమారుడు చరణ్‌తో కలిసి పాల్వంచ మండలంలోని పెద్దమ్మగుడి దర్శనానికెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ఓ ఆటో ఎక్కారు. కొత్తగూడెం క్రాస్‌రోడ్‌లో మరో ముగ్గురు ఎక్కారు. కొద్దిదూరం వెళ్లాక ఆటోను పక్కకు నిలిపారు. అందులో నుంచి లలిత, చరణ్‌లు టాయిలెట్ చేసేందుకు కిందికి దిగారు. ఈ క్రమంలోనే ఆగి ఉన్న ఆటోపైకి పైపుల లారీ అతివేగంతో దూసుకెళ్లింది. ఆటో లారీ కింద ఇరుక్కుపోయింది. దీంతో ఆటోలోని నలుగురు అక్కడికక్కడే చనిపోయారు. ప్రొక్లెయిన్ సహాయంతో రెండు గంటల పాటు శ్రమించి చిక్కుకున్న యరనాగుల రమేశ్(40), మరో ఇద్దరు మహిళల మృతదేహాలను బయటకి తీశారు. మోతీలాల్, డ్రైవర్ జరుపుల వంశీకి తీవ్రగాయాలు కావటంతో 108 లో కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే మోతీలాల్(38) పరిస్థితి విషమించి చనిపోయాడు. వంశీ పరిస్థితి కూడా విషమంగానే ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఇల్లందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ అంబర్‌కిషోర్ ఝా, ఇల్లందు, డీఎస్పీ ప్రకాశ్‌రావు, ఎస్ఐ, సీఐ సందర్శించారు.

రూ.లక్షకోట్ల విలువగల విరోధి ఆస్తుల అమ్మకం

న్యూఢిల్లీ: భారత్‌ను వదిలి పాకిస్థాన్, చైనా పౌరసత్వం పొందిన వారి ఆస్తుల(వీటినే ఎుమి ప్రాపర్టీస్ అంటారు)ను కేంద్ర ప్రభుత్వం వేలం వేసేందుక‹ ‹ర్ణయించింది. సుమారు 9,400 ఆస్తులున్నట్టు హోం మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. వీటి‹ అమ్మితే ఒక లక్షకోట్ల రూపాయలు ప్రభుత్వా‹కి కలిసొస్తుంద‹ అధికారులు లెక్కలు గడుతున్నారు. ఈ ఆస్తులు కేంద్ర ప్రభుత్వం అజమాయిషీలో‹ భారత కస్టోడియన్ ఎుమి ప్రాపర్టీ కార్యాలయం ఆధీనంలో ఉంటాయి. 1965లో జరిగిన ఇండో-పాకిస్థాన్ యుద్ధానంతరం 1968లో ఎుమి ప్రాపర్టీ చట్టా‹్న రూపొందించారు. దీ‹ ప్రకారం దేశ విభజన అనంతరం ఆస్తులను వదిలి పాకిస్థాన్, చైనాక‹ వెళ్లిన వారికి ఇక్కడి ఆస్తుల పై ఎటువంటి హక్కు ఉండదు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. 6,289 ఎుమి ఆస్తుల సర్వే పూర్తయిందనీ, కస్టోడియన్‌లో ఉన్న 2,991 ఆస్తులనూ సర్వే చేస్తామన్నట్టు హోంశాఖ అధికారులు తెలిపారు.

మార్చి ముగిసేదాకా వణుకు

మొదటిపేజీ తరువాయి

ఆ ప్రభావం వ్యవసాయ, వ్యాపార రంగాలపై పడే అవకాశమున్నదని ఔరంగాబాద్‌లో ని అంతరిక్ష పరిశోధనా కేంద్రం డైరెక్టర్ శ్రీనివాస్ ఔందక్ అన్నారు. పొగమంచు కారణంగా రైలు, విమాన సర్వీసులకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఉత్తరాదిలో ఈ యేడాది ఉష్ణోగ్రతలు బాగా పడిపోయే అవకాశమున్నదని చెప్పారు. మరోవైపు చలి తీవ్రత మార్చి చివరి దాకా కొనసాగితే గోధుమ రైతులకు తీరని నష్టం జరుగుతుందని వ్యవసాయ శాఖ నిపుణులు దేవేంద్ర శర్మ అన్నారు. ఉష్ణోగ్రతలు సాధ్యమైనంత ఎక్కువ ఉంటేనే గోధుమ పంటలకు అనుకూలమని ఆయన తెలిపారు.

సెన్సెక్స్ ▲ 89
34,592

నిఫ్టీ ▲ 30
10,681

డాలరుకు
రూపాయి విలువ
63.62



శుక్రవారం మార్కెట్లు ముగింపు సమయానికి

విదేశాలకు కేటీఆర్



ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సుకు హాజరు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఆదివారం విదేశాలకు బయలు దేరారు. ఈ సందర్భంగా పలు అంతర్జాతీయ సదస్సులలో పాల్గొననున్నారు. ఈ నెల 15 నుంచి 22 వరకు దక్షిణ కోరియా, జపాన్‌లో జరిగే అంతర్జాతీయ సదస్సులలో పాల్గొంటారు. అదే క్రమంలో రాష్ట్రంలో పెట్టుబడుల విషయంపై ఆయా దేశాల పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఫార్మ రంగాలపై చర్చిస్తారు. ఈ నెల 23 నుంచి 26 వరకు స్విజ్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొన్న అనంతరం తిరిగి రాష్ట్రానికి చేరుకుంటారు.

జపాన్ టాప్..భారత్‌కు 30 వ ర్యాంకు

గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండెక్స్‌లో



న్యూఢిల్లీ : గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ ఇండెక్స్‌లో భారత్‌కు 30 వ ర్యాంకు దక్కింది.జపాన్ అగ్రభాగన నిలవగా,చైనా ఐదో స్థానంలో చేజిక్కించుకుంది.ప్రపంచ ఆర్థిక వేదిక(వరల్డ్ ఎకనామిక్ ఫోరం) వెల్లడించింది. జేనీవా వరల్డ్ ఎకనామిక్ ఫోరం సంస్థకు చెందిన రిడినెస్ ఫర్ ద ఫ్యూచర్ ఆఫ్ ప్రొడక్షన్ రిపోర్టులో ప్రకటించింది. వంద దేశాల్లో నాలుగు కేటగిరీల ప్రాతిపదికగా తీసుకున్నట్టు డబ్ల్యూఈఎఫ్ తెలిపింది.

పారదర్శకతలేని ప్రపంచ బ్యాంక్ నివేదికలు

- రాజకీయ జోక్యం మారుతున్న రిపోర్టులు
- సోషలిస్ట్‌పార్టీకి చెందిన చిలీ అధ్యక్షురాలి పాలనలో డూయింగ్ బిజినెస్ ర్యాంక్ 25నుంచి 57కు
- వాస్తవ పరిస్థితులు అలా లేవు
- నాలుగేండ్ల ర్యాంకులను మళ్లీ లెక్కిస్తాం: ప్రపంచ బ్యాంక్ చీఫ్ ఎకానమిస్ట్ పౌల్ రోమర్



వాషింగ్టన్: ప్రపంచ బ్యాంకు విడుదలచేసే ప్రధాన నివేదికల్లో డూయింగ్ బిజినెస్ ర్యాంకు ఒకటి. అది ప్రకటించే ఆర్థిక నివేదికలకోసం ప్రపంచవ్యాప్త దేశాలు, మీడియా ఆతృతగా ఎదురుచూస్తుంటాయి. వారి ర్యాంకులను మెరుగుపర్చుకుంటే చాలు అభివృద్ధిని సాధించినట్టే అని ఆలోచించే దేశాలూ ఉన్నాయి. ఈ ఆర్థిక నివేదిక కూర్పు పద్ధతుల్లో కొన్నేండ్ల నుంచి చోటుచేసుకుంటున్న అనేక మార్పుల వల్ల దాని ప్రధాన లక్ష్యమే నీరుగారిపోతోందని ప్రపంచ బ్యాంకు ముఖ్య ఆర్థికవేత్త పౌల్ రోమర్ వాపోయారు. అసమగ్రత, తప్పుదోవ పట్టించే నివేదిక ఇచ్చినందుకు ఆయన క్షమాపణలు కోరారు. అయితే, ఈ తప్పిదానికి రాజకీయ జోక్యం కూడా దోహదం చేసిందన్నారు. వివిధ దేశాల మధ్య వ్యాపారాల్లో పోటీనేర్పరిచేందుకు విడుదల చేసే 'డూయింగ్ బిజినెస్'(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ర్యాంక్‌లను పున్నప్రక్షాళన గావిస్తామని తెలిపారు. కనీసం నాలుగేండ్ల ర్యాంకులను మళ్లీ గణిస్తామని, దీంతో, అన్ని దేశాల ర్యాంకులు ప్రభావితమవుతాయని ఆయన వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రికకు వెల్లడించారు. పౌల్ రోమర్ నూతనంగా(2016లో) ప్రపంచబ్యాంక్ చీఫ్ ఎకానమిస్ట్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రకటనపై ప్రపంచబ్యాంకు వ్యాఖ్యానించబోదని ఆ బ్యాంక్ అధికార ప్రతినిధి తెలిపారు. అయితే, ఈ నివేదికలకు బాధ్యత వహించాల్సిన మాజీ డైరెక్టర్ లోపేజ్ క్లారోస్ అందుబాటులోకి రాలేదు. 2018 ఏడాదికిగాను ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకులో మన దేశానికి 100వ స్థానం వచ్చిన విషయం తెలిసిందే. 100స్థానాల జాబితాలోకి మనదేశం మొదటిసారి చేరింది. ఈ ర్యాంకు సాధించి నందుకు దేశవ్యాప్తంగా పలువురు హర్షించారు. కేంద్ర ప్రభుత్వ సంస్కరణలతో ఈ ర్యాంకును సాధించామని కొందరు అభిప్రాయపడిందీ విదితమే. ర్యాంకును నిర్ణయించే అంశాలు వేరు కావడం వల్ల గత ర్యాంకులను పోల్చలేం. కానీ, ఒకసారి గమనిస్తే 2016కు 130, 2017కు 130 స్థానాలను సాధించిన భారత్ 2018కి ఏకంగా 30 స్థానాలు ఎగబాకి 100వ స్థానానికి చేరింది. సోషలిస్టు పార్టీకి చెందిన మిషెల్లీ బ్యాచ్‌లెట్ 2014లో చిలీ దేశ అధ్యక్షురాలుగా పదవిలోకి వచ్చినప్పటినుంచి ఈ పక్షపాత నివేదికలు చిలీ దేశ ర్యాంకును తీవ్రంగా ప్రభావితం చేశాయి. అయితే, ఈ నివేదికలకు బాధ్యత వహించాల్సిన లోపెజ్ కార్లోస్‌కూడా చిలీ దేశస్థుడు కావడం గమనార్హం. చిలీస్థానం ర్యాంకు మదింపు పద్ధతిలో చోటుచేసుకున్న మార్పుల వల్ల మారింది. కానీ, ఆ దేశంలో వాస్తవ వ్యాపార అనుకూలతకు సంబంధించిన మార్పు కాదని రోమర్ విశ్లేషించారు. చిలీ ర్యాంకు దిగజారడంవెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ర్యాంకులు చెబుతున్నట్టు బ్యాచ్‌లెట్ పాలనలో వ్యాపార పరిస్థితులేం క్షీణించలేదని ఆయన తెలిపారు. తాను తగిన శ్రద్ధ పెట్టలేదని, ఈ ర్యాంకులు సమగ్రంగా లేవని స్పష్టం చేశారు. ర్యాంకులను మళ్లీ లెక్కించాలన్న తన నిర్ణయంతో ప్రపంచ బ్యాంక్‌పై పలు సందేహాలకు తెరలేపారు.

డూయింగ్ బిజినెస్ ర్యాంకు గణింపులో ఎలాంటి మార్పులు సంభవించాయి?

ఒక దేశంలో వ్యాపారం నిర్వహించడానికి మెరుగైన అవకాశాలను బట్టి ప్రపంచ బ్యాంకు డూయింగ్ బిజినెస్ ర్యాంకును రూపొందిస్తుంది. ఉదాహరణకు ఒక దేశంలో ఒక వ్యాపారాన్ని ప్రారంభించేందుకు ఎన్ని రోజులు పడుతుంది? వ్యాపార నిర్వహణ ఆమోదపత్రాలకు అయ్యే వ్యయమెంత? లాంటి అంశాలపై ఆధారపడి ఈ ర్యాంకును నిర్ణయిస్తుంది. ఒక వేళ వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం కల్పించలేకపోతే ఆ దేశ ర్యాంకు దిగజారుతుంది. అయితే, ఈ ర్యాంకు లెక్కింపులో ప్రపంచ బ్యాంకు మార్పులు చేస్తోంది. ర్యాంకు నిర్ణయించేందుకు కొత్త అంశాలు చేరుస్తున్నది. ఉదాహరణకు నిర్మాణ పనుల ఆమోదం అంశంలో విద్యుత్ సరఫరా, విద్యుత్‌చార్జీలు, షేర్‌హోల్డర్లకు అందించే న్యాయ సేవల నాణ్యత, పన్నుల పద్ధతి లాంటివి చేర్చింది. ఈ అంశాల్లోని ర్యాంకులతో తుది ర్యాంకును నిర్ణయిస్తుంది. సరళతర పన్ను విధానం అనే అంశంలో 2015లో చిలీ దేశం 33వ ర్యాంకును పొందగా, అదే అంశానికి కొత్తగా పన్ను ఫైల్ చేశాక ఎన్నిరోజులు పడుతోందనే విషయాన్ని చేర్చింది. దీంతో, ఈ అంశంలో ఆ దేశ ర్యాంకు 2016లో అత్యల్పంగా 120వ స్థానానికి పడిపోయింది.

ఎయిర్ ఇండియాలో 49 శాతం ఎఫ్‌డీఐలకు ఆమోదం ప్రత్యామ్నాయమార్గం చూపుతుందా.. లేదా. ఉద్యోగుల్లో అనుమానాలు మొండిగా మోడీ సర్కారు ముందుకే..


మోడీ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటినుంచి ప్రభుత్వరంగసంస్థలను నిర్వీర్యం చేయటమే పనిగా పెట్టుకున్నది. ఎయిరిండియాకు వచ్చిన కష్టాలు, నష్టాల బూచి చూపించి వదిలించుకునే మార్గాలను కేంద్రం ఆలోచిస్తున్నదన్న వాదనలు బలంచేకూరేలా..49 శాతం ఎఫ్‌డీఐలకు మోడీ క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. ఇప్పుడు అందులో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఒకటే ఆందోళన.విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టే సంస్థలు మళ్లీ ఉద్యోగం ఇస్తాయా.. ప్రత్యామ్నాయమార్గం చూపుతానంటున్న కేంద్రం అదే మాట మీద నిలబడుతుందా..అనే అనుమానాలు ఉద్యోగ వర్గాలను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.అయితే ఎయిరిండియాలో ఎంత మంది ఉద్యోగులు ఉన్నారు.?బీజేపీ సర్కారు ఎలాంటి ఆలోచనతో ముందుకెళ్లాలనుకుంటున్నది.?

ఉద్యోగులకు దారేదీ..?

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విమానాయాన సంస్థ ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్రం దూకుడు పెంచింది. దీనిలో భాగంగానే ఎయిరిండియాలో విదేశీ కంపెనీలు 49శాతం పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవలే కేంద్రం ఆమోదం తెలిపిన విషయం విదితమే. క్యాబినెట్ ఎఫ్‌డీఐలను ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి.. ఎయిరిండియాలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఒకటే టెన్షన్..టెన్షన్. ఎయిరిండియా, దా ని అనుబంధ సంస్థల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులతో కలిపి సుమారు 29వేల మందికి పైగా పనిచేస్తున్నారు.ఎఫ్‌డీఐలు గుమ్మరిస్తామంటూ..బీజేపీ సర్కారు ప్రకటన కారణంగా.. ఎయిరిండియాను ప్రయివేటీకరిస్తే అందులో పనిచేసే ఉద్యోగుల్లో ఎంతమంది ఉద్యోగాలు ఉంటాయి..ఎంతమంది ఉద్యోగాలను కోల్పోతారోనన్న భయాందోళన వ్యక్తమవుతోంది. సాధారణంగా ఎవరికైనా ఉపాధి కోల్పోతే కోలుకోవటానికి చాలా సమయం పడుతోంది. ఇన్నాళ్లు తమ సంస్థగా భావించే ఎయిరిండియాలో పనిచేసే ఉద్యోగులను తొలగిస్తే..ఏం జరుగుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

కేంద్రం అంటున్నదేంటీ..?

ఎయిరిండియాలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రత్యామ్నాయ మార్గం చూపుతామని మోడీ సర్కారు అంటోంది. ముందుగా ఇక్కడ పనిచేసే ఉద్యోగులను వేరే ప్రభుత్వ రంగ సంస్థల్లోకి తీసుకోవడం, లేదా వాలంటరీ రిటైర్‌మెంట్ ప్యాకేజ్ ఇచ్చే ఆలోచనను కేంద్రం చేస్తున్నట్టు తెలిసింది. ప్రధానంగా వాలంటరీ రిటైర్‌మెంట్ ప్యాకేజీ ఇచ్చి చేతులు దులుపుకోవాలని యోచిస్తున్నట్టు ఎయిర్‌ఇండియా కార్మికసంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇంతవరకూ ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.మరోవైపు ఎయిర్ ఇండియా ప్రయివేటీకరణను కార్మికసంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.



పార్లమెంటరీ స్థాయీసంఘం సిఫారసులు ఏమంటున్నాయి..?

ప్రభుత్వరంగసంస్థ అయిన ఎయిరిండియాను కొనటానికి సింగపూర్ ఎయిర్‌లైన్స్ రెడీ అయ్యింది.2018 ఆఖరుకన్నా పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను పూర్తిచేస్తామని కేంద్రమంత్రి జయంత్ సిన్హా ప్రకటించారు.మరోవైపు పార్లమెంటరీ స్థాయి సంఘం కూడా మోడీ సర్కారు ఎఫ్‌డీఐల నిర్ణయాన్ని ఐదేండ్ల పాటు వాయిదా వేయాలని కోరింది.నెమ్మదిగా కోలుకుంటున్న ఎయిరిండియాను..మరికొంతకాలంపాటు సమయమివ్వాలని ప్రతిపాదించింది. కానీ కేంద్రంలోని బీజేపీ సర్కారు మాత్రం ఇవేమి పట్టించుకోవటానికి సిద్ధంగాలేదన్నట్టుగా వ్యవహారిస్తోంది. ఎంత తొందరగైతే అంత వేగంగా ప్రభుత్వరంగసంస్థలను అమ్మేయటానికి సన్నద్ధమవుతోంది.ఈ చర్యను ప్రతిపక్షాలు, కార్మికసంఘాలు ఆక్షేపిస్తున్నాయి.

ప్రయివేటీకరణపై సమరం



- 17న దేశవ్యాప్తంగా స్కీమ్‌వర్కర్ల సమ్మె
- పాల్గొననున్న 26 పథకాల ఉద్యోగులు
- సమ్మె జయప్రదానికి 8 కార్మిక సంఘాల కసరత్తు

ప్రజలకు సేవలందిస్తున్న పలు పథకాలను ప్రయివేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ, కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్త పోరాటానికి కార్మిక సంఘాలు సన్నద్ధమయ్యాయి. ఈనెల 17న స్కీమ్ వర్కర్ల సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ సమ్మెలో రాష్ట్రంలోని 26 విభాగాల నుంచి లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు భాగస్వామ్యులవుతున్నారు. సమ్మెను జయప్రదం చేసేందుకు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, ఏఐయూటీయూసీ, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ తదితర ఎనిమిది కార్మిక సంఘాలు నడుం బిగించాయి. కనీసవేతనం రూ.18వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలనీ, 45వ ఇండియన్ లేబర్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో తెలంగాణలో 26 పథకాలు కొనసాగుతున్నాయి. వీటిలో ప్రధానమైనవి అంగన్‌వాడీ, మధ్యాహ్నభోజనం, ఆశా, జాతీయ ఉపాధి హామీపథకం, ఐకేపీ, 104,108, సర్వశిక్షా అభియాన్, అర్బన్ హెల్త్ సెంటర్స్...ఇలా పలు పథకాలు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో రాష్ట్రంలో కొనసాగుతున్నాయి. ఈ పథకాలన్నీ పేద ప్రజలకు, మహిళలకు, పిల్లలకు అనేక సేవలందిస్తున్నాయి. అయితే ప్రభుత్వ హయాంలోని కొనసాగుతున్న ఈ పథకాలను ప్రయివేటు, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించేందుకు పాలకులు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే మధ్యాహ్నభోజనంతో పాటు పలు పథకాల్లో ప్రయివేటు సంస్థలను చొప్పించారు. దశలవారిగా ఇదే విధానాలను అన్ని పథకాల్లో కొనసాగించేందుకు కుట్రలు పన్నుతున్నారు. సర్కారు చర్యలతో పథకాల నిర్వహణ అస్తవ్యస్థంగా మారి పేదల సౌకర్యాలపై ప్రభావం చూపనుంది. దీనికితోడు ఈ స్కీముల్లో ఇప్పటికే చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల ఉపాధి ప్రశ్నార్థకంగా మారనుంది. కొన్ని పథకాల గురించి...

ఐసీడీఎస్ పథకం..

రాష్ట్రంలో 149 ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో సుమారు 70వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పనిచేస్తున్నారు. వీరంతా పథకం ద్వారా మూడు లక్షల మంది గర్భిణీలకు, రెండున్నర లక్షల మంది బాలింతలకు, 25లక్షల మంది చిన్నారులకు సేవలందిస్తున్నారు. ఏండ్ల నుంచి పనిచేస్తున్న కార్యకర్తలకు నెలకు కేవలం రూ.10,200, ఆయాలకు రూ.7,500 మాత్రమే వేతనం అందిస్తున్నారు. మాతా శిశు మరణాలు తగ్గించడంతో పాటు పౌష్టికాహారలోపాన్ని తగ్గించడంలో కార్యకర్తలు, ఆయాల కృషి ఎంతో ఉంది. కానీ ఈ పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించాలనే కుట్ర జరుగుతుంది.

ఇతర పథకాలు..



సర్వశిక్షా అభియాన్ పథకంలో సుమారు 20వేల మంది పనిచేస్తున్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం గానీ, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం గానీ రావడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 60 వేల మంది స్వచ్ఛ కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి నెలకు కేవలం రూ.2వేలు మాత్రమే ఇస్తున్నారు. ఇలా గోపాలమిత్ర, ఆరోగ్యమిత్ర, రైతుమిత్ర, సాక్షరభారతి, బాలకార్మిక నిర్మూలన ప్రాజెక్టు..అనేక రంగాల్లోనూ నామమాత్రపు వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా సమ్మె బాట పడుతున్నారు.

సమ్మెకు సన్నద్ధం : ఎస్ రమ, స్కీమ్ వర్కర్స్ యూనియన్ నేత



ఈనెల 17న నిర్వహించే సమ్మెకు కార్మికులు, ఉద్యోగులు సన్నద్ధమవు తున్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఇప్పటికే రాష్ట్ర కేంద్రంలో గతేడాది డిసెంబర్ 20న సమ్మె సన్నాహక సదస్సు నిర్వహించాం. అన్ని జిల్లా, మండల కేంద్రాల్లోనూ ఈ సదస్సులు జరిపాం. లక్షల కరపత్రాలు, వేలాది పోస్టర్లతో సమ్మె ప్రచారాన్ని ముమ్మరం చేశాం. సమ్మె రోజున జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించి, స్కీమ్ వర్కర్ల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం.



జాతీయ ఆరోగ్య మిషన్...

ఈ పథకంలో 25 వేల మందిపైగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలు స్వచ్ఛంధంగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు, గర్భిణీలు, బాలింతల పనితో పాటు పిల్లల ఆర్యోగపరమైన అవగాహన కల్పిస్తూ రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. కానీ వీరికి ఇప్పటికీ నిర్ధిష్టమైన వేతనమంటూ లేదు. ప్రోత్సాహకాల పేరుతో అరకొర వేతనాలు పొందుతున్నారు. వారికి ప్రభుత్వ జీవోల ప్రకారం కనీస వేతనం ఇవ్వాలనీ, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ వీరంతా సమ్మెబాట పడుతున్నారు. వీరితో పాటు యూఆర్‌హెచ్‌ల్లో పనిచేసే సిబ్బంది, సెకండ్ ఏఎన్ఎం, ల్యాబ్ టెన్నిషియన్స్, 104,108 తదితర సిబ్బంది కూడా సమస్యల పరిష్కారానికి పోరాబాట పడుతున్నారు.

మధ్యాహ్నభోజన పథకం..

రాష్ట్రంలో 25వేలకు పైగా పాఠశాలల్లో ఈ పథకం అమలు అమలవుతుండగా, దీని ద్వారా 20లక్షల మంది విద్యార్థులు లబ్దిపొందుతున్నారు. వీరికి వండిపెట్టేందుకు సుమారు 83 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో వీరిదీ కీలకపాత్ర. 15 ఏండ్లుగా పనిచేస్తున్న ఈ కార్మికులకు వేతనం నెలకు రూ.వెయ్యి మాత్రమే ఇస్తున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్‌రేట్లను మాత్రం ప్రభుత్వం పెంచడం లేదు. కార్మికులకు కనీసం గుర్తింపు కార్డులూ ఇవ్వకపోవడం గమనార్హం. అయితే పథకాన్ని ప్రయివేటుకు ఇవ్వాలని ప్రభుత్వం కుట్రలు చేస్తున్నది. దీనిలో భాగంగా ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఇస్కాన్, నాందీ, అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగించారు. మిగిలిన చోట్ల అప్పగించేందుకు చర్చలు జరుగుతున్నాయి.





దళిత బహుజన.. నీ దారెటు?

మండల నాగేశ్వర్‌రావు

మీసం మెలివేసాడనీ, మా జాతర వైపు తొంగి చూసాడనీ, అంబేద్కర్ బొమ్మ నడి ఊర్లో ఉంటే అరిష్టమనీ, బతుకమ్మ ఆడొద్దనీ, గుడిమెట్లు ఎక్కొద్దనీ, గొడ్డుమాంసం తింటోళ్లనీ ఎగతాళి చేస్తూ ఎన్నాళ్లని ఏవగించుకుంటారు. మా ఓట్ల కోసం మా గడప తొక్కినప్పుడు వంగొంగి దండాలు పెట్టినప్పుడు మా కులం యాదికి రాలేదా, మా మతం అడ్డుకాలేదా.. పదవులు అనుభవించడానికి మా ఓట్లతో గెలిచి కోట్లకు పడగలెత్తిన మీరు చివరికి మమ్మల్నే అంటరానివారిగా చూస్తున్నారు. కులం, మతం గోరక్షణ పేరుతో దళిత, బహుజనులపై అదే పనిగా హిందుత్వ ముసుగులో అగ్రవర్ణ అహంకారులు దాడులు చేస్తూ మానవత్వం మరిచి, ప్రాణాలు తీస్తున్నారు. ఈదేశంలో దళిత, బహుజనులుగా పుట్టడమే శాపమా? మేమంటే ఎందుకంతా కక్ష? దేశంలో ఏ మూలన చూసినా హత్యలు మానభంగాలు, దౌర్జన్యాలు, దాడులే. అగ్రవర్ణ పెత్తందారీ అహంకారం ఇంకెన్నాళ్లు? చరిత్రలో ఏ పేజీ తిరగేసినా తెల్ల దొరల పాలనలో కూడా ఈ వివక్ష కానరాదు.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. అందరికీ హక్కులు సరిసమానమని రాజ్యాంగంలో రాసుకున్నాం. చట్టాలు చూడటానికి చుట్టాలుగా కనబడుతున్నాయి. పెట్టుబడిదారులు ఏలే పట్టపు రాజ్యాలను మించిపోయింది మనదేశం. కొన్ని దేశాలలో జాతులమధ్య వైరం జరుగుతున్నది. కానీ మనదేశంలో కులాలు, మతాల మధ్య చిచ్చు రగిలించారు మనువాదులు. ఒకటా, రెండా గుర్తుంచుకోవడానికి, కాగితంపై రాసుకోవాలి, కుల మతాల లెక్కలు తెలియడానికి. కూటి కోసం కోటి విద్యలు అన్నట్టు వివిధ వృత్తులను నమ్ముకొని బతికే అమాయకుల మధ్యన కులం పేర, మతం పేర విడదీస్తున్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులు మనుషులే. అందరిలో ప్రవహిస్తున్నది రక్తమే. అందరి పుట్టుక, చావు ఒకేవిధంగా జరుగుతున్నపుడు, అందరం తిని బతికేది ఒక్కటే అయినప్పుడు ఫలానా కులం వాడే అన్నం తిని బతుకుతున్నాడని నిరూపించగలరా? లేదా ఫలానా మతం వాడే మనిషిలాగ మనుగగలుగుతున్నాడని చాటి చెప్పగలరా? దేశంలో శ్రామికులు ఏకం కాకుండా చూడటమే మీ మనుధర్మ సిద్ధాంతం. దళిత, బహుజనులు ఏకమైతే మీ ఆటలు సాగవని, అనగదొక్కే కుట్రలా? లేక అధికారం పంచన చేరితే ఉన్న పదవులు ఊడుతాయనా?

మీసం మెలివేసాడనీ, మా జాతర వైపు తొంగి చూసాడనీ, అంబేద్కర్ బొమ్మ నడి ఊర్లో ఉంటే అరిష్టమనీ, బతుకమ్మ ఆడొద్దనీ, గుడిమెట్లు ఎక్కొద్దనీ, గొడ్డుమాంసం తింటోళ్లనీ ఎగతాళి చేస్తూ ఎన్నాళ్లని ఏవగించుకుంటారు. మా ఓట్ల కోసం మా గడప తొక్కినప్పుడు వంగొంగి దండాలు పెట్టినప్పుడు మా కులం యాదికి రాలేదా, మా మతం అడ్డుకాలేదా.. పదవులు అనుభవించడానికి మా ఓట్లతో గెలిచి కోట్లకు పడగలెత్తిన మీరు చివరికి మమ్మల్నే అంటరానివారిగా చూస్తున్నారు. కులం, మతం గోరక్షణ పేరుతో దళిత, బహుజనులపై అదే పనిగా హిందుత్వ ముసుగులో అగ్రవర్ణ అహంకారులు దాడులు చేస్తూ మానవత్వం మరిచి, ప్రాణాలు తీస్తున్నారు. ఈదేశంలో దళిత, బహుజనులుగా పుట్టడమే శాపమా? మేమంటే ఎందుకంతా కక్ష? దేశంలో ఏ మూలన చూసినా హత్యలు మానభంగాలు, దౌర్జన్యాలు, దాడులే. అగ్రవర్ణ పెత్తందారీ అహంకారం ఇంకెన్నాళ్లు? చరిత్రలో ఏ పేజీ తిరగేసినా తెల్ల దొరల పాలనలో కూడా ఈ వివక్ష కానరాదు. రోజురోజుకూ దళిత, బహుజనులపైనే దాడులు పెరిగిపోతున్నాయి. ఎందుకు? ఆలోచించలేమా? ఆలోచించే శక్తి దళిత, బహుజనులకు లేదా? ఉన్నది. కానీ మనలో ఐక్యత లోపించినది. దాన్ని ఆసరా చేసుకొని విడదీసి పాలించు అనే సూత్రం అమలు చేస్తున్నారు కూర్చొని తినమరిగిన కుల రక్కసులు. ఈ రాజ్యాంగాన్ని రాసింది దళితుడే. మార్గనిర్ధేశం చేసింది దళితుడైన డా॥బిఆర్. అంబేద్కర్. మహాత్మా జ్యోతిరావు పూలే, చదువుల తల్లి సావిత్రిబాయి పూలే లాంటి ఎందరో మేధావులు దళితులే. ఏ సమాజానికైనా మూలాధారం దళిత, బహుజనులే. సేవలో, ఉత్పత్తిలో, సంస్కృతిలో దేనిలోనైనా ముందే. వ్యవసాయ ఉత్పత్తి, ఫ్యాక్టరీ ఉత్పత్తి ప్రతిదానిలో పాత్రదారులు.



మనిషి మనుగడకు శరీరంలో 70శాతం నీరు ఎంత అవసరమో సమాజ మనుగడకు దళిత, బహుజనులు అంతే అవసరం. దుక్కి దున్ని, నారు పోసి, నీరు పెట్టి రక్తాన్ని చెమటగా మార్చి పంటలు పండించి మీరు తిని బతికేందుకు మెతుకులు రాల్చుతున్నారే వారే దళిత, బహుజనులు. ఆ దళిత, బహుజనుల మీద గోమాంస భక్షకులని ముద్రవేసి వేటాడి వెంటాడి చంపుతున్నారే అదేనా మీ మానవత్వం? అదేనా మీ మనుధర్మ శాస్త్రం. తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్లు అనుకునే ఈ దళిత వ్యతిరేకులు, తెల్లని పాలు ఎలా వస్తున్నాయి. గోవును మేపగలమా, మేత కోసి పెట్టగలమా, తొట్టిలో పులిసిన కుడితిని పోయగలమా? దాని శరీరాన్ని రుద్ది కడుగగలమా, అది వేసే పేడ తీయగలమా? అనే ప్రశ్నలు మీలో మీరే వేసుకోండి? నిజం తెలుస్తుంది. గోవు చనిపోతే దాన్ని పాతర వేయడానికి పాడే మోయడానికి దళితులు కావాలి. మీరు కన్న పిల్లలు భూమి మీద పడకుండా మా అమ్మ మంత్రసాని చేతులతో ఆపి, కడిగి మైల సాపుజేసి ఇచ్చినప్పుడు కులం అడ్డు రాదు. మీరు చస్తే పాడె కట్టెలు కొట్టడానికి దళితులు కావాలి. మీ బట్టలు ఉతకడానికి దళిత, బహుజనులు కావాలి. గోవు శరీరంలో సలసల కాగుతున్న నెత్తురునడుగు దళిత, బహుజనుల సేవ. అది హాయిగా నెమరు వేసే గడ్డిని అడుగు దళిత, బహుజనుల సేవ ఎంతో? మీరు గోవులో ఉన్న రక్తమాంసాన్ని పాల రూపంలో పిండుకొని తాగితే తప్పులేదు. దాని కన్నబిడ్డకు కూడా పాలు మిగల్చకుండా పిండుకొని తాగితే అది గోపాపం కాదా? అది జీవించి ఉన్నంత కాలం పాలు, పెరుగు, వెన్న, నెయ్యి రూపాల్లో అందించినది మీకు. తన జీవిత చివరి దశలో మేము దానికి చేసిన సేవలకు మాకు ఆహారంగా అందివస్తున్నది. హిందూ ధర్మ సిద్ధాంతం ప్రకారం బ్రహ్మ దశావతారం వరహావతారం ఎత్తినాడు. అంటే మీరు చెప్పే హిందూ మత గ్రంథాలన్నీ బూటకం, కుల మతాల సాంప్రదాయ సిద్ధాంతమంతా నాటకం. మీరు తినే జంతువులు, పక్షులు ప్రాణులు కావా? మేకలు, జింకలు, దుప్పులు, కుందేళ్లు చివరకు నెమళ్లను కూడా చంపుక తింటున్నారు. వాటిని చంపి తినమని ఏ మత గ్రంథంలో ఉన్నది. మనిషిగా మనిషిని ప్రేమిస్తే కూడా మనుషులను చంపుతున్నారు.

ఆది మానవుని దశ నుండే ఏదో ఒక జంతువుని వధించి తన ఆకలి తీర్చుకుంటూ వస్తున్న చరిత్ర మీ మత గ్రంథంలో చదువలేదా? నాటి నుంచి నేటి వరకు మనిషి తనకు అందుబాటులో ఉన్న దాన్నే తిని బతుకుతున్నాడు. దళిత, బహుజనులు తమకు అందుబాటులో ఉన్న స్థోమతకు తగ్గ మాంసాన్నే తింటున్నారు. అయినా రాతియుగం నుంచి రాకెట్ యుగం దాకా ఎదిగిన మనిషిని కులం పేరా, మతం పేరా చంపటానికి మీరెవరు? మీకు మనుషులను చంపే అధికారం ఏ మతం, ఏ కులం ఇచ్చింది? ఎవరికి నచ్చిన ఆహారాన్ని వారు తింటున్నారు. ఎవరికి నచ్చిన మతాన్ని వారు స్వీకరిస్తున్నారు. ఏ దేవుని కొలవాలనిపిస్తే ఆ దేవుడిని పూజిస్తున్నారు. అయినా మతాన్ని కులాన్ని అడ్డుపెట్టుకొని మానవ జాతి మనుగడనే శాసించే అధికారం ఎక్కడిది. ఇక దళిత, బహుజన నాయకుల విషయానికొస్తే రిజర్వేషన్‌లో ఎంపీ, ఎమ్మెల్యేగా, మంత్రులుగా పదవులు అనుభవించినవారు చాలా మంది ఉన్నారు. అయినా అణగారిన బతుకులు మారలేదు. వారిపై జరిగే హత్యలు, అరాచకాలు, మానభంగాలు, కుల దూషణలు, మత విద్వేషాలు అలాగే కొనసాగుతున్నాయి. అయినా నోరు మెదపని దళిత, బహుజన నాయకులు ఉండటం మన దురదృష్టం. మన కులంలో పుట్టి, మన వాడలో బతికి, మనం అనుభవించిన జీవితాన్ని చవిచూసిన వారు పదవుల పందేరంలో చిక్కి పరాన్న జీవులుగా తయారవుతున్నారు. దళిత, బహుజనులపై జరుగుతున్న అసాంఘిక దురాగతాలు వారికి కనపడటం లేదా? మీలాగే అంబేద్కర్ కూడా అనుకుంటే ఈ పదవులు మీకు దక్కేవా? దళిత, బహుజనులతో నాకేంపని అనుకుంటే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసేవారా? రాజ్యాంగంలో మన హక్కులు పొందుపరచకుంటే ఈ పాటి అవకాశాలు దక్కేవా? నీ ఎమ్మెల్యే గిరిని, మంత్రి పదవిని వదులుకొని నీ జాతి కోసం రాలేవా? నీ జాతికంటే గొప్పదా ఆ పదవి. నీ వర్గం కంటే మిన్ననా ఆ గిరి. అందుకే దళిత, బహుజనులారా ఆలోచించండి, అంబేద్కర్ ఆశయాలు, మార్క్స్ సిద్ధాంతాలు కలగలిసినప్పుడే అనుకున్నది అమలు జరుగుతుంది. అందుకని నీల్ లాల్ జెండాకు అండగా నిలిచి దాన్ని ఆకాశంలో రెపరెపలాడించిన రోజు కులం మతం, దరిద్ర్యం రూపుమాగలం. 70 ఏండ్ల స్వతంత్ర్యంలో ఏ ఒక్క హక్కునూ సాధించుకోలేకపోయాం. కూలి చేసేవాడు ఇంకా దిగజారాడు. రైతు కూలిగా అడ్డాలో నిలిచాడు. లేదా ఉరిపెట్టుక చస్తున్నాడు. కార్మికుడు కంపెనీ గేటు దగ్గర కాపలాదారుడయ్యాడు. యువత పక్కదారి పట్టి దిక్కుతోచని స్థితికి దిగజారిపోతున్నది. విద్యార్థి చదువును కొనలేక చతికిల పడిపోతున్నాడు. అమ్మా, అక్కా, చెల్లి అచేతన స్థితికి నెట్టివేయబడ్డారు. అభాగ్యులుగా, అనాథలుగా, అసాంఘిక శక్తుల చేతిలోకి వెళ్లారు. అందుకే అందుకో నీల్‌లాల్ జెండా. అంబేద్కర్ కలలుగన్న ఆశయాలు పండా. మార్క్స్ సిద్ధాంతాలు దేశమంతా నిండా..

సెల్ : 7799863732, 9441087690

అంబేద్కర్ బాటలో....

దయ్యపు రాధాకృష్ణ

ఈ సమాజం చస్తుందా, బతుకుతుందా? అనేది ప్రధాన అంశం కాదు. మనం ఎలా బతికామన్నదే ముఖ్యం. బతకడం నా దృష్టిలో రెండు రకాలు, మొదటిది జీవితమనే యుద్ధంలో గెలిచి కీర్తి ప్రతిష్టలతో బతకడం, రెండవది యుద్ధంలో ఓడి, లొంగిపోయి బానిసత్వంతో బతకడం. ఈ రెండింటిలో నేను మొదటి దానికే ప్రాధాన్యతనిస్తాను' అని అంటారు అంబేద్కర్. అంబేద్కర్ జీవించినంతకాలం సమాజ మార్పు కోసం ఆర్థిక, ఆత్మగౌరవ, సమానత్వం కోసం యుద్ధం చేశాడు. అందుకే ఆయన జీవితం ఆశయాల కీర్తి ప్రతిష్టలతో దినదినానికి ప్రాచుర్యం పొందుతున్నాయి. దేశంలోనే గాక ప్రపంచ ఎల్లలు దాటి విశ్వవిజ్ఞాన మానవునిగా విఖ్యాతి పొందుతున్నారు. ఐరాసలో అంబేద్కర్ 126వ జయంతిని విశ్వవిజ్ఞాన దివస్‌గా ప్రకటించడం, దేశంలో సంవత్సరంపాటు ఆ వేడుకలు జరపడం, జయంతిని ఈ సంవత్సరం అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవంగా (అంబేద్కర్ పాఠశాల ప్రవేశం రోజున) నిర్వహించడంతో ఆయనకు సముచితస్థానం కల్పించడం సంతోషదాయక పరిణామం. భారతజాతికే గర్వకారణం. కానీ భారత ప్రధాని, సంఘపరివార్ శక్తులు దీక్షభూమిలో అంబేద్కర్‌ను స్మరిస్తూ పరమశివునిగా ప్రవచించడం, ఆయన వ్యతిరేక భావజాల సంఘర్షణను మొదలు పెట్టడం ఆందోళన కల్గించే విషయంగానే భావించాలి. డా॥బిఆర్.అంబేద్కర్ బాల్యం నుండి వివిధ దశలలో వ్యక్తిగతంగా సమాజ మార్పు కోసం నిరంతరం సమాజంతో సంఘర్షణ పడ్డారు. భారత సమాజ అంతరాలను అధ్యయనం చేశాడు. మూలాలను శోధించాడు, ఆకలింపు చేసుకున్నాడు. శాస్త్రోప శాస్త్రాలను నిశితంగా పరిశీలించాడు. ఒక తత్వవేత్తగా, కార్మిక నాయకుడిగా ఆర్థిక, సామాజిక రాజకీయవేత్తగా గుర్తింపు పొందాడు.

మనిషిని మనిషిగా చూసే, ప్రేమించే సమసమాజం కోసం కలలుగన్నాడు. పోరాటం చేశాడు. సమసమాజం అంటే మనుషులంతా సమానం, కుల, మత, ప్రాంత భేదాలు, అంతరాలు లేకుండా ఆస్తి, అంతస్తు, పదవులు, పాలనలో సమానంగా ఉండాలని, అందరూ సామాజిక స్థిరత్వంతో, ఆత్మగౌరవంగా జీవించాలని భావించాడు. కులగోడలు బద్దలు కొట్టాలని మనిషిని మనిషిగా చూడని, భావించబడని విడదీసే శాస్త్రాలను తగలబెట్టాలన్నారు. తానే మనుధర్మశాస్త్రాన్ని బహిరంగంగా తగలబెట్టారు. అంబేద్కర్ గొప్ప దేశభక్తుడు. జాతీయవాది. ఈ దేశంలో కులం, మతం, జాతుల మధ్య అంతరాలు, ఆర్థిక వ్యత్యాసాలున్నా, నిమ్నకులాలు, అంటరానితనం, కులవివక్షత విద్య, సంపద, పాలనకు దూరంగా ఉంచబడి అవమానాలు చేసినా " నేను, నా దేశం ఏది ముఖ్యమంటే దేశమే ముఖ్యమంటాను" అని అన్నాడు అంబేద్కర్. ఈ దేశం ఎలా ఉండాలని కోరుకుంటున్నారు అని మీరు నన్ను అడిగితే స్వేచ్ఛా, సమానత్వం, సోదరభావం గల సమాజాన్ని కోరుకుంటానన్నాడు అంబేద్కర్. స్వేచ్ఛ, సమానత్వం లేని సమాజంలో సోదరభావం కలనే అంటాడు.

అయితే పాలకులు అంబేద్కర్‌ను అట్టడుగు వర్గాలనుంచి వచ్చిన మేధావిగా, రాజ్యాంగ నిర్మాతగా, ఎక్కువ డిగ్రీలు పొందిన వారిగా మాత్రమే గుర్తిస్తున్నారా? ఆయన ఆశయాలను సమాజంలో అమలు చేసి, అభివృద్ధి చూపి కీర్తిస్తున్నారా? లేదా వ్యక్తిని ఆకాశానికెత్తి ఆయన ఆశయాలను నమ్ముకున్న జనాన్ని కులం పేరుతో శాశ్వతంగా దోపిడీ చేయాలని కుట్రలు జరుగుతున్నాయా? దళిత, శ్రామిక, బహుజనులలో వస్తున్న చైతన్యంతో పాలకులు తమ విధానాన్ని మార్చుకుంటున్నారా అనే విషయాల్ని పరిశీలించాలి. కులవివక్ష అంటరానితనం దేశంలో నానాటికీ పెరిగిపోతున్నది. కులగోడలు కూలడం కాదు బలంగా నిర్మించబడుతున్నాయి. దళితుల ఆహారం, వృత్తులపై దేశభక్తి పేరుతో దాడులు, హత్యలు చేస్తున్నారు. మనుషులకన్నా పశువులనే ఆరాధిస్తున్నారు. చేతబడి, మూఢనమ్మకాల పేరుతో మహిళలను, వృద్ధులను బలితీసుకుంటున్నారు. యజ్ఞాలు, యాగాలు, జ్యోతిష్యం, వాస్తులు, దేవుళ్ల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారు. కులాంతర వివాహాలు చేసుకుంటున్న వారిని 'పరువు' పేరుతో ప్రాణాలు తీస్తున్నారు. బ్రాహ్మణీయ భావాజాలాన్ని తూచ పాటిస్తూ, అమలు చేస్తూ పరోక్షంగా ప్రత్యక్షంగా అంబేద్కర్ ఆత్మగౌరవానికి అడ్డుపడుతున్నారు. భావ ప్రకటనా 'స్వేచ్ఛ' బంధికాన చేయబడుతున్నది. ప్రశ్నించే తత్వాన్ని సహించలేకుండా పోతున్నారు. ఆహారమైన, వృత్తియైనా, సినిమా అయినా, భక్తియైనా, బట్టయైనా తమ వాక్కే శిరోధార్యంగా ఉండాలంటున్నారు. బతకడానికి నిరసన తెలుపడానికి, హక్కులకోసం పోరాటం చేయడానికి స్వేచ్ఛ లేదంటున్నారు.

సరళీకరణ, ఆర్థిక విధానాల ఫలితంగా అసమానతలు పెరుగుతున్నాయి. దేశ సంపద కొందరి చేతుల్లో, విద్య, ఆరోగ్యం, ఉద్యోగాలు, పదవులు, భూములు, పరిశ్రమలు కొంతమందికే చెందుతున్నాయి. అత్యధిక ప్రజలు దారిద్ర్యంతో, ఆకలి బాధలతో, అనారోగ్యాలతో, నిరుద్యోగంతో ఉంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పడి 3 సంవత్సరాలు గడిచిపోయింది. ఈ కాలంలో దళితుల ఆర్థిక, సామాజిక మార్పుకోసం కృషి జరుగుతున్నాదా? ఈ మూడు సంవత్సరాల బీజేపీ ప్రభుత్వం ఎంతమంది దళితులకు భూమి పంచింది? ఉద్యోగాలిచ్చింది? ఉపాధి చూపించింది? రాష్ట్రంలో అభినవ అంబేద్కర్ కేసీఆర్ అని వకల్తా పుచ్చుకొనే నాయకులు ఎంతమంది దళిత గిరిజనులకు ఉద్యోగాలిచ్చారో, 3 ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూంలు, ఎస్సీ, ఎస్టీలకు కమిషన్, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేశారో చెప్పగలరా? 126 ఫీట్ల ఎత్తుతో అంబేద్కర్ విగ్రహాలను పెట్టడం, ఐరాసలో విశ్వవిజ్ఞాన్ దివస్‌గా చేయించడం అనందమే. కానీ పాలకులు చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకున్నట్టు అంబేద్కర్‌ను అవకాశవాదంతో ఆకాశానికెత్తి ఆయన జాతిని అధమ పాతాళానికి తొక్కాలన్న నీచ స్వభావాన్ని గుర్తించాలి. దేశంలో దళితులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అంటరానితనం, కుల వివక్ష ప్రపంచానికి తెలియనివ్వకుండా అడ్డుపడి, దోపిడీవర్గాలు తమ రక్షణ కోసం కులదోపిడీని నిరాటకంగా కొనసాగించడానికి పాలకులు చేస్తున్న కుట్రను గుర్తించాలి.

పాలకులు పైకి ఎన్ని నీతులు వల్లించినా ఆచరణలో మాత్రం అంబేద్కర్ ఆశయాలకు ఆమడదూరంలో ఉన్నది కండ్లకు కన్పిస్తున్నది. పాలకవర్గాలను నమ్మినంత కాలం మనం మోసపోతూనే ఉంటాం. "యాచన ద్వారా, ఆత్మ ప్రబోదం ద్వారా హక్కులు పొందలేం. నిరంతర పోరాటం ద్వారానే అది సాధించగలమంటారు అంబేద్కర్. నేడు భారతదేశంలో హిందూ మతోన్మాద శక్తుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. మనువాదాన్ని మనసారా ఆరాధించి ఆచరించే ఈ శక్తులు అంబేద్కర్ ఆశయాలకు దళితుల ఆర్థిక, సామాజిక స్థితిగతుల మార్పుకు తీవ్రమైన అవరోధంగా తయారవుతున్నారు. ఈ శక్తుల వికృతచేష్టలు దళిత, శ్రామిక, బహుజనుల ఆత్మగౌరవం, స్వేచ్ఛ హక్కులకు భంగం కల్గిస్తున్నాయి. ఈ ప్రమాదాన్ని దేశంలోని మనువాదులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రగతిశీల శక్తులు, అభ్యుదయవాదులు, అంబేద్కరిస్టులు, కమ్యూనిస్టులు, హేతువాదులు గుర్తించాలి. స్వేచ్ఛ, సమానత్వం కోసం ఐక్యతతో ముందుకు నడవాలి. ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, సమసమాజం కోసం, ఐక్య సంఘటనకు సిద్ధం కావాలి. ఈ సంఘటన ద్వారానే అంబేద్కర్ కలలుగన్న కులరహిత సమ సమాజం సాధ్యమవుతుంది.

సెల్: 7730877841

భోజనానికి కులం అడ్డు

సర్పంచ్ దళితుడని భోజనం నిరాకరించిన వైద్య సిబ్బంది

నాయిని యాదగిరి

కుల వివక్ష అనాదిగా వస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాల్లో మార్పు రావాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం వివక్ష కొనసాగుతూనే ఉంది. గజ్వేల్ మండలం సింగాటం గ్రామంలో ఇటీవల వైద్యులు వైద్య శిబిరం నిర్వహించగా, వారికి భోజన సదుపాయం తన ఇంట్లోనే కల్పించాడు గ్రామ సర్పంచ్. గ్రామ సర్పంచ్ దళితుడు కావడంతో ఆయన ఇంట్లో చేసిన వంటను తినేందుకు వైద్యులు నిరాకరించారు. దీనిపై గ్రామ సర్పంచ్ దాసరి నర్సింలు పోలీసులకు ఫిర్యాదు చేసినా, ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదు. దీని వెనుక అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు ఉన్నట్టు విమర్శలు వస్తున్నాయి. గ్రామంలో మొత్తం 3వేల జనాభా ఉండగా, 1500 వరకు ఓటర్లు ఉన్నారు. 53 దళిత ఇండ్లు ఉండగా, సుమారు 300 ఓటర్లు ఉన్నారు. మూడు ఎస్టీ కుటుంబాలున్నాయి. ఓసీలు, బీసీలు, కలిపి మెజార్టీ కుటుంబాలు గ్రామంలో నివాసముంటున్నాయి. 1959లో గ్రామ పంచాయతీగా ఏర్పడ్డ సింగాటం, తొలిసారిగా 2013లో దళిత సర్పంచ్‌కు అవకాశం కల్పించింది. అంతకు ముందు అగ్రకులాల వారే సర్పంచ్‌లుగా వ్యవహరించారు. గ్రామంలో వివక్ష బయటకు కనిపించని రూపంలో కొనసాగుతున్నది.

సింగాటం గ్రామంలో ఇటీవల ప్రజలకు వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామనీ, ఇందుకు 20 మంది వరకు వైద్య సిబ్బంది వస్తారనీ, గ్రామంలో షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి, ఎలెసీడీ రోగులకు ఈ చికిత్సలు అందిస్తామనీ సర్పంచ్ దాసరి నర్సింలుకు ఫోన్ ద్వారా స్థానిక ఏఎన్ఎం సుజాత తెలియజేశారు. గ్రామానికి వచ్చే ప్రభుత్వ వైద్యులకు, వైద్య సిబ్బందికి ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దని ఆ సర్పంచ్ తన ఇంట్లోనే భోజనాలు వండించాడు. 20 మంది గజ్వేల్ మండల పీహెచ్‌సీ పరిధిలోని సిబ్బంది సింగాటం గ్రామ పంచాయతీ వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం భోజనం సమయానికి భోజనాలు చేయాలని సర్పంచ్ నర్సింలు వారిని కోరారు. అంతలోనే వైద్య సిబ్బందికి అనుమానం వచ్చింది. "మీరు ఏంటోళ్లు? ఎక్కడ వంట చేశారు?" అని ప్రశ్నించారు. "నేనే సర్పంచ్‌ను.. వంట మా ఇంట్లోనే చేయించాను. అన్నం, కూర, పెరుగు అన్ని ఏర్పాటు చేశాను మేడం" అంటూ గ్రామ సర్పంచ్ తెలియజేశారు. పక్కకే ఉన్న గ్రామస్తులను సర్పంచ్ ఏ కులస్తుడని అడిగి తెలుసుకున్నారు. దళితుడని చెప్పడంతో అంతకు ముందు గ్రామ సేవకుడితో అంగన్‌వాడీ కేంద్రానికి భోజనాలు తీసుకు రావాలని కోరిన వారు ఆ తర్వాత సర్పంచ్ కులం తెలుసుకుని, భోజనాలను తీసుకు రావొద్దని, వెంటనే గ్రామ సేవకుడికి సమాచారం అందజేశారు. అక్కడి నుండి వెళ్లి అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాలు వండించుకుని తిన్నారు. దీంతో సర్పంచ్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.



సర్పంచ్ ఇంట్లో మిగిలిపోయిన వంటకాలు

సింగాటం గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం కోసం 23 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నప్పటికీ, సర్పంచ్‌కు ఉన్న ఎకరంన్నర అసైన్డ్ భూమిని అధికార పార్టీ నాయకులు తీసుకుని ఇండ్ల నిర్మాణం చేపడుతున్నారు. గ్రామంలో 40 ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు లబ్ధిదారులు ఎవరనేది తేల్చలేదు. గ్రామంలో చాలా మంది దళితులు పూరి గుడిసెల్లోనే జీవిస్తున్నారు. రిజర్వేషన్ వల్లనే దళితుడు సర్పంచ్ కాగలిగాడు. అయిదు దశాబ్దాలకు పైగా అగ్రకులాలే ఆ గ్రామాన్ని పాలించాయి. గ్రామంలో ఇప్పటి వరకు ఒక్క దళితుడికి కూడా మూడెకరాల భూమి ఇవ్వలేదు. దళితులు చాలా మంది గజ్వేల్ పట్టణానికి కూలీ నాలీ కోసం వస్తున్నారు. ఆర్థికంగా, రాజకీయంగా దళితులను గ్రామంలో అగ్రకుల పెద్దలు పెద్దగా జోక్యం చేసుకోనివ్వడం లేదు. గ్రామ పంచాయతీ తీర్మానాలు మాత్రం తీసుకుంటున్నారు. షాదిముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ విషయంలో కూడా పెద్దగా జోక్యం చేసుకోనివ్వడం లేనట్టు తెలిసింది.

సెల్ : 9490094428

గ్రామాల్లో ఇంకా వివక్ష ఉంది



గ్రామాల్లో ఇంకా వివక్ష కొనసాగుతున్నది. మారుతున్న కాలానికి అనుగుణంగా మనుషుల్లో మార్పు రావడం లేదు. మీదో కులం మాదో కులం అంటూ ఇంకా చర్చించుకోవడం కనిపిస్తుంది. అధికారులే సర్పంచ్‌ను అవమానించడం బాధాకరం. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఇప్పటి వరకు కేసు నమోదు కాకుండా అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తెస్తున్నారు.


- సందబోయిన ఎల్లయ్య, కేవీపీఎస్ నాయకులు

నా దృష్టికి రాలేదు

ఈ విషయం నా దృష్టికి రాలేదు. దళితుడిని అవమానపర్చడం సరైంది కాదు. ముందుగా సమాచారం ఇచ్చినందుకు వంట చేయడం సర్పంచ్ బాధ్యత, ఆయన బాధ్యతను నిర్వర్తించినప్పుడు, వైద్య సిబ్బంది ఇలా నిరాకరించడం నా దృష్టికి రాలేదు. సింగాటం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 140 మందికి పరీక్షలు నిర్వహించాం.

డాక్టర్ లింగారెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి, అహ్మదీపూర్

నా భూమి లాక్కున్నారు..



గ్రామంలో 23 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దాన్ని వదిలేసి నాకు ఉన్న ఎకరంన్నర భూమిని డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి తీసుకున్నారు. ఈ విషయంపై గడ అధికారికి కూడా ఫిర్యాదు చేశాను. నాకు న్యాయం చేయడం లేదు. ప్రస్తుతం సాగు చేసుకునేందుకు ఎలాంటి భూమి లేదు. భోజనం చేయకుండా నన్ను అవమానించిన వారిపై ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదు.

- దాసరి నర్సింలు, గ్రామ సర్పంచ్, సింగాటం

దళితులకు భూములివ్వాలి



గ్రామంలో దళితులకు ప్రభుత్వం భూములు ఇవ్వలేదు. దీంతో పనుల్లేక గజ్వేల్‌కు వెళ్లి కూలీ నాలీ చేసుకుంటున్నాం. గ్రామంలో సీసీ రోడ్లు, బిల్డింగ్ పనులు చేస్తుండ్రు. కానీ పని చూపడం లేదు. సర్కార్ మా గురించి ఆలోచించాలె.

- పెంటయ్య, సింగాటం

దళితులకు ఇండ్లు ఇయ్యాలె



గ్రామంలో నిర్మిస్తున్న 40 ఇండ్లను దళితులకు కేటాయించాలె. దళితులు గూన ఇండ్లలోనే బతుకీడ్చుతున్నారు. భూమిని కూడా సర్కార్ గుంజుకుంటుందన్నారు. మా పోరగాన్లకు ఉపాధి కూడా లేదు. గ్రామంలో బతకాలంటే కష్టంగా ఉంది. ప్రభుత్వం దళితులను పట్టించుకోవాలి.

- మాల నర్సింలు, సింగాటం

ఆరంభం అదిరింది

అండర్ 19 ప్రపంచ కప్

- తొలి పోరులో ఆస్ట్రేలియాపై భారత్ ఘనవిజయం
- పృథ్వీషా, మన్‌జోత్, శుభ్‌మన్ అర్ధ శతకాలు
- శివం, కమలేష్ పేస్ మెరుపులు



మౌంట్ మాంగనుయి : అండర్ 19 ప్రపంచ కప్‌లో యువభారత్ శుభారంభం చేసింది. సమిష్టి ప్రతిభతో గ్రూప్ బి తొలిపోరులోనే ఆస్ట్రేలియాపై వంద పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, భారత కెప్టెన్ పృథ్వీషా (94, 100 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అదరగొట్టాడు. ఓపెనర్ మన్‌జోత్ కల్‌రా (86, 99 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్స్) సహా శుభ్‌మన్ గిల్ (63, 54 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్స్)లు రాణించటంతో భారత్ 328 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. యువ పేసర్లు కమలేష్ నాగర్‌కోటి (3/29), శివం మావి (3/45))లు ప్రత్యర్థులను కట్టడి చేయటంతో ఛేదనలో కుర్ర కంగారూలు 228 పరుగులకే కుప్పకూలారు. పటిష్ట ఆస్ట్రేలియాను ఆటాడుకున్న భారత్ తొలి పోరులో సత్తా చాటి మిగిలిన జట్లకు సవాల్ విసిరింది. తదుపరి మ్యాచ్‌లో భారత్, పపువా న్యూగినియాతో మంగళవారం తలపడనున్నది.

ఓపెనర్ల జోరు : టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. కెప్టెన్ పృథ్వీషా, మన్‌జోత్‌లు చెలరేగి ఆడారు. చెరో అర్ధ శతకం అందుకున్నాక ఈ జంట జోరుకు అడ్డులేకుండా పోయింది. చేష్టలుడిగి చూడటం ఆసీస్ బౌలర్ల వంతయింది. కంగారూ బౌలర్లకు చుక్కలు చూపించిన ఈ జోడీ తొలి వికెట్‌కు 180 పరుగులు భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. దూకుడుగా ఆడిన పృథ్వీషా శతకానికి ఆరు పరుగుల దూరంలో వెనుదిరిగాడు. సూదర్లాండ్ బంతికి వికెట్ కీపర్ హోల్ట్ చేతిలో క్యాచౌట్ అయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన శుభ్‌మన్ సైతం దూకుడుగా ఆడాడు. పరం ఉప్పల్ బౌలింగ్‌లో జేసన్ సంగాకు క్యాచ్ ఇచ్చిన మన్‌జోత్ క్రీజును వీడగా.. హిమాన్షు రానా (14) సహకారంతో కలిసి శుభ్‌మన్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఆఖరు ఐదు ఓవర్లలో భారత్ నాల్గు వికెట్లు కోల్పోయింది. అభిషేక్ శర్మ (23) ఆఖరి మెరుపులతో భారత్ 328 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. కమలేష్ నాగర్‌కోటి (11 నాటౌట్), ఆర్యన్ జుయాల్ (8 నాటౌట్) అజేయంగా నిలిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో జాక్ ఎడ్వర్డ్స్ ఒక్కడే నాల్గు వికెట్లు కూల్చాడు.

ఆసీస్ విలవిల: భారత పేసర్ల ధాటికి ఆసీస్ విలవిలలాడింది. ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ (73) ఓపెనింగ్‌లో మనోళ్ల సహనాన్ని పరీక్షించినా.. అనుకూల్ బంతికి బౌల్డయ్యాడు. మరో ఓపెనర్ మాక్స్ బ్రేంట్ (29), జోనాథన్ మెర్లో (38), వికెట్ కీపర్ బాక్స్‌టర్ హోల్ట్ (39) మినహా ఎవరూ రాణించలేదు. మనోళ్ల పేస్ ధాటికి రక్షణాత్మక ఆటతీరు కనబరిచిన ఆస్ట్రేలియా.. 43 ఓవర్ల దాకా వికెట్లు కాపాడుకోగలిగినా.. లక్ష్యాన్ని ఛేదించటంతో మాత్రం చతికిల బడింది. 228 పరుగులకే ఆలౌట్ అయింది. కీలక బ్యాట్స్‌మెన్‌ను కమలేష్ నాగర్‌కోటి పెవీలియన్ చేర్చగా, శివం మావి టెయిలెండర్ల పనిపట్టాడు. వీరిద్దరూ చెరో మూడు వికెట్ల పడగొట్టారు. అనుకూల్ రాయ్, అభిషేక్ శర్మలకు చెరో వికెట్ దక్కింది.

భారత ఇన్నింగ్స్ : పృథ్వీషా (సి) హోల్ట్ (బి) సూదర్లాండ్స్ 94, మన్‌జోత్ కల్‌రా (సి) జేసన్ (బి) ఉప్పల్ 86, శుభ్‌మన్ గిల్ (సి,బి) ఎడ్వర్డ్స్ 63, హిమాన్షు రానా (సి) ఆస్టిన్ (బి) ఎడ్వర్డ్స్ 14, అనుకూల్ రాయ్ (సి) జేసన్ (బి) ఆస్టిన్ 6, అభిషేక్ శర్మ (సి) సూదర్లాండ్స్ (బి)ఎడ్వర్డ్స్ 23, కమలేష్ నాగర్‌కోటి నాటౌట్ 11, శివ సింగ్ (బి) ఎడ్వర్డ్స్ 10, ఆర్యన్ జుయాల్ నాటౌట్ 8, ఎక్స్‌ట్రాలు 13, **మొత్తం : (50 ఓవర్లలో 7 వికెట్లకు) 328.**

బౌలింగ్ : బార్లెట్ 7-1-47-0, జేసన్ 5-0-26-0, సూదర్లాండ్స్ 10-0-55-1, ఎడ్వర్డ్స్ 9-0-65-4, లాయిడ్ పోప్ 3-0-22-0, జోనాథన్ 2-0-13-0, ఉప్పల్ 8-0-35-1, ఆస్టిన్ 6-0-64-1.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ : జాక్ ఎడ్వర్డ్స్ (బి) అనుకూల్ రాయ్ 73, మాక్స్ బ్రేంట్ (సి) శివం మావి (బి) నాగర్‌కోటి 29, జేసన్ సంఘా (సి) పృథ్వీషా (బి) అభిషేక్ 14, జోనాథన్ మెర్లో (బి) శివం మావి 38, పరం ఉప్పల్ రనౌట్ (శివం/ఆర్యన్) 4, ఆస్టిన్ వాగ్ (సి) ఆర్యన్ జుయాల్ (బి) నాగర్‌కోటి 6, విల్ సూదర్లాండ్స్ (బి) నాగర్‌కోటి 10, బాక్స్‌టర్ హోల్ట్ (ఎల్‌బీ) (బి) శివం మావి 39, గ్జేవియర్ బార్ట్‌లెట్ (సి) ఆర్యన్ (బి) శివం మావి 7, జేసన్ రాల్‌స్టన్ రనౌట్ (రానా/శివం మావి) 3, లాయిడ్ పోప్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 5, **మొత్తం : (42.5 ఓవర్లలో 10 వికెట్లకు) 228.**

బౌలింగ్ : శివం మావి 8.5-1-45-3, ఇషాన్ పోరెల్ 4.1-0-24-0, శివ సింగ్ 6.5-0-30-0, కమలేష్ నాగర్‌కోటి 7-1-29-3, అభిషేక్ శర్మ 7-0-33-1, హిమాన్షు రానా 4-0-30-0, అనుకూల్ రాయ్ 5-0-36-1.

మహా సంగ్రామం

నేటి నుంచే ఆస్ట్రేలియా ఓపెన్ తొలి రౌండ్ మ్యాచులు

- హాట్ ఫేవరెట్‌గా రోజర్ ఫెడరర్
- భారత్ తరఫున బరిలో యుకీ

టెన్నిస్ అభిమానులకు పక్షం రోజుల పండుగ వచ్చేసింది. నేటి నుంచి ఆస్ట్రేలియా ఓపెన్ ప్రధాన టోర్నీ మొదలవ్వనున్నది. సంక్రాంతి రోజు ఆరంభం కానున్న పోరులో.. దిగ్గజాలు సహా కుర్ర ఆటగాళ్లు గ్రాండ్‌స్లామ్ ఆశలతో మెల్‌బోర్న్ హార్డ్ కోర్టులో అడుగుపెడుతున్నారు. గాయాల కారణంగా పలువురు సీనియర్ ఆటగాళ్లు టోర్నీకి దూరమైన వేళ.. ఢిఫెండింగ్ చాంప్ ఫెడెక్స్ టైటిల్ నిలుపుకోవాలని చూస్తున్నాడు. మరో పక్క గాయాలతోనే ప్రపంచ నెంబర్ వన్ నడాల్, మాజీ నెంబర్ వన్ జకోవిచ్‌లు సమరానికి సై అంటున్నారు. మరి పాతిక కోట్ల ప్రైజ్ మనీ నెగ్గేదెవరో, వేచి చూడాల్సిందే!.

నవతెలంగాణ-మెల్‌బోర్న్

గాయాలు, ఆరోగ్య సమస్యలతోనే దిగ్గజ టెన్నిస్ ఆటగాళ్లందరూ కొత్త ఏడాదిలోకి అడుగు పెట్టారు. చూస్తుండగానే తొలి గ్రాండ్‌స్లామ్ సంగ్రామానికి వేళయింది. డిఫెండింగ్ చాంపియన్, స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరెర్ ఈ సారి కూడా టైటిల్ ఫేవరెట్‌గా ఉన్నాడు. గతేడాది రన్నరప్, ప్రస్తుత ప్రపంచ నెంబర్ వన్ రఫెల్ నడాల్ మోకాలి సమస్యతోనే మెల్‌బోర్న్‌లో పోరుకు సై అంటున్నాడు. మాజీ నెంబర్ వన్, 12 సార్లు గ్రాండ్‌స్లామ్ విజేత నొవాక్ జకోవిచ్ మోచేతి గాయంతో టోర్నీలో అడుగుపెట్టాడు. ఇంగ్లాండ్ స్టార్ ఆటగాడు ఆండీ ముర్రే, ఏషియా నెంబర్ వన్ కీ నిషికొరిలు సైతం గాయాల కారణంగా టోర్నీలో లేరు. దీంతో అద్భుత ఫామ్‌లో ఉన్న ఫెడరర్ ఈ ఏడాది టైటిల్‌పై కన్నేశాడు. మహిళలల్లో డిఫెండింగ్ చాంపియన్, అమెరికన్ స్టార్ క్రీడాకారిణి సెరెనా విలియమ్స్ ఆస్ట్రేలియా ఓపెన్ బరిలో లేకపోవటంతో టైటిల్ ఎవరిని వరిస్తుందో చెప్పటం కష్టమే.అయితే, 15 నెలల డోప్ నిషేధం అనంతరం గతేడాది పునరాగమనం చేసిన మరియా షరపోవా ప్రదర్శనపైనే అందరి చూపు.

ఫెడరర్‌పై భారీ అంచనాలు



యుకీ బాంబ్రీ

వరుసగా ఐదేండ్లు మేజర్ టైటిల్ విజయం కోసం పరితపించిన స్విస్ దిగ్గజం.. గతేడాది ఏకంగా రెండు గ్రాండ్‌స్లామ్స్ టైటిళ్లు నెగ్గాడు. వయసు మీద పడుతోన్నా అదే ఫామ్‌ను కొనసాగిస్తూ మెల్‌బోర్న్ హార్డ్‌కోర్ట్‌లో హాట్ ఫేవరెట్‌గా అభిమానుల హార్ట్ దోచుకునేందుకు సిద్ధమ య్యాడు. ఐదు సార్లు ఆస్ట్రేలియా ఓపెన్ నెగ్గిన 36 ఏండ్ల స్విస్ ఘనుడు, ఆరో టైటిల్ ఖాతాలో వేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. గతేడాది ఇదే వేదికన ప్రపంచ నెంబర్ వన్, రఫెల్ నడాల్‌ను ఫైనల్లో ఓడించి టైటిల్ కొల్లగొట్టిన ఫెడరర్.. ఈసారి అదే ఉత్సాహంతో ఉన్నాడు. 'వయసు కారణంగా నేను పూర్తిస్థాయిలో రాణించలేకపోవచ్చు. రఫా (నడాల్), ఆరుసార్లు ఇక్కడ విజేతగా నిలిచిన నొవాక్‌లు అసలైన ఫేవరెట్లు. అయితే, ఫేవరెటా, కాదా అనేవి మాటలవరకే పరిమితం. అంతిమంగా డ్రాలు కష్టంగా ఉన్నాయి. మేలైన ప్రతిభగల ఆటగాళ్లెందరో పోటీలో ఉన్నారు.' అంటోన్న ఫెడరర్.. గతేడాది రెండు మేజర్ టైటిళ్లు సహా ఐదు ఏటీపీ టూర్ ఈవెంట్లలో గెలుపొందాడు. కొత్త ఏడాదిలో ఆడిన నాల్గు సింగిల్స్ మ్యాచుల్లోనూ విజయం సాధించాడు. ఇక ఈసారి ఫెడరర్‌కు నడాల్ నుంచి ఏమంత గట్టి పోటీ ఎదురుకాకపోవచ్చనేది క్రీడా పండితుల అభిప్రాయం. తొలి రౌండ్‌లో అల్‌జాజ్ బెడెన్‌తో తలపడనున్నాడు ఫెడరర్. తదుపరి రౌండ్లలో మాజీ చాంపియన్ డెల్ పోట్రో, డెవిడ్ గోఫిన్‌లు ఎదురయ్యే అవకాశమున్నది.



నడాల్

జకోవిచ్

గాయాలతోనే నడాల్, నొవాక్

గతేడాది రెండు మేజర్ టైటిళ్లు ఫెడరర్ వశం కాగా, రెండు గ్రాండ్‌స్లామ్‌లను తన పేరిట రాసుకున్నాడు రఫెల్ నడాల్. మోకాలి గాయానికి శస్త్ర చికిత్స అనంతరం పలు టోర్నీల్లో తడబడిన స్పెయిన్ దిగ్గజం. ఫెడెక్స్‌కు మళ్లే గతేడాది మెరిశాడు. బరిలో దూకుడుగా ఆడే నడాల్ ఈసారి అదే స్థాయి ప్రదర్శన చేయాలని ఆశిస్తోన్నా.. గాయం ఏ మేరకు ప్రభావం చూపుతుందో తెలీదు. అయితే ఫైనల్ అవకాశాలకు గాయం గండికొట్టే ఛాన్సుంది. తొలి రౌండ్‌లో నడాల్.. విక్టర్ బర్గర్‌ను ఢీకొట్టనున్నాడు. ఫైనల్ దారిలో నడాల్‌కు అమెరికన్ స్టార్ జాన్ ఇస్నర్ ఎదురుపడే అవకాశమున్నది. గాయంతో సతమతమవుతున్న మరో స్టార్ ప్లేయర్, ఆస్ట్రేలియా ఓపెన్‌లో అదరిపోయే రికార్డున్న సెర్బియా యోధుడు నొవాక్ జకోవిచ్. గతేడాది వింబుల్డన్‌లో గాయంతో క్వార్టర్స్‌లోనే వెనుదిరిగిన జకోవిచ్.. పలు కీలక టోర్నీలకు దూరమయ్యాడు. తాజా ఈవెంట్లో 14వ సీడ్‌గా బరిలో దిగనున్నాడు. తొలి రౌండ్‌లో డొనాల్డ్ యంగ్‌తో పోరు సల్పనున్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోకుండానే మెల్‌బోర్న్‌లో అదృష్టం పరీక్షించుకోనున్నాడు 30 ఏండ్ల జకోవిచ్. నడాల్, జకోవిచ్‌లతో పాటు 2014 చాంపియన్, స్టాన్ వావ్రింకా సైతం టైటిల్‌పై కన్నేశాడు. గతేడాది వింబుల్డన్‌లో గాయం బారిన పడిన 32 ఏండ్ల వావ్రింకా.. మెల్‌బోర్న్ ఎలా రాణిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. వీరితో పాటు గ్రిగర్ దిమిత్రోవ్, అలెగ్జాండర్ జ్వెరెవ్, డొమినిక్ థీమ్, మారిన్ సిలిచ్‌లు టైటిల్ బరిలో ఉన్నారు. భారత్ తరఫున ఆస్ట్రేలియా ఓపెన్‌లో నిలిచిన ఏకైక ఆటగాడు యుకీ బాంబ్రీ. ఆదివారం జరిగిన మూడో అర్హత పోరులో యుకీ 1-6, 6-3, 6-3తో పొలాన్స్కీపై గెలుపొంది ప్రధాన టోర్నీలో అడుగుపెట్టాడు. మరో భారత ఆటగాడు రామ్‌కుమార్ రామ్‌నాథన్ 4-6, 6-4, 4-6తో పోస్పిసిల్ చేతిలో ఓడి ఇంటిముఖం పట్టాడు.

మహిళల్లో నెగ్గేదెవరో


డిఫెండింగ్ చాంపియన్ సెరెనా విలియమ్స్ పోటీలో లేకపోవటంతో మహిళల సింగిల్స్ టైటిల్ విజయం ఎవరిని వరిస్తుందనే విషయం ఆసక్తి రేకెత్తిస్తున్నది. అగ్ర క్రీడాకారిణీలందరూ టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నారు. సిమోన హాలెప్, కరోలినా వోజ్నియాకి, గార్బినే ముగురుజాల మధ్య బలమైన పోటీ ఉండనున్నది. ఇక ఎలీనా స్విటోలినా, మరియా షరపోవా, వీనస్ విలియమ్స్‌కూ అవకాశాలున్నాయి. వీరిలో ఇటీవలే ముగిసిన బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ విజయంతో స్విటోలినా జోరుమీదున్నది. జెలెనా ఒస్టాపెంకో, స్లోనే స్టీఫెన్స్‌లు మెల్‌బోర్న్ బరిలో అదృష్టం పరీక్షించుకోనున్నారు. మాజీ చాంపియన్ రష్యా సుందరి మరియా షరపోవా 47వ సీడ్‌గా ఆడనున్నది. తొలి రౌండ్‌లో తజానా మరియాతో తలపడనున్నది.



రోజర్ ఫెడరర్

భారత్ ధీటుగా..

- కోహ్లి, విజయ్ మెరుపులు
- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 183/5, ఆసీస్ 335/10
- సెంచూరియన్ టెస్టు రెండో రోజు



కోహ్లి (85)*

నవతెలంగాణ-సెంచూరియన్

రెండో రోజు సెంచూరియన్ టెస్టుపై భారత్ పట్టు బిగించింది. భారత సారథి విరాట్ కోహ్లి (85 బ్యాటింగ్, 130 బంతుల్లో 8 ఫోర్లు), ఓపెనర్ మురళీ విజయ (46 బ్యాటింగ్, 126 బంతుల్లో 6 ఫోర్లు) రాణించటంతో రెండో రోజు ఆటముగిసే సమయానికి భారత్ ఐదు వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. అంతకుముందు ఇషాంత్ శర్మ మెరుపులతో కీలక డుప్లెసిస్ వికెట్ కోల్పోయిన దక్షిణాఫ్రికా 335 పరుగులతో తొలి ఇన్నింగ్స్ ముగించింది. హార్దిక్ పాండ్య (11 బ్యాటింగ్) నైట్ వాచ్‌మన్‌గా ఉన్నాడు. 152 పరుగుల వెనుకంజలో ఉన్నది భారత్. నేడు కోహ్లి జోరు ఇలాగే కొనసాగితే భారత్ తొలికు తొలి ఇన్నింగ్స్‌లోనే ఆధిక్యం లభించటం ఖాయం.

కోహ్లి దూకుడు : భారత్‌కు ఆదిలోనే ఎదురు దెబ్బ. ఓపెనర్ కేఎల్ రాహుల్ (10) పదో ఓవర్ మూడో బంతికే కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో డికాక్‌కు క్యాచ్ ఇచ్చాడు. వన్ డౌన్‌లో వచ్చిన చటేశ్వర్ పుజారా తదుపరి బంతికే సమన్వయ లోపం కారణంగా రనౌట్ అయ్యాడు. 28 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న భారత్‌ను విరాట్ కోహ్లి (85), మరో ఓపెనర్ మురళీ విజయ్ (46) ఆదుకున్నారు. మురళీ అండగా కోహ్లి రెచ్చిపోయాడు. మురళీ అనంతరం రోహిత్ (10), పార్థివ్ (19) ఎక్కువ సేపు క్రీజులో నిలువలేదు. ఆట ముగిసే సమయానికి కోహ్లికి తోడుగా పాండ్య (11 నాటౌట్) అజేయంగా నిలిచాడు. అంతకుముందు 269/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా డుప్లెసిస్ (63) కు జీవం అంది, అర్ధ శతకం చేయటంతో 335 పరుగులు చేసింది. రెండో రోజు ఇషాంత్ రెండు, అశ్విన్, షమి చెరో వికెట్ తీశారు.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : డీన్ ఎల్గార్ (సి) మురళీ విజయ్ (బి) రవిచంద్రన్ అశ్విన్ 31, ఏడెన్ మార్క్‌రం (సి) పార్థివ్ పటేల్ (బి) రవిచంద్రన్ అశ్విన్ 94, హషీమ్ ఆమ్లా రనైట్ (హార్దిక్ పాండ్య) 82, ఏబీ డివిలియర్స్ (బి) ఇషాంత్ శర్మ 20, డుప్లెసిస్ (బి) ఇషాంత్ 63, క్వింటన్ డికాక్ (సి) విరాట్ కోహ్లి (బి) అశ్విన్ 0, వెర్నన్ ఫిలాండర్ రనౌట్ (పార్థివ్ పటేల్/హార్దిక్ పాండ్య) 0, కేశవ్ మహరాజ్ (సి) పార్థివ్ పటేల్ (బి) షమి 18, కగిసో రబాడా (సి) హార్దిక్ పాండ్య (బి) ఇషాంత్ 11, మోర్నీ మోర్కెల్ (సి) విజయ్ (బి) అశ్విన్ 6, లుంగిసని ఎంగిడి నాటౌట్1, ఎక్స్‌ట్రాలు 9, **మొత్తం : (113.5 ఓవర్లలో 10 వికెట్లకు) 335.**

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 22-6-60-0, మహమ్మద్ షమి 15-2-58-1, ఇషాంత్ శర్మ 22-4-46-3, హార్దిక్ పాండ్య 16-4-50-0, రవిచంద్రన్ అశ్విన్ 38.5-10-113-4.

భారత్ తొలి ఇన్నింగ్స్ : మురళీ విజయ్ (సి) డికాక్ (బి) మహరాజ్ 46, లోకేష్ రాహుల్ (సి,బి) మోర్కెల్ 10, చటేశ్వర్ పుజారా రనైట్ (లుంగి) 0, విరాట్ కోహ్లి బ్యాటింగ్ 85, రోహిత్ శర్మ ఎల్‌బి (బి) రబాడా 10, పార్థివ్ పటేల్ (సి) డికాక్ (బి) లుంగి 19, హార్దిక్ పాండ్య బ్యాటింగ్ 11, ఎక్స్‌ట్రాలు 2, **మొత్తం : (61 ఓవర్లలో 5 వికెట్లకు) 183.**

బౌలింగ్ : కేశవ్ మహరాజ్ 16-1-53-1, మోర్నీ మోర్కెల్ 15-3-47-1, వెర్నన్ ఫిలాండర్ 9-3-23-0, కగిసో రబాడా 12-0-33-1, లుంగిసని ఎంగిడి 9-2-26-1.



హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఫస్ట్ తెలంగాణ క్రికెట్ కప్ టోర్నమెంట్‌లో ఫలక్‌నుమా సీసీ టీమ్ కప్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

పీబీఎల్ విజేత హైదరాబాద్

ఫైనల్లో బెంగళూర్‌పై 4-3తో గెలుపు • మెరిసిన మారిన్, డబుల్స్ స్టార్స్



కరోలినా మారిన్

నవతెలంగాణ క్రీడా ప్రతినిధి-గచ్చిబౌలి

హైదరాబాద్ హంటర్స్ పీబీఎల్ టైటిల్ ఎత్తుకున్నది. గత రెండు సీజన్లుగా ఊరించిన బ్యాడ్మింటన్ లీగ్ కిరీటాన్ని హంటర్స్ వేటాడింది. సొంతగడ్డపై జరిగిన టైటిల్ పోరులో రెచ్చిపోయిన హైదరాబాద్ పీబీఎల్ మూడోసీజన్ విజేతగా అవతరించింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో బెంగళూర్ బ్లాస్టర్స్‌తో జరిగిన తుది పోరులో హైదరాబాద్ హంటర్స్ 4-3తో గెలుపొందింది. నాల్గు మ్యాచులు ముగిసే సరికి ఇరు జట్లూ 3-3తో సమవుజ్జీగా నిలిచాయి. ఈ తరుణంలో మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్ విజేతను నిర్ణయించింది. సెమీఫైనల్లో అహ్మదాబాద్‌పై మిక్స్‌డ్ డబుల్స్ విజయంతో బెంగళూర్‌ను ఫైనల్స్‌కు చేర్చిన సిక్కి రెడ్డి, కిమ్ సా రంగ్ జోడీ టైటిల్ పోరులో బ్లాస్టర్స్‌ను నిరాశపరిచింది. సాత్విక్ సాయిరాజ్ రాంకీ రెడ్డి, జెబాదిన్ బెర్నాడెట్ జోడీ మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో హైదరాబాద్‌ను విజయానికి చేర్చటమే కాదు 4-3తో పీబీఎల్ విజేతగా నిలిపారు. పీబీఎల్ టైటిల్‌ను గత సీజన్లలో ఢిల్లీ ఏసర్స్, చెన్నై స్మాషర్స్ గెల్చుకున్నాయి. పీబీఎల్ ఫైనల్స్‌కు తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ దంపతులు హాజరయ్యారు. బ్యాడ్మింటన్ తారలు పి.వి సింధు, కిదాంబి శ్రీకాంత్‌లు అభిమానుల దృష్టిని తమ వైపునకు తిప్పుకున్నారు.

'మిక్స్‌డ్'లో తేలిన ఫలితం : టైటిల్ విజేతను నిర్ణయిచే తుది సమరం ఆద్యంతం ఆసక్తిగా సాగింది. తొలుత మెన్స్ డబుల్స్‌లో బెంగళూర్ నెగ్గగా, తర్వాత మెన్స్ సింగిల్స్‌లో హైదరాబాద్ పైచేయి సాధించింది. ఇరు జట్లూ ట్రంప్ మ్యాచుల్లో నెగ్గటంతో తుది ఫలితం కోసం ఆఖరి మ్యాచ్ వరకూ ఆగాల్సి వచ్చింది. మెన్స్ డబుల్స్‌లో 15-9, 15-10 తో మథియస్, కిమ్ సా రంగ్ జోడీ బెంగళూర్‌కు విజయాన్ని అందించారు. తర్వాత మెన్స్ సింగిల్స్ తొలి మ్యాచ్‌లో లీ హ్యూన్ హైదరాబాద్‌ను నిలబెట్టాడు. ఈ మ్యాచ్‌ను హైదరాబాద్ ట్రంప్‌గా ఎంచుకున్నది. 15-7, 15-13తో సుభాంకర్ దేపై గెలుపొందాడు. దీంతో హైదరాబాద్‌కు రెండు పాయింట్లు లభించాయి. 2-1తో హైదరాబాద్ ముందంజ వేసింది. మెన్స్ సింగిల్స్ రెండో మ్యాచ్‌ను బెంగళూర్ ట్రంప్‌గా ఎంచుకున్నది. విక్టర్ అక్సెల్సన్ బ్లాస్టర్స్‌కు అలవోక విజయాన్ని అందించాడు. 15-8, 15-10తో బి. సాయిప్రణీత్‌పై విక్టర్ గెలుపొందటంతో బెంగళూర్ రెండు పాయింట్లు సాధించింది. దీంతో 3-2తో బెంగళూర్ ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ సమయంలో కీలక మహిళల సింగిల్స్‌లో కరొలినా మారిన్ అదరగొట్టింది. ఈ మ్యాచ్‌లో ఓడితే హైదరాబాద్ టైటిల్‌పై ఆశలు వదులుకునే ప్రమాదంలో ఉన్న తరుణంలో మారిన్ మెరిసింది. 15-8, 15-14తో క్రిస్టీ గిల్మర్‌పై వరుస గేముల్లో గెలుపొందింది. గిల్మర్ పోరాడినా మారిన్ ఆమెకు అవకాశం ఇవ్వలేదు. హైదరాబాద్ విజయంతో స్కోరు బోర్డు సమీకరణం 3-3కు వచ్చింది. దీంతో ఆఖరు మ్యాచ్, మిక్స్‌డ్ డబుల్స్ ఫలితం విజేతను నిర్ణయించింది. హైదరాబాద్ షట్లర్లు సాయి సాత్విక్‌రాజ్ రాంకీ రెడ్డి, జెబాదిన్ బెర్నాడెట్‌లు వరుస గేముల్లో చెలరేగారు. సిక్కి రెడ్డి, కిమ్ సా రంగ్‌లు ప్రతిఘటించినా 15-11, 15-12తో విజయం సాధించారు. హైదరాబాద్‌ను పీబీఎల్ మూడో సీజన్ విజేతగా నిలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.